నవయుగ


ఆగష్టు ప్రత్యేక సంచిక



ఇందులో

స్త్రీ విద్యార్థి యువజన

మాస పత్రిక



పొట్టకూటికై దినమెల్ల
కల్లుగీతపై శ్రమచేసేవ్యక్తి

ఫొటో: నాగేశ్వర చౌదరి
దావాజీపాలెం

ప్రజా జీవిత చిత్రాలు

ఈ శీర్షిక క్రింద ప్రచురణకు యువ ఫొటోగ్రాఫర్లనుండి అనేక చిత్రాలు వస్తున్నాయి. పంపే చిత్రాలు బ్లాకులు తయారు చేయుటకు అనువుగా ఉండుటలేదు. ముందు ఈ శీర్షిక క్రింద ప్రచురించుటకు చిత్రంతోపాటు ఫొటో 'నెగిటివ్' పంపగోరుతున్నాం. పనిపూర్తి కాగానే ఎవరి 'నెగిటివ్' లు వారికి తిరిగి పంపబడును.

— సంపాదకుడు.

★



మిరపకాయల
తూచుట

ఫొటో: కొల్లి నాగేశ్వరరావు
కిష్కిందపాలెం

నవయుగ

ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి, యువజన మాసపత్రిక.

సంపుటి 1 | 1947 ఆగస్టు | సంచిక 6

★ సంపాదకీయం

ఆగస్టు - మన కర్తవ్యం

ఆగస్టు సంవత్సరంలో మరువలేని మాసం. చారిత్రక ప్రాముఖ్యత గల అనేక ఘటన లీ నెలలో జరిగాయి.

"స్వరాజ్యం నా జన్మహక్కని" సింహగర్జనలుచేసి, నిద్రించు చున్న భారత ప్రజాసమూహాన్ని స్వతంత్ర భావాలతో మేల్కొలిపి భారతీయులను సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సమీకరించిన శ్రీ బాలగంగాధర తిలక్ వర్థంతి దినోత్సవమీ ఆగస్టు 1 నే.

భారతీయులు యితర జాతులతో సాటియైనవారని ఖండఖండాన చాటి తన ప్రజ్ఞా నైపుణ్యంతో నిరూపించి ప్రపంచజాతుల సమూహంలో భారతదేశానికి పేరుతెచ్చిన శ్రీ స్వర్గీయ రవీంద్రనాధ్ ఠాగూరు స్మారక దినోత్సవ మీ ఆగస్టు 7 నే.

ఆగస్టు 9, భారతీయులకు మరపురాని దినం. ఆగస్టు 9 గుర్తుకు రాగానే ప్రతి భారతీయుని శరీరం పులకరిస్తుంది. సామ్రాజ్యవాదులు మన జాతీయోద్యమ విచ్ఛిన్నానికి జరిపిన హత్యాకాండ కండ్లముందు కన్పిస్తుంది. భారత జాతీయోద్యమాన్ని సమూలంగా నాశనంజేయుటకు సామ్రాజ్యవాదులు కుట్రలుపన్ని చర్చిల్ ముఠా నాయకత్వాన మన జాతీయోద్యమంపై దండయాత్ర ప్రారంభించింది ఆగస్టు 9 నే.

సామ్రాజ్యవాదులు నిర్బంధ విధానంతోను, కాల్పులతోను భారత ప్రజలలోని స్వతంత్రాన్ని నిర్మూలించలేమని గుర్తించారు. భారతీయులకు అధికారాన్ని హస్తగతంజేయుచున్నట్లు కల్లిబొల్లి కబుర్లుపల్కుచూ భారతదేశంపై తమపెత్తనాన్ని నూతనపద్ధతులలో నిల్పుకొన జూస్తున్నారు. ఈ పంథాయొక్క స్వరూపమే ఆగస్టు 15 న జరుగబోవు దేశవిభజన. ఈ నాటినుండి సామ్రాజ్యవాదుల కీలుగుర్రాలయిన స్వదేశసంస్థానాలు "స్వాతంత్ర్య" దేశాలవనున్నాయి. పాకిస్థాన్, హిందూస్థాన్ల కింద భారతభూమి రెండుముక్కలుగా నున్నది.

1942 ఆగస్టు 9 న భారతజాతీయోద్యమాన్ని సర్వనాశనం జేయుటకు సామ్రాజ్యవాదులు దాడిచేసి విఫలులయ్యారు. కాని 1947 ఆగస్టు 15 ప్రణాళికను, విభజనను మన జాతీయోద్యమంచే అంగీకరింపజేసి సామ్రాజ్యవాదులు మనజాతీయోద్యమంపై విజయం సాధించగలిగారు.

ఆగస్టు మాసంలోని చారిత్రక ఘటనలనెల్ల స్మరించుకోగనే నేటి యువకులమైన మనపైనున్న మహత్తర కర్తవ్యం స్పష్టం కాగలదు.

దేశంలో సామ్రాజ్యవాద బంట్లయిన నైజాం, తిరువాన్కూర్, ఇందూరు సంస్థానాలు తమ "స్వతంత్రాన్ని" ప్రకటించాయి. సంస్థాన ప్రజలు, నిరంకుశ సంస్థానాధీశులకు తగిన బుద్ధిచెప్పుటకు సంసిద్ధులగుచున్నారు. కాని మన జాతీయోద్యమంలోని ఒకవర్గం పటేల్ నాయకత్వమున రాజీకి తయారగుచున్నది. సంస్థానాధీశులకు ప్రజలను బానిసలుగా అణచిపెట్టు హక్కు అంగీకరించుతున్నారు. సంస్థాన ప్రజామండలి అధ్యక్షులయిన శ్రీ పట్టాభిగూడ యీ ధోరణిలోనే నడవటం జరుగుచున్నది. యువకులం మన జాతీయనాయకత్వపు యీ పంథాను నిరసించవలసియున్నది. పోరాటములకు సంసిద్ధులవుతున్న తిరువాంకూర్ హైద్రాబాదు ప్రజలవెనుక నిలబడవలసి యున్నది. ఇట్టి సంస్థానాలను తమ కీలకస్థానాలుగా ఉపయోగించనెంచిన సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నపర్చగలం.

జాతీయోద్యమం సామ్రాజ్యవాద ప్రణాళికలను అంగీకరించుటతో సామ్రాజ్యవాదులదే పైచేయి అయ్యింది, విభజనపేరుతో సరిహద్దునిర్ణయ కమిషనులోను, సైనిక విభజన కమిషన్లోను సామ్రాజ్యవాదులు కాంగ్రెస్, లీగుల మధ్య మధ్యవర్తులయారు తమ యీ స్థానాన్ని ఉపయోగించుకొని భారతదేశాన్ని బ్రిటిష్ డొమియన్లో భాగంగా అట్టిపెట్టుటకు కృషిసల్పుతున్నారు, తమకుట్రలను సాగించుటకు కాంగ్రెస్ లీగుల మధ్య చిచ్చురెగ్గొట్టుచున్నారు. యువకులం యీ సామ్రాజ్యవాద కుట్రలను బహిరంగ పర్చాలి. ఇండియన్ యూనియన్ - పాకిస్థాన్లు స్నేహపూర్వకమైన సంధులు జేసుకొని, మధ్య సామ్రాజ్యవాదుల జోక్యానికి స్థానంలేకుండా జూడాలి. ఇండియా సర్వస్వతంత్రం ప్రకటింపబడునట్లు, బ్రిటిష్ డొమియన్తో ఎట్టిసంబంధములు లేకుండునట్లు కృషిసల్పాలి.

ఇండియా యూనియన్, పాకిస్థానులు నూతన రాజ్యాంగాలు తయారు జేస్తున్నాయి. రానున్న రాజ్యాంగ ప్రణాళికలలో యువకుల హక్కులు గౌరవింప బడునట్లు యువకులు అవిద్యతోను, నిరుద్యోగంతోను బాధ పడకుండ యుండునట్లు పాకిస్థాన్, ఇండియన్ యూనియన్ల రాజ్యాంగ చట్టాలు గ్యారంటీ చేయునట్లు, ప్రజాస్వామిక రాజ్యాంగం తయారగునట్లు యువకులం ఆందోళన జేయవలసియుంది,

భారతదేశంలో నేడు చెలరేగుతున్న రాజకీయ విప్లవంలో యువకులం పై వినాదాలను అమలుపర్చునట్లు కృషిజేయుటకు దేశంలోని యువజన, విద్యార్థి వుద్యమాలలో ఐక్యత అవసరం. అందుకు వివిధ రాజకీయ పక్షాలకు చెందిన యువజన సోదరులు కృషి సల్పుతారని ఆశించుతాం.

1947 ఆగష్టు 15 న భారతదేశం విభజన కానున్నది. అనేక సంవత్సరముల నుండి ఎచ్చరైతే సామ్రాజ్యవాదం విఫల మయిందో, నేడు అచ్చట జయించింది. దేశసంపూర్ణ స్వాతంత్రానికి పోరాడుతూ 1942 ఆగస్టులో మరణించిన విద్యార్థి, యువక వీరులను స్మరించి. జీవితాంతం సామ్రాజ్య వాదులకు బద్ధ విరోధిగా పోరాడి మరణించిన శ్రీ బాల గంగాధర తిలక్ను గుర్తుకు తెచ్చుకొని యువకులం ఐక్యమై నేటి సామ్రాజ్య వాదకుట్రలను భగ్నంజేయ వలసియుంది.

★ ఆగస్టు వీరుల ఆ

అది 1942. విజ్ఞానానికి ప్రబల శత్రువులైన ఫాసిస్టుమూక, తన మృగతృష్ణతో శాంతి కాముకులైన ప్రపంచ ప్రజలపై వికటనృత్యం చేసే రోజులు. చలించని దీక్షతో మానవాధములైన నాజీ నరహంతకులను నామరూపాలు లేకుండా చేయడానికి కంకణం కట్టుకొంది ప్రపంచ ప్రజానీకం. మన మాతృభూమిలో చిరకాలవాంఛితమైన స్వాతంత్ర్య పిపాస దిన దిన ప్రవర్ధమానమయే దశ. ప్రపంచ విజ్ఞాన వాహినికి వన్నెలుదిద్దిన భారతదేశం ఫాసిస్టులను హతమార్చవలసిన పృథుతర బాధ్యతను గుర్తెరిగింది. స్వతంత్రవాయువులను పీల్చే భారతజాతి ఫాసిస్టు శతృమూకను ఓడించగలదనే నగ్నసత్యాన్ని తెల్సుకొంది. అందుకే 'మా మాతృభూమినుండి తక్షణం మూటా



1942 లో మనప్రజలపై సామ్రాజ్యవాదులు సాగించిన హింసాకాండ

చిత్రము : న్యూమాసెస్‌నుండి

యం ★

పర్వూరి కోటేశ్వర రావు

ముల్లె కట్టుకుపో' అని ముక్తకంఠంతో భారత ప్రజావాణి హెచ్చరించింది బ్రిటిషు సామ్రాజ్య వాదులను.

కాని సామ్రాజ్యవాదులది, "పుట్టుకతోపుట్టిన పుర్రె, కట్టెలతోకాని పోదు" మనస్తత్వం. అందువల్లనే విశ్వమానవ కళ్యాణాన్నికోరి, 40 కోట్ల భారతీయులను ఫాసిస్టులకు వ్యతిరేకంగా సమాయత్తపరచే జాతీయ నాయక వర్గాన్ని అరెస్టుచేసి జాతీయోద్యంపై మొదటి దెబ్బ తీసింది పరాయిప్రభుత్వం. దానికి సమాధానంగా ప్రజలు 'దెబ్బకు దెబ్బ తీశారు'. హత్యాకాండను అరమరలేకుండా సాగించింది హృదయంలేని బ్రిటిషు ప్రభుత్వం. జలియన్‌వాలాబాగ్‌ను మరపించే మారణహోమం, 'హెమూకలానీ'బోటి ఎందరియువక హృదయాలనో బలిగొంది సామ్రాజ్యవాదుల హింసాకాండ. చిమూర్, అష్టివీరులను నిర్దాక్షిణ్యంగా ఉరిదీసింది. విమానములనుండి అగ్నివర్షాన్ని కురిపించింది బ్రిటిషు ప్రభుత్వం. పౌరసత్వ హక్కులను పొట్టపెట్టుకొంది సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానం.


కాని, అన్యాయాన్ని అంతంచేసి, సమధర్మాన్ని స్థాపించే ప్రజాశక్తి ఉద్భవించింది యీ అనంతమైనవిశ్వంలో. అందువల్లే హిట్లరు లాంటి హిరణ్యాక్షులు, నరహంతకులు నామరూపాలులేకుండా నాశనమయారు, హత్యాకాండను, నిర్బంధాన్ని అధిగమించి ఆరని ప్రజాచైతన్యం పొంగులువారింది. ఆరోజున - ఎక్కడో లండన్‌లో చుట్టను నోట్లోపెట్టుకొని భారతజాతీయోద్యమాన్ని అణచగల్గానని చర్చిల్ విర్రవీగితే వీగవచ్చు. ప్రజాచైతన్యం నివురుగప్పిన నిప్పువంటిదని గుర్తించలేదు. గుడ్లగూబ చర్చిల్, అందువల్ల నాటి చర్చిల్ ఆశలు నేడు నిరాశలవుతున్నాయ్.

బ్రిటీషుసామ్రాజ్యవాదులు సాగించిన దోపిడీ హింసాకాండలనుండే బలమైన జాతీయోద్యమం పుట్టుకవచ్చింది. భారతజాతి కంఠంతో, ప్రపంచ ప్రజావాణి మేళవించింది. జాతీయ నాయకులు విడుదలయ్యారు. అటు ఫాసిస్టులపై ప్రపంచ ప్రజల విజయం. ఇటు సామ్రాజ్యవాదులపై భారతజాతివిజయం. రెండూ ఒకేసారి జరిగాయ్ అందుకే విశ్వమానవకళ్యాణం అవిభాజ్యం. ప్రపంచ చరిత్రలో భారతజాతి తన అధ్యాయాన్ని స్వర్ణాక్షరాలతో పుటలను త్వరితంగా నింపేస్తోంది. అదిగో చూడండి! బొంబాయినావికుల పోరాట శంఖారావం. మనం మరువలేని, మరుపరాని ధంకాధ్వానం. అన్యాయాన్ని సహించలేని హృదయాలు ఏకమవుతున్నాయ్. సామ్రాజ్య సౌధ పునాదులు బీటలువారుతున్నాయ్, ఇటు జబ్బల్‌పూర్ వైమానికుల దేశాభిమానం, అజాద్ హింద్‌ఫౌజును విచారించే హక్కు, మన రక్తమాంసాదులను తిని తెగబలిసిన తెల్లవాళ్ళకు లేదంది. ఇదే దృఢాభిప్రాయాన్ని యావద్భారతదేశం ఒకేసారి ఎలుగెత్తిచాటింది. విజయలక్ష్మిని చేపట్టింది. స్వతంత్ర పోరాటంలో ప్రధానపాత్ర విద్యార్థులదని వేరే చెప్పాలా? ఇదే సమయంలో ప్రస్తుత లోపభూయిష్టమైన పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు అనేక పోరాటాలు సల్పారు. ఈ ప్రతిఒక్క పోరాటం ఏర్పడబోయే స్వాతంత్ర సౌధానికి ఒక్కొక్క పునాదిరాయి.

★

మన స్వతంత్ర పోరాటంలో అనేక మంది యువకులు సామ్రాజ్యవాదుల ఉరి కంబాలకు గురి అయ్యారు.

★



ఊహించనైనా లేని యీ మార్పును చూసి సామ్రాజ్య వాదం గజగజ వణికింది. కనుకనే 1948 జూన్ నాటికి మూట ముల్లె కట్టుకొని పోతానని చెప్పలేక మరణవాఙ్మూలం చెప్పింది బ్రిటిష్ సామ్రాజ్యవాదం.

ప్రత్యక్షంగా మనలను పరిపాలించేందుకు అవకాశంలేదు. ఇక సామ్రాజ్య వాదులు పరోక్ష పాలనకు పూనుకొంటారు. అందుకే సంస్థాన తోలుబొమ్మల నాటకం, భారతదేశ విభజన, భారత పెట్టుబడి దార్లతో లాలూచీ, కాని నాటి ఆగస్టు వీరులు అసువులను అర్పించింది, బ్రిటిష్‌వాళ్ళ పరోక్ష పాలన కోసంకాదు, సర్వ సంపన్నమైన స్వతంత్రంకోసం. ఆ వీరులు రక్తాన్ని స్రవింపించింది, పెట్టుబడిదార్ల దోపిడీ కోసంకాదు, మానవకళ్యాణంకోసం. ఆవీరులు ఉరికంబాలు ఎక్కింది, చల్లపల్లి, మునగాల జమీందార్ల దుర్మార్గాలను సహించమని కాదు. జమీందారీల రద్దుకోసం. ఇదే ఆశయంతో, ఇదే ఆదర్శంతో మనలను ఆగస్టు వీరులు వీడి పోయారు.

చిన్న కథ

తోటకూర

మూలం : యశపాల్

అనువాదం : జగ్గయ్య

1942 లో, మన జాతీయనాయకులు, దేశవ్యాపితమైన స్వాతంత్ర్యసమరాన్ని ప్రారంభించడానికి నిశ్చయించారు, కాని, ఉద్యమం ప్రారంభం కాకముందే వారందరూ అరెస్టు చేయబడ్డారు. దానితో ప్రజలు ఉద్రిక్తులై పరాయిప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. తత్ఫలితంగానే, స్థానిక జిల్లా జైలు ఖైదీలతో క్రిక్కిరిసిపోయింది.

వారిలో విశ్వేశ్వరసింగ్, రైసత్‌ఖాన్ — వీరిద్దరనూ జైలు అధికారులీనాటికికూడా స్మరిస్తూనే ఉంటారు. తిరుగుబాటులో వాళ్ళిద్దరకూ బాగా గాయాలు తగిలినై. విశ్వేశ్వరసింగ్‌కు తొడలోనూ, రైసత్‌ఖాన్‌కు గూటిలోనూ తుపాకిగుండ్లు దిగబడిపోయినై. ఆ జైలుకు సంబంధించిన సివిల్ సర్జన్ ఆపరేషన్‌చేసి, తూటాలు తీసివేశాడు. ఆపరేషన్ చేస్తూన్నంతసేపూ, అతడు ఏవగింపుతో మొహం కంటుపెట్టుకునే ఉన్నాడు. ప్రక్కనున్న పరివారంతో - "ఈ బడాచోర్లు దొరల బంగళాలలోకి చొరబడి వాళ్ళను చంపేశారు; పోలీసు స్టేషను తగలబెట్టారు! బడాచోర్లు!"- ద్వేషంతో పళ్లు కొరికాడు, గాయాలు మానకముందే, సింగునూ, ఖానునూ గట్టిగా సంకెళ్ళతో బంధించివేశారు. వీళ్ళు మహా అపాయకరమైన మనుష్యులని కాబోలు, సెషన్సుజడ్జి జైలు ఆవరణలోనే విచారణ జరిపాడు. ముద్దాయీలకు ఉరిశిక్ష విధించబడింది. ఇంగ్లీషువాడి న్యాయాన్ననుసరించి, శిక్షితుల తరపున తిరిగి హైకోర్టులో అప్పీలు చేశారు. హైకోర్టు తీర్పు వచ్చేవరకూ యిద్దరనూ తీసికెళ్ళి ఒంటరిగా, ఇనప కటకటాలవెనుక - చీకటికొట్లలో బంధించారు.

పోలీసుస్టేషనులు తగలబెట్టి-ధర్మస్వరూపులైన తెల్ల దొరల ప్రభుత్వముపై తిరుగుబాటు చేయడానికి తెగించిన యీ అపరాధుల్ని అరెస్టు చేసినవార్త ఊళ్లో దొరలందఱకూ తెలిసింది. చిత్తజల్లుగా కురిసే అగ్నివర్షాన్ని సైతంలెక్కచేయకుండా - యీ "దుర్మార్గులు" తమ యజమానుల్నీ, వాళ్ళ దివ్యసౌధాలనూ తగలబెట్టారు. సర్కస్ బోనులోపెట్టిన పులుల్ని చూడడానికిజనం విరగబడ్డట్టుగా-యీ ఖైదీలనిద్దరినీ చూడడానికి ఊళ్లో తెల్లదొరలందఱూ వేలంవెఱ్ఱిగా జైలు దగ్గరకురాసాగారు. కాని వాళ్ళమొహాలమీద తాండవించింది ఔత్సుక్యం కాదు-విద్వేషం!.... ఆతెల్లజాతి సివిల్‌సర్జను, మాటిమాటికీ వాళ్ళనుచూసి-"ఖూనీకోర్లు! ఖూనీకోర్లు" అని పళ్ళుకొఱుక్కునేవాడు! చీత్కరించేవాడు!

ఇక సీతెల్లదొరల అలుసు చూసుకొని, చిన్న చిన్న నల్లఉద్యోగులుకూడా వాళ్ళను నికృష్టంగా చూచేవాళ్ళు. తోటి ఖైదీ ఒక్కడుకూడా వాళ్ళదగ్గరకు వెళ్ళడానికి సాహసించేవాడుకాదు. ఈ ఇద్దఱుఖైదీల వంక చూసినంతమాత్రాన్నే, అక్కడి అధికారుల్లో మానవత్వం హరించిపోయేది!

సింగుకూ, ఖానుకూ తాము చేసిందెంత తీవ్రాపరాధమో బాగాతెలుసు. అందుచేతనే, వాళ్లు బ్రతుకుమీద పూర్తిగా ఆశలు వదులుకున్నారు. దేశభక్తినుద్బోధించే వీరగేయాలు పాడుకుంటూ నవ్వుతూ మృత్యువు కోసం ఎదురుచూడసాగారు. కాని వాళ్ళ హృదయాలను కలవరపరచే సమస్య ఒక్కటే. తమతోటి భారతీయులు - తమ సోదరులుసైతం - తమను ద్వేషించడం దేనికి? తామంటే భయపడడమెందుకు? బ్రిటిష్‌వాళ్ళు ద్వేషించారంటే, అది సహజం కావొచ్చు: కాని, ఎవరి స్వాతంత్ర్యంకొరకు తాము ప్రాణాలుసైతం అర్పిస్తున్నారో - ఆ సోదర దేశీయులే తమపై పగబూనడ మెందుకో వారి కర్థంకాలేదు. తామే ప్రభుత్వంమీద తిరుగుబాటు చేశారో, ఆ ఇంగ్లీషుప్రభుత్వం, న్యాయానికి తమసోదర దేశీయుల ప్రభుభక్తి వల్లనే నిలబడ గలుగుతోంది. అయితే, నిజమైన శత్రువెవ్వరు?

ఊళ్ళో దొరలకి "ఖూనీకోరుల" మీద క్రోధం పెచ్చుటిల్లిపోయింది. ఉరిశిక్షను ఖాయం చేస్తూ హైకోర్టు తీర్పుచెప్పగానే, యీ నేరస్థులు ఉరికంబం మీద ఊపిరాడక ఎలా గిజగిజలాడి చస్తారో చూడడానికి జైలు ఆవరణనిండా తెల్లదొరలు గుంపులు కూడరాసాగారు. అపరాధుల మెడచుట్టూ ఉరి తగిలించగానే, ఎదురుగా నిలబడ్డ "విరోధుల" మొఖాలు ఒకసారిగా ఎఱ్ఱబారినై కాని, దౌష్ట్యానికీ, నిరంకుశత్వానికీ లొంగని ఆ"అపరాధు"లొక్కసారి ఎలుగెత్తి - "ఇంక్విలాబ్ జిందాబాద్! భారత్ మాతకీ జయ్!" అంటూ సింహాల్లా గర్జించారు. కదలికలేకుండా చుట్టూ నిలబడివున్న సోదర భారతీయులవంక ఒక్కసారి కళ్ళెత్తిచూశారు. ఎవరికోసం తామిప్పుడు ఆత్మబలిదానం చేస్తున్నారో - వారందరూ నిర్లిప్తంగా, నిశ్చేతనంగా, తమరక్తసంబంధలన్న అనుతాపం సైతంలేక - నిలబడి చూస్తున్నారు. ఎదురుగాఉన్న "విరోధులు" పిశాచాల్లా ఆనందం అనుభవించారు.........

సింగు బంధువులూ, ఖాను బంధువులూ ఆ మృత కళేబరాలను తమకియ్యవలసింద[illegible] అర్థించారు, కాని అలాచేస్తే శాంతి భద్రతలక భంగం కలుగుతుందనే నెపంతో, జిల్ల కలెక్టరు వారి కోరికను తిరస్కరించాడు. సివి[illegible] సర్జను జైలు అధికారిని పిలిచి - ఆరెండ శవాలనూ జైలు ఆవరణలోనే పాతి పెట్టిం[illegible] మని ఆజ్ఞాపించాడు. పళ్ళన్నీ బయటపె[illegible] ఇకిలిస్తూ - "ఆ సమాధులమీద తోటకూ[illegible] చల్లించండి" అన్నాడు.

త్వరలోనే తోటకూర మొలిచింది. సా[illegible] వంతమైన ఆ సమాధి భూమిలో, ఇట్టే అ[illegible] పెరగ సాగినయ్. పెద్దవికాగానే వాటిని [illegible] దొరల ఇళ్ళకూ, క్లబ్బుకూ పంపించ వలసిందె[illegible] ఆజ్ఞాపించాడు సివిల్ సర్జను. ఆ విప్లవ వీరు[illegible] సమాధులపై మొలిచిన తోటకూరను, దొర[illegible] యిండ్లలో వండుకు తినబోతున్నారని అంద[illegible] తెలిసిపోయింది... ఆవేళ ప్రొద్దుకూకగానే, జై[illegible] మూసివేశారు. ఖైదీలందరూ తమ త[illegible] కొట్లలో చేరారు. ప్రతివాడూ, ఆ కటిక [illegible] మీద పండుకొని, యీ తోటకూరను గురిం[illegible] ఆలోచించ సాగాడు. "ఈ ఇంగ్లీషు వా[illegible] భారతీయుల రక్తమాంసాలను భక్షిస్తున్నార[illegible] -ప్రతివాడికీ తట్టిందీ విషయం - కాని మా[illegible] డ్డానికి నోళ్ళు ఏనాడో కట్టివేయబడినాయ్, అ[illegible] కున్న విషయంపైకి అనడానికి సాహసంతే[illegible] వాళ్ళకు....దొరలకి సంగతి తెలిస్తే.....

జైల్లో ఉన్న ప్రతి భారతీయోద్యోగి దీ[illegible] గురించే యోచించడం ప్రారంభించా[illegible] జైలరూ, డాక్టరూ మెత్తని సోఫాల [illegible] పండుకొని - యీ విషయం తల్చుక[illegible]

వార్డరూ. ఆఖరుకు ఇరవై రూపాయీల నౌకరీ మీద క్రొత్తగా చేరిన కాపలావాడు సహితం - కళ్ళుమూసుకొని - ఇంగ్లీషువాళ్ళు భారతీయుల్ని నమిలి మ్రింగుతున్నారని భావించి, బాధపడ్డారు. కాని వారి హృదయావేదన పెదిమలుదాటి బైటపడలేకపోయింది.

అల్లరులు అణగిపోయినందుకు చిహ్నంగా బ్రిటిషు క్లబ్‌లో బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చెయ్యబడింది. విషణ్ణ హృదయాలతో, భారతీయ నౌకర్లు - వెండి పళ్ళాలతో తోటకూర ఒడ్డిస్తున్నారు. వాళ్లుకూడా యీ విషాదగాధ విన్నారు. పళ్ళాలలో కూర చూడగానే, వాళ్ళ హృదయాలు క్రుంగిపోయినై. బరువుగా నిట్టూర్చారు కాని నావికలకు సంకెళ్ళు !! లోలోపల క్రోధం నిస్సహాయంగా పొంగింది... అంతే!....విప్లవజ్వాల క్రమంగా చల్లారిపోసాగినయ్ !!!

★

అధిక జీతాలను రద్దు జేయాలి

కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశ తీర్మానం

జులై 16 న భీమవరంలో జరిగిన పశ్చిమ గోదావరిజిల్లా అన్నితాలూకాల అధ్యక్ష, కార్య దర్శుల సమావేశంలో యీ క్రింది తీర్మానం అంగీకరింపబడింది

"విద్యను ప్రోత్సహించవలసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక దురవస్థలోనున్న ప్రజలనుండి అధిక జీతాలను వసూలు చేయవలెనన్న ఉత్తరువు విద్యావ్యాప్తికి గొడ్డలిపెట్టుగాన, వెంటనే ప్రభుత్వం లాభ నష్టములను తానే భరించి మామూలు 8 నెల్ల జీతములనే విద్యార్థులనుండి తీసుకొని, విద్యను ప్రోత్సాహపరచి, అవిద్య నిర్మూలనమునకు తోడ్పడవలసిందిగా కోరుచున్నాం."

★

గమనిక

క్రితం సంచికలో ప్రకటించిన "కాలచక్రం ఆగదుసుమా!" అనే వ్యాసం శ్రీ పి. కోటేశ్వరరావుచే రచింపబడినది. ముద్రణలో పేరు ప్రకటించుటలో లోపం జరిగినందుకు విచారిస్తున్నాం.

—— సంపాదకుడు

★ మిన్నాగు ★

★

పొన్నా కోటేశ్వరరావు

పుణ్య భారతదేవి పుత్రవర్యుల్లార
వీర భారతదేశ వీర యోధుల్లార
మత్తు నిదురింకేలరా
మననాట
"మిన్నాగు" జేరిందిరా॥

పెద్దన్న, చిన్నన్న పోరాడ జూచింది
భళిభళి యన్నాది బుసపెట్టి లేచింది
విషము నెగజిమ్మిందిరా
మననాట
చిచ్చు రగిలించిందిరా॥

మనశ్రీలు మనసంతు మనకళలు, మనవిద్య
తన సొత్తె యన్నాది తాను రాజన్నాది
దాసులం మన మన్నదీ
మననాట
తావరం జేసిందిరా

సంస్థానముల "పుట్ట" సృష్టి గావించింది
జీవితాంతము తానె చక్రవర్తన్నాది
పడగ పూర్తిగ విప్పెరా
మిన్నాగు
గొడుగుగా బట్టిందిరా

అన్నదమ్ములమధ్య అగ్నిజ్వాలలు రేపి
పెనుగాలియైతాను భోరుమని వీచింది
అగ్నిజ్వాలలు రేగెరా
మననాట
ఇంటింటి కెగబ్రాకెరా —

తగవులన్నిటి దీర్పు తీర్పరన్నది తాను
ఏరోటికడ పాట ఆరోటికడ పాడి
అన్నదమ్ముల జీల్చెరా
మిన్నాగు
ఐక్యంగ రండనియెరా

ఇన్నూరు యేండ్లుగా అన్నిటిని దిగమ్రింగి
పుట్టలో తనకోట గట్టిగా గట్టింది
తనకడ్డు లేదనియెరా
తనమాట
బ్రహ్మవాక్కన్నాదిరా —

'పీడితావళిశక్తి' గాండ్రించి లేచింది
పెనుగరుత్మంతుడై వినువీధి కెగిరింది
మ్రోతలెట్టుచు తిరిగెరా
మిన్నాగు
భీతిచే వణకిందిరా—

అన్నలిద్దరిబిల్చి ఆలించుడన్నాది
ఇంకొక్క యేడాది ఇటవుందునన్నాది
ఆనాటి నుండింకరా
మననాట
కాన రానన్నాదిరా

మీది మీరే యింక పొందండి అన్నాది
ధర్మసూత్రాలెన్నొ వరుసగా జదివింది
మొసలికన్నీర్గార్చెరా
మిన్నాగు
వ్యసనపడి చస్తోందిరా

ఏ ప్రాంతమేగినా ఎందుకాలిడినా
ఎటుపార జూచినా ఎందుదాగినగాని
పీడితావళి శక్తిరా
మిన్నాగు
కెదురుగా వస్తోందిరా—

సాగింది యిమ్మహాశక్తి సాగిందిరా
ఆగేది లేదింక సాగిపోతోందిరా
షట్టదరి జేరిందిరా
మిన్నాగు
గిట్టెకాలము వచ్చెరా—

అణగారియున్ననీ ఆంధ్రతేజము జూపి
తొణుకుబెణుకులులేని తెనుగువీర్యము జూపి
పుట్ట బ్రద్దలు జేయరా
విద్యార్థీ
బావుటా పైకెత్తరా—

కొదమ సింగమురీతి కుప్పించి యుద్ధాన
బాలచంద్రుని కీర్తి పసజూపి నిలబెట్టి
ఆంధ్రరాష్ట్రము తెమ్మరా
లోకాన
ఆంధ్ర పరువము చాటరా—

జాతీయోద్యమానికి వ


ఆంధ్ర విద్యా

అఖిలభారత విద్యార్థిఉద్యమంలో బెంగాల్ తర్వాత ఆంధ్రకు గర్వించదగిన స్థానం లభించింది పారిశ్రామికంగా ఎంతో వెనుకబడి, ప్రధానంగా వ్యవసాయకంగానే ఉండిపోయి, విద్యాభివృద్ధిలో ఎంతో వెనుకబడి వుండిగూడ ఆంధ్ర విద్యార్థులు, అచంచల దీక్షతో బానిస విద్యావిధానానికి, దేశదాస్యానికి వ్యతిరేకంగా గత పదేండ్లుగ పోరాడుతున్నారు. విద్యార్థులలో బ్రహ్మాండమైన స్వాతంత్ర్యజ్యోతిని రగిల్చి ఆంధ్ర జాతీయోద్యమానికే మెరుగులు పెట్టారు. మూల మూలల ఉన్న స్కూళ్ళకన్నిటికీ తమ సందేశాన్ని గొంపోయి బలీయమైన విద్యార్థిసంఘ నిర్మాణాన్ని సంఘటితపర్చారు. విద్యార్థి ఉద్యమంతోపాటు దిన దిన ప్రవర్ధమానమగుచున్న ఆంధ్ర యువజనోద్యమంతో, యువకులలో ఒక ప్రధానభాగమైన తామూ గూడ చేతులు కలిపి ఆంధ్ర యువజన ఫెడరేషన్ నిర్మాణానికి చొరవ తీసుకొన్నారు. ఆంధ్రయువకులు విద్యా, వైజ్ఞానిక, శారీరక సర్వతోముఖాభివృద్ధికి అనువగు కార్యక్రమ ప్రచారానికి ఉద్యమాన్ని సంఘటితపర్చడానికి 'నవయుగ' మాసపత్రికను విజయవంతంగా నడుపుతున్నారు. వందల సంవత్సరాలుగ దుర్భరబానిసత్వంలో క్రుగ్గి కృశించి నీరసపడిపోయిన జాతిని పునర్నిర్మించేందుకు ఆంధ్ర విద్యార్థి యువకులు అగ్రగాములుగా పనిచేస్తారని ఆంధ్ర జాతీయాభిమానులందరూ ఆశించుకున్నారు. గంపెడంత ఆశతో తమవైపు చూస్తున్న ఆంధ్రావని యెడ తమ మహత్తర బాధ్యతల నెంత విజయవంతంగా నెరవేర్చుతారు, అనేదిప్రతి విద్యార్థినీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య.

ఉద్యమ పుట్టు పూర్వోత్తరాలు

భారత స్వాతంత్ర్య పోరాటం పిలుపిచ్చినపుడల్లా ఆంధ్ర విద్యార్థులందుకొంటూనే వచ్చారు. 1920, 30 యువరాజు భారత పర్యటనం, సైమన్ కమీషన్ బహిష్కరణ మున్నగు సందర్భాల్లో ఆంధ్ర విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, చూపిన త్యాగాలు గర్వించదగిన చారిత్రక ఘట్టాలు. కాని అవన్నీ తాత్కాలిక ఆవేశంతోగూడిన పాలపొంగువలె లేచి అణగిపోతూ వచ్చాయి. ఒక స్పష్టమైన నిర్మాణ, ఉద్యమ రూపాలు పొంది సదా తెంపులేని స్వాతంత్ర పోరాటవాహినిగ అభివృద్ధి చెందలేదు. ఆ దశలో జాతీయోద్యమానికి ఏకైక నాయకులుగ నిల్చి పోరాడుతున్న కాంగ్రెసు నాయకులు సహితం, పోరాటం ఉధృతంగా సాగే దినాల్లో మాత్రం విద్యార్థులంతా విద్యాలయాలు విడిచి స్వాతంత్ర సమరంలోకి ఉరుకమని పిలుపు లిచ్చేవారేగాని, వారి దైనందిన సమస్యల పోరాటంతో స్వాతంత్ర పోరాటాన్ని జోడించి పనిచేయుటకు విద్యార్థులను సంఘాలలో సంఘటితపర్చు అవసరాన్ని గుర్తించలేదు. ఉధృత పోరాట సమయాల్లో మాత్రం విద్యార్థిపోరాటాల నుపయోగించుకొంటూ, మరల ఆ జ్వాలకాస్త చల్లారగానే 'విద్యార్థులకు రాజకీయాలెందుకు!' అని ధర్మపన్నాలు వల్లిస్తూ విద్యార్థుల నడుములు విరగకొడుతూ వచ్చారు. కాని చరిత్ర పురోగమనాన్ని ఎదుర్కొడ ప్రయత్నించడం సూర్యునికి చక్రం అడ్డంబెట్టుటవంటి సంకుచిత తత్వంమాత్రమేనని పరిస్థితులు రుజువుచేశాయి.

— వ్యాసకర్త —




ఆంధ్రవిద్యార్థి ఉద్యమ నిర్మాతల్లో ఒకరు
శ్రీ యం. బసవపున్నయ్య

1930 లో వచ్చిన ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం, భారతదేశంలోని వివిధ వర్గాల ప్రజానీకాన్నంతా కదల్చివేసింది. 1930–32 దేశవ్యాపిత రాజకీయ పోరాటానికి కారణమయింది. అనేకమంది విద్యార్థులుగూడ పాల్గొని జైళ్ళకు వెళ్ళారు. కాంగ్రెసు రాజీ ధోరణికి దిగి, ఉద్యమాన్ని విరమించింది. విద్యార్థులు, యువకులు, తక్కిన ప్రజలతోపాటు తామాసించిన స్వాతంత్రసిద్ధి కాకపోవడంతో నిరుత్సాహం పొందారు. తీవ్రంగా ఆలోచించసాగారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోని బలహీనతలను గుర్తించారు. ఖద్దరుధారణతోను, సత్యాగ్రహంతోను మాత్రమే భారతస్వాతంత్రం వచ్చేస్తుందనే భ్రమలు వీడారు. అతివాద భావాలు త్వరితగతిని వ్యాపించ సాగాయి. వివిధవర్గాల ప్రజలను వర్గసంఘాలలో సంఘటితపరచి వారిని దైనందిన పోరాటాలలో సుశిక్షితులైన సైనికులుగా తయారు చేయనిదే భారతస్వాతంత్ర్య పోరాటం విజయవంతంగా ముందుకు పోదని గుర్తించారు. 1930–32 పోరాటాలలో సామ్రాజ్యవాద జైళ్ళలో పెట్టబడిన వీరంతా క్రమంగా విడుదలయ్యారు. తమ తమ భవిష్యత్ కార్యక్రమాలకు తీవ్రంగా తలపడ్డారు. దీనికి తోడు యూరప్‌లో హిట్లరు ఫాసిజం యొక్క భయంకర గర్జనలు, ప్రజాతంత్రంపై కత్తిఝుళిపింపులు చూచి స్వాతంత్ర్య పురోగామి శక్తులన్నీ ఏకమైప్రారంభించిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజాసంఘటన నూతనోత్సాహాన్నిసమకూర్చింది. ఒక ఆశాజ్యోతిని వెలిగించింది. ఈ భూమికపైఆరంభమైన వివిధ అతివాదస్వాతంత్రఉద్యమాలతోపాటే 1935 లో అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ఉత్పన్నమయింది. క్రమ క్రమంగా బలపడుతూ వచ్చింది. దేశవ్యాపితంగా నలుమూలలా వ్యాపించ సాగింది.

రగులుపెట్టినవిద్యార్థులు

ఉద్యమ సమీక్ష ★

ఆంధ్రవిద్యార్థిలోకం ఈపిలుపు నందుకొనుటకు ఇంకా ఒకటిరెండేళ్లు పట్టింది 1935 బానిస చట్టాన్ని వ్యతిరేకిస్తూ చెలరేగిన స్వాతంత్ర్య కాంక్ష, అటుపిమ్మట జరిగిన అస్సెంబ్లీ ఎన్నికల పోరాటం ఆంధ్రవిద్యార్థిలోకాన్ని పూర్తిగ




1946 జనవరిలో గుంటూరులో జరిగిన అఖిలభారత విద్యార్థిమహాసభ దృశ్యం

కదల్చి ముందుకు తెచ్చాయి. కమ్యూనిస్టు సిద్ధాంతాలు, అతివాద జాతీయ భావాలు, అవ రించిన విద్యార్థులు చొరవతీసికొని ఆంధ్రవిద్యార్థి ఫెడరేషన్ నిర్మాణానికి పూనుకొన్నారు. గుంటూరు కాలేజీ విద్యార్థులు అహ్వాన సంఘాన్నేర్పరచి మహాసభను దిగ్విజయంగా జరిపారు. ఆంధ్రలోని అన్నిజిల్లాలనుండి ఎట్టి రాజకీయ భేదాభిప్రాయాలతో నిమిత్తం లేకుండా, ప్రతినిధులువచ్చి పాల్గొన్నారు. వాస్తవానికి నిర్మాణయుతమైన, శిక్షణతోకూడిన సంఘటిత ఆంధ్రవిద్యార్థి ఉద్యమ ప్రారంభమదేయని చెప్పకతప్పదు. కాని స్వాతంత్రోద్యమం, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమ ప్రభావాలతో ఏర్పడ్డ ఆంధ్ర విద్యార్థుల చైతన్యం సుసంఘటితమైన నిర్మాణరూపం తీసుకోకపోయినను. ఆంధ్రవిద్యార్థి సంఘమనే పేరుతో ఏర్పాటై, అప్పటికే పన్నెండు వార్షికోత్సవాలు జరిగాయి. అందుచే ఆంధ్రవిద్యార్థుల చారిత్రక సాంప్రదాయలను మనంత్రోసిపుచ్చ రాదనీ, గుంటూరులో జరిగిన ఈమహాసభను పదమూడవ ఆంధ్రవిద్యార్థి మహాసభగా పరిగణించవలసిందనీ వచ్చిన సూచనలకు ప్రతినిధులంతా అంగీకరించారు ఈ మహాసభ సంఖ్యకు పదమూడవదిగ పరిగణింపబడినను, గతచరిత్ర నుండి విడబడి ఒకవిప్లవకరపంథా తొక్కింది. వార్షికోత్సవాలు, విందులు, ఊహాగాన ఉపన్యాసాలు వదలి, ఖచ్చితమైన ఆశయాలను ముందుంచి, కార్యక్రమం చర్చించి నిర్దుష్టమైన నిర్ణయాలు తీసికొంది. ఆంధ్ర విద్యార్థి ఉద్యమానికి ఒక స్పష్టమైన నిర్మాణము ప్రారంభమయింది. బానిసవిద్యా విముక్తికి, దేశ బానిసవిముక్తికి జోడించి పోరాటం నడుప నిర్ణయించింది. విద్యార్థి యువకులకు మాసపత్రికగా 'నవయుగ' 1947 లో బయలువెడలినా, ఆంధ్ర విద్యార్థి ప్రపంచానికి నిజంగా 1937 లోనే నవయుగ మారంభమయింది.

ముమ్మరమైన సమ్మెపోరాటాలు

సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన విద్యా విధానంలో పనికిమాలిన పరీక్షావిధాన మొకటి. పరీక్షలు విద్యార్థియొక్క విషయజ్ఞానాన్ని. అనుభవాన్ని గమనించి పై తరగతిలోనికి పంపు ఉద్దేశంతోకంటె, ఏ మారుమూలల సంగతులపై ప్రశ్నలు వేయాలా, ఎంత తక్కువ టైములో, హడావిడితో ఎక్కువ సంగతులు వ్రాయవలసివచ్చేటట్లు చూడాలా, నూటికి ఎంత తక్కువమందిని ఉత్తీర్ణులను చేయాలా అనే విచ్ఛిన్నకర పంథా ననుసరించి ఏర్పాటు చేయబడుతుంటాయి.

అసలు ప్రస్తుత పరీక్షా విధానమే లోపభూయిష్టమయితే పరీక్షకు కూర్చోవటానికి అర్హత నిర్ణయించడానికంటూ వడపోతల పరీక్షలు కొన్ని ఏర్పాటుచేసి. యస్. యస్. యల్. సి; యఫ్. ఏ; బి. ఏ. క్లాసులవారిని నూటికి యాభైమందిదాకా పరీక్షకు పోకుండా నిరోధించే పద్ధతి ఆరోజుల్లో మరింత జోరుగా సాగుతుండేది. విద్యార్థికి రుచించని, వంటబట్టని విషయాలను సిలబస్‌గా నిర్ణయించి విద్యార్థి యువకుల మానసికశక్తులను నమ్మచేయుటకే ఎక్కువగా ఉపకరిస్తున్న ఈ పరీక్షా విధానంమీదా, అందులో ముఖ్యంగా వడపోత పరీక్షల (డిటెన్షను విధానం) మీదా ఆంధ్ర విద్యార్థి ఉద్యమం యుద్ధం ప్రకటించింది. బానిస విద్యావిధాన నిర్మూలనా సంరంభాని కిదే నాందిగా పరిణమించింది. విద్యాలయాధికారులతో ఈ వడపోత విధానాన్ని రద్దుచేయమని రాయబారాలు జరిపినా నిష్ప్రయోజనమయింది. కాంగ్రెస్ మంత్రివర్గం జోక్యం పుచ్చుకొని ఈ విధానాన్ని రద్దుచేయమని ఆందోళనచేసినా, కదలలేదు. గత్యంతరంలేక సమ్మె ఆయుధాన్ని చేపట్టవలసివచ్చింది. ఆంధ్ర విద్యార్థి నాయకత్వం హెచ్చుభాగంవున్న గుంటూరులోనే అది ప్రారంభమయింది ఆంధ్ర క్రిష్టియన్ కళాశాలలో పదిరోజులపాటు సమ్మెపోరాటం జరిగింది. ప్రిన్సిపాలుగా అప్పుడు పనిచేస్తున్న



ఫోటో: పి. మధుసూదనరావు

బందరు ప్రిన్సిపాల్ మలో గడిసిన అక్టోబరు సమ్మె దినాల్లో విద్యార్థుల సమావేశం

అమెరికను క్రైస్తవ మిషనరీ రాయ్‌స్టోకు సమ్మెను భగ్నంచేయుటకు పడరానిపాట్లు పడ్డాడు. హిందూ—ముస్లిం విభేదాలను, క్రైస్తవ-క్రైస్తవేతర విద్వేషాలను రెచ్చగొట్టి చూచాడు. అన్నింటినీ విజయవంతంగా ఎదిర్చి ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ నాయకులు విద్యార్థుల సమ్మెపోరాటాన్ని నడిపారు. బ్రహ్మాండమైన ఆ ఊరేగింపులు, ప్రదర్శనాలు, పికెటింగు, బహిరంగసభలు నేటికీ మరుపురాని ముక్కింపబడ్డ ఘట్టాలు. ఒక్క గుంటూరు పట్టణాన్నేగాక ఆంధ్ర విద్యార్థి ప్రపంచాన్నంతా ఊపివేశాయి. విద్యాలయాధికారులను రాజీకి దింపుకు వచ్చాయి. ఈ పిలుపునందుకొనే బందరు హిందూకాలేజి విద్యార్థి సంఘం ఫీజెన్షను సమస్యపై సమ్మెలో దూకింది. నేటికీ నిరంకుశపెత్తనం చలాయిస్తూ విద్యార్థులపట్ల పోలీసు ఉద్యోగివలె వ్యవహరిస్తున్న రామకృష్ణారావే ప్రిన్సిపాలుగ ఉన్నాడు. మంకుతనము, అహంభావము మూర్తీభవించి ప్రజాతంత్ర ఛాయలనే చూడ కళ్ళుగాని ఈ పేము బెత్తపు విద్యావేత్త ఆనాడు గూడ పోలీసు సాయంవరకు పోయాడు. తుదకు రాజీవల్ల సమ్మె ముగిసింది. గత పదేండ్లుగ పాత ప్రపంచమేమారి మరొక నూత్న ప్రజా ప్రపంచముత్పన్నమవుతున్నా, బందరు కాలేజి ప్రిన్సిపాలు రామకృష్ణారావు మాత్రం, 'ఉన్మాదుడు సూర్యునిపై కోపంతో ఉమ్మివేసినట్లు' పురోగామిశక్తియైన విద్యార్థి ఉద్యమంపై బుసలు కొడుతూనే వున్నాడు. విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ విద్యార్థులు తమ డిగ్రీల రికగ్నిషన్ కోసరం బ్రహ్మాండమైన సమ్మెపోరాటం సాగించి, కాంగ్రెసు మంత్రుల వాగ్దానంతో విరమించారు. గుంటూరు, బందరు, విశాఖపట్నపు కాలేజీల సమ్మెజ్వాలలు రాష్ట్రమంతటా హైస్కూళ్ళకు వ్యాపించాయి. వే మంది విద్యార్థులు వీరోచితంగా పోరా పేర్కొనదగిన విజయాలను సాధించారు వందలకొలది విద్యార్థి వర్కర్లు వక్త తయారయ్యారు. సామ్రాజ్య వ్యతిరే చైతన్యం, స్వాతంత్ర్య పిపాస పరుగులె పురోగమించింది. ఆంధ్ర విద్యా ఫెడరేష విద్యార్థి నాయకుడుగ, బావిస విద్యావ్యతిరే స్వాతంత్ర్య సైనికుడుగ ఆంధ్ర జాతీయోద్య చరిత్రలో చెరప సాధ్యంగాని సిరాతో లిఖిం బడింది.

ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ - విద్యా ఐక్యతకు కృషి

బలీయమైన ఆంధ్ర విద్యార్థి ఉద్యమ మద్రాసులో జరుగుతున్న అఖిలభారత విద్యా

మిగతా 18 వ పేజీలో

రాష్ట్ర విద్యా విషయక సమావేశంలో

విద్యాభివృద్ధికి సూచనలు

యం. రామకృష్ణారావు

మద్రాసులో జులై 13న రాష్ట్ర విద్యా విషయిక సమావేశం జరిగింది. రోజురోజుకు అధికతరమవుతున్న విద్యార్థి సమస్యల పరిష్కారానికి ప్రతివ్యక్తి తహతహలాడుతున్నాడు. మంత్రివర్గం పరిష్కారమార్గాల అన్వేషణా కార్యక్రమంలో నిమగ్నమయివుంది. సామ్రాజ్యవాద బానిస విద్యావిధానం అనే వలయంలో పట్టిబకొడుతున్న మంత్రివర్గానికి మార్గాన్ని చూపవలసిన బాధ్యత రాజధాని ప్రజానీకపు భుజస్కంధాలపై పడింది. జాతీయ పత్రికలు, ప్రముఖ విద్యావేత్తలు, విద్యార్థి సంస్థలు తమ అనుభవాలతో, మేధాసంపత్తితో మంత్రివర్గానికి సూచన లివ్వ ప్రారంభించాయి. ఈపరిష్కార సూచనలను పొందుపర్చి, విద్యాభిక్షను ప్రజలలో వెదజల్లేందుకు నూతన జాతీయ విద్యాభివృద్ధికి కృషిచేసేందుకు విద్యావేత్తల, విద్యార్థి సంఘాల ఐక్యసమ్మేళనం ఎంతేని అవసరం. దీని పర్యవసానమే జులై 13 న మద్రాసులో జరిగిన విద్యావిషయిక సమావేశం.

అంతర్జాతీయ విద్యార్థిసేవా సమితి మద్రాసు శాఖ యీ సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో మద్రాసు, తమిళనాడు, ఆంధ్ర, కేరళ, విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థికాంగ్రెసు, ముస్లిం విద్యార్థి సంఘాల ప్రతినిధులు, దక్షిణ భారత ఉపాధ్యాయసంఘం, ప్రాథమికోపాధ్యాయుల సంఘం, ముస్లిం ఎసోసియేషన్, హిందూస్తానీ తాలిమిసంఘం, కాలేజీ అధ్యాపకుల సమాఖ్య ప్రతినిధులు హాజరైనారు. జులై 13 న బైబిల్ సమాజంవారి మందిరంలో సమావేశం ప్రారంభమైంది. విద్యార్థిసంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు చిరునవ్వులతో పరామర్శించుకుంటూ కార్యక్రమాన్నిగూర్చి సమిష్టిగా చర్చించుతూవుంటే కనుల పండువగావుంది. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సన్నిహిత సంబంధాలు,సుహృద్భావాలు యింతవరకులేకుండా సామ్రాజ్యవాదులు ఒకఅడ్డుకట్టకట్టారు. కానిఆనాటిదృశ్యం ఈఅడ్డుకట్టల త్రెంచేందుకు నాందివాచకం, [కాలేజిలో అధ్యాపకులైన] బాషీక్ అహమ్మద్ అధ్యక్ష పీఠం అలంకరించారు. కార్యక్రమం ప్రారంభమయింది. విద్యార్థి సమస్యను సమగ్రమంగా చర్చించి సమావేశానికి నివేదికలను సమర్పించటానికి ప్రత్యేక కమిటీలు నియమించ బడినాయి. ప్రతి కమిటీలో అన్నిసంస్థల ప్రతినిధులున్నారు. గత రాజకీయ విభేదాలతోను, ఉపాధ్యాయ, విద్యార్థి ద్వేషాలతోను యిప్పటి వరకూ నిండియున్న విద్యా ప్రపంచంలో కొద్ది గంటలలో అతి ప్రధానమైన సమస్యలు ఏ విధంగా ఏకాభిప్రాయానికి రాగలుగుతాయా అనే సందేహం వుండటం సహజం. కాని సమస్యల తీవ్రత నూతన విద్యావిధానంకొరకు వున్న ఆసక్తి, తృష్ణ, గత ద్వేషాలను మరిపించింది. ఒకే ఆశయంకొరకు కృషిసాగించాలని పూనుకున్న ప్రతినిధులలో సమస్యల పరిష్కారాల పైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. సాయంకాలం 3 గం॥ లకు నివేదికలు తయారైనాయి.

సీట్ల సమస్య నివేదికలో సీట్ల కొరతవలన విద్యార్థులు ఏ విధంగా దుర్భరపరిస్థితులకు లోనవుతున్నదీ వివరించి, పరిష్కార సూచనలు తెలియజేసారు. షిఫ్టు పద్ధతి ప్రవేశపెట్టాలని, సెప్టెంబరు తరగతులు ప్రారంభించాలని, యుద్ధ సమయంలో మిగిలిపోయిన పరికరాలతో టెక్నికల్ కళాశాలలు, స్కూళ్లు ప్రారంభించాలని, విద్యాపరికరాలువున్న హైస్కూళ్ళను కాలేజీలగా మార్చాలని, నూతన కాలేజీలు ప్రారంభించుటకు వున్న నిర్బంధాలను తొలగించాలని, పెద్ద పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా సాంకేతిక స్కూళ్ళను తెరవాలని కోరారు. తరువాత శ్రీ గణేష్(అ॥ భా॥ వి॥ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి) ప్రభుత్వాలు విద్యార్థుల జీతాలుపెంచటాన్ని నిరసించుతూ, విద్యకు బడ్జెటునుపెంచేందుకు పోలీసుల బడ్జెటును తగ్గించాలని, సరాసరి రాబడికన్న ఎక్కువ వస్తున్న వారిపైవిద్యాపన్ను విధించాలని, విద్యానిధిని అప్పు తీసుకోవాలని, అధికలాభాల పన్నును యిందుకు వినియోగించాలని మొదలయిన సూచనలతోనివేదికను సమర్పించారు. హాస్టళ్ల, హోటళ్ళ సమస్య తీవ్రతను ఉదాహరణ పూర్వకంగా వివరించుతూ, పట్టణాలలోని సత్రములను విద్యార్థులకు యివ్వాలని, కాలేజి, స్కూళ్ళ హాస్టళ్ళు ఎక్కువ చేయాలని, గుంటూరులోని పుగాకు గిడ్డంగులు తొలగించాలని సూచించుతూ రిపోర్టు చదివారు. ఇందులో అన్నామలై విశ్వవిద్యాలయంలో 5 లక్షల నిధి రిజర్వ్ఫండు వున్నదని, తిరువాంకూరు మహారాణి 2½ లక్షల నూతన భవనాల నిర్మాణానికి విరాళం యిచ్చిందని, 3 సం॥ నుంచి ఆ నిధిని వుపయోగించక పోవటం శోచనీయం అని చెప్పారు. కాని కాలేజి అధ్యాపకులు పార్థసారథిగారు. యీ నివేదికలోని లెక్కలు చూచి, సరికాదేమోననే భయాన్ని వెల్లడించారు. కాని విద్యార్థి వుద్యమంలో ఆరితేరిన దిట్టలు వూరుకుంటారా! మద్రాసు విద్యార్థి కాంగ్రెసు నాయకులు రామచంద్రన్ లేచి, పై విషయాలన్నీ సరియైనవేనని వాదించారు. కామ్రేడ్ గణేష్ లేచి, తాను సేకరించిన లెక్కలు చూపారు. వీరి కృషికి అభినందించుతూ, తమ సవరణను ఉపసంహరించుకున్నారు.

ఉపాధ్యాయ పోరాటాన్ని, కోర్కెలను బలపర్చుతూ మరొక రిపోర్టు చదివారు.

ఈ నివేదికలపై ప్రతినిధులందరూ ఏకాభిప్రాయానికి రావటం ఎంతో ప్రధానమైనది.

ఈ సమావేశంలో ప్రధానంగా విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థి కాంగ్రెసు ప్రతినిధులు చేసిన కృషి ప్రశంసనీయం. ఎవరికివారు విద్యా విషయాలను సేకరించుకొని వచ్చారు. వారు చేసిన ఐక్యకృషి ప్రశంసాపాత్రమైనది. నివేదికలు తయారుచేయుటంలో ఎంతో అన్యోన్యంగా ప్రవర్తించుతూ, నిష్కల్మషహృదయాలతో కార్యక్రమాన్ని నడిపారు.

ఐదు సంవత్సరములు గడిచినతరువాత యిట్టి ఐక్యతను విద్యార్థి కాంగ్రెసు, ఫెడరేషనులు ప్రదర్శించటం, ఐక్యవిద్యార్థి ఉద్యమాభిలాషులకు ఆశాజ్యోతి. కాని మన ఆంధ్రదేశంలోని విద్యార్థికాంగ్రెసు నాయకత్వంకు ఐక్యత పట్లగాని, సమస్యల పరిష్కారంపట్లగాని శ్రద్ధ లేకపోవటం విచారకరం. ఆంధ్రనాయకులు కనీసం మద్రాసు విద్యార్థి కాంగ్రెసు సోదరుల నుంచి అయినా గుణపాఠం నేర్చుకుంటారా! మద్రాసులో ప్రారంభమయిన విద్యావిషయక సమావేశాలు ప్రతిప్రదేశంలో జరిపి, విద్యాభివృద్ధికి ప్రతి ఆంధ్రుడూ కృషి చేయాలి, మద్రాసులో ప్రారంభించిన సుసాంప్రదాయాన్ని ముందుకు తీసుకుపోదాం.

మన నాటకరంగం

శ్రీ కొండముది గోపాలరాయశర్మ

ఈనాడు ఆంధ్ర నాటక రంగం చాలా ...స్థితిలో ఉన్నది - ఇది పరమసత్యం. విశేష మేమంటే ఈసత్యాన్ని సర్వత్రా ఆమోదించడం. దౌర్భాగ్యమేమంటే చేతులు ముడుచుకొని కూర్చోవడం. నాటకమందిరా లనబడే నాట్యకళా వధ్యశిలా మంటపాలు, నటీనటులనబడే విజ్ఞానరహిత భీషణ విటమార్గసంచారులు, నాటకాలనబడే భాషావిన్యాస ప్రదర్శన కోలాహలాలు - ఇవి సంక్షిప్తంగా మన నాటక రంగంలో నిత్యసత్యాలు.

ఇబ్సెన్‌వంటి పాశ్చాత్య నాటకకర్త కీర్తి ప్రభలు ప్రాక్ప్రపంచాన్ని అలంకరించకముందే అంతకంటేకూడా సజీవపాత్ర నిర్మాణంలో పైచేయి అనదగిన గురజాడ జన్మభూమి! ఒక ప్రక్క ధర్మవరంవారు షేక్స్‌పియర్ నాటకాను సరణలో, మరొకప్రక్క వేదంవారు కరక్కాయ పాకం సాగించుటలో నిమగ్నులైననాడే, కన్యాశుల్కంవంటి ఉత్తమ నాటకాన్ని ప్రసాదించాడా మహానుభావుడు!

రచయిత పూనుకోవాలా? నటీనటులు ముందుకు రావాలా? ప్రేక్షకులలో పరివర్తన రావాలా? - నాటకరంగ పునర్నిర్మాణోత్సుకులు తరచు ఈ ప్రశ్నలు వేసుకుని తమలో తామే సమాధానపరచుకుంటారు.

ఐరిష్ నాటక విమర్శకురాలు గ్రిగరీసతి చెప్పినట్లు, నాటకకర్త, నటుడు, ప్రేక్షకులు - ఈమూర్తిత్రయమే థియేటర్‌కు ప్రాణత్రయం, నటరాజుగా మనం ఆరాధించే శివుడు—త్రినేత్రధారి - నటరాజ రూపంలో ఆయన నేత్రత్రయానికి సమన్వయం గ్రిగరీసతి చెప్పే సత్యత్రయం.

కొద్ది సంవత్సరాలుగా ఆంధ్రదేశంలో నాటకకళోద్ధరణోత్సాహం వెల్లివిరిసింది-విశేషమేమంటే ఆంధ్రుల సాంప్రదాయానుసారం, అది మఖలో పుట్టి పుబ్బలో సమసిపోకుండా క్రమేపీ దినదిన ప్రవర్ధమాన మవుతున్నది. ఈ ఉత్సాహం ఇలా ఉండగనే నాటకకళా సేవకులు నడుములు బిగించి ఏదో ఒక విశిష్ట కార్యక్రమాన్ని మనసా తలపెట్టి శాయశక్తులా పాటుపడాలి.

రచయిత పూనుకోవాలా?- "వేసేవారులేనిదే వ్రాసేదెవరికి?" అని కొందరంటే, "వ్రాసేవారు లేనిదె వేసేదేమిటి?" అంటారు మరికొందరు, "వ్రాసేవారు, వేసేవారు ఉంటేమాత్రం చూసే నాధుడుండొద్దా" అంటారు, మరికొందరు అనాథప్రేతలు. చివరచెప్పిన పెద్దలే విషబీజాలు. "ప్రజలకు నచ్చదండీ!" అంటారీ మహామహులు. వాళ్ళజన్మలో ప్రజాసామాన్యాన్ని గాని, గ్రామాలనుగాని, చూడకపోయినప్పటికీ. ప్రజానాట్యమండలి రాజకీయాలను, సాంఘిక సమస్యలను కూడా వ్యంగ్య నాటికల రూపంలో, భాగవతాల రూపంలో డాన్సులరూపంలో కుగ్రామాలలో సహజవంతంగా ప్రదర్శించిందనీ, చూసినప్రజా బాహుళ్యం మెచ్చుకుందనీ తెలుసుకున్న తర్వాతకూడా పై మొండివాదన సాగించే శిఖండుల నేమనాలో తెలియడం లేదు. 'సిమ్లా భాగోతం' తీసుకోండి — "ప్రహ్లాద, అనసూయ" వేసిన వీధిభాగవతాలకత్తునే తీసుకుని, ఆధునిక పరిస్థితుల కనుగుణంగా మార్చుకుని వేస్తున్నారు. ప్రజానాట్యమండలి ప్రదర్శనలలోని రాజకీయాభిప్రాయాలతో ఒకరు ఏకీభవించవచ్చు, మానవచ్చు. ఒకవిషయం అభ్యుదయకరమని నేనంటే, కాదంటాడనుకోండి నా మిత్రుడొకడు, నేను నాత్రోవనే ముందుకు పోతాను. ఎంతచెప్పినా వినక పోయిన నా మిత్రుడు వెనకాలేవుండి పోతాడు గుడ్లుమిటకరిస్తూ! ఏనాడో ఒకనాడు నన్ను కలుసుకోడానికి ప్రయత్నిస్తాడు. ప్రజానాట్యమండలి ప్రదర్శనాలకు కళాస్వరూపాలదృష్ట్యా చూడాలే గాని పక్షపాత దృష్టికూడదు.

ఇటీవల రెండు మూడేండ్లుగా ఎన్నో సాంఘిక నాటకాలు వస్తున్నవి. యువకులు ఉత్సాహంతో రాస్తున్నారు. ఇవన్నీ విశిష్టంగా ఉన్నవనికాదు. 50 సంవత్సరాల పాటు దుస్థితిలో మునిగిన తర్వాత కోలుకోవడానికి కొంత కాలం పడుతుంది. ప్రథమ ప్రయత్నాలలో లోపాలు ఉంటవి. కాని, ప్రయత్నాలను హర్షించి దోహదమివ్వాలి. వీటిని వేస్తున్న వారు యువకులు. అంతేగాక విద్యార్థులుకూడా ఇటీవల ఎక్కువగా నాటక కళలో ఉత్సాహాన్ని ప్రకటిస్తున్నారు. కొత్తనాటకాలు, కొత్తధోరణి అలవాటు పడడం చదువుకున్నవారికి సాధ్య... రులకుగాదు. ఈ నాడు యువకులు, విద్యార్థులు కనక ముందుకు వచ్చి నాటకరంగ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించక పోతే, ఎన్ని నాటకాలు కొత్తవి వచ్చినా ఫలితం వుండబోదు. ప్రొఫెషనల్స్, ఇదివరకు "కొత్తవిరాస్తే మేము వెయ్యమా?" అని గుంభనగా సమాధానం చెప్పేవారు. గత ఒకటి, రెండు సంవత్సరాలలో ఎన్నో కొత్త నాటకాలు, సాంఘిక, రాజకీయ నాటకాలు వచ్చినవి. వాటిలో లోపాలుంటే ఉండుగాక; ప్రొఫెషనల్స్‌ప్రదర్శించే అభావ నాటకాలకంటె ఇవి ఏమాత్రం తీసిపోవు. వీటిలో ఏ ఒక్క నాటకాన్ని అయినా ప్రొఫెషనల్స్ గట్టిగా రిహార్సల్సుచేసి ప్రదర్శించారా? నాటకాలు వస్తున్నాయిగాని వీరు వెలుపల వుంటున్నారు. వాళ్ళను వెలుపలవుంచడమే మంచిదికూడా. కొత్త నాటకాలు కట్టుదిట్టంగా ఆడవలసినవే గాని, కంట్రాక్టుల పద్ధతిలోకాదు. ఈ 'డిసిప్లిన్' అనే పదార్థం ప్రొఫెషనల్ మార్కెట్టులో కనుపించదు. అది యువకులమైన మన సొమ్ము - వాస్తవంగా కళాపిపాసులమైన మన సొమ్ము.

యువకులు, విద్యార్థులు దళాలుగా ఏర్పడి కొత్తనాటకాలను కట్టుదిట్టంగా తయారుచేసి గ్రామసీమలలో ప్రదర్శించాలి. కొత్త రచయితలు వచ్చారు. వేసేవారుకావాలి. ఈదృష్టితో చూచినపుడు ప్రజా నాట్యమండలి, విద్యార్థి విజ్ఞాన దళాలు అనుబంధశాఖలు చేసే మేటి సేవ తేలిగ్గా తెలుస్తుంది. రచయితల్లో మార్పు వచ్చింది - యువకులైన నటులలోను మార్పు వచ్చింది - ప్రేక్షకులలో మార్పు తీసుకురావాలి. దీనికి మార్గం ఒకటే - కొత్త నాటకాలను పల్లెపల్లెలలోను కూడా ప్రదర్శించాలి. ఆదర్శప్రాయంగా వుండే మన ప్రదర్శనాలను చూసి, ఆ ప్రజాబాహుళ్యం తప్పులుతడకలుగా ఉండే ప్రొఫెషనల్ కంట్రాక్టు నాటకాలను చీదరించుకోవాలి. ఒక్క అయిదారు సంవత్సరాలలోగా ప్రజాసామాన్యంలో కలిగినసంచలనాన్ని, ఏదో కొత్తదనం యువకులు చూపుతున్నారనే అభిప్రాయాన్ని మనం జ్ఞాపకం వుంచుకుంటే, మరి కొద్ది సంవత్సరాల నిశ్చలకృషితో ప్రజాబాహుళ్యంలో పూర్తిమార్పు తీసుకురాగలము.

మిగతా 15 వ పేజీలో

వ జా వ జ్ఞా నా వ క పు నా దు లు వ స న

ఆంధ్ర యువజనోద్యమ సమీక్ష

భారత ప్రజల స్వాతంత్ర్య కాంక్ష బ్రహ్మాండమైన వెల్లువగా పొంగి వచ్చింది. భారత దేశాన్ని 200 సంవత్సరాలనుండీ పీల్చి పిప్పిజేస్తూ వేళ్ళు నాటుకు పోయిన బ్రిటిషు సామ్రాజ్యవాదులు కూకటి వేళ్ళతో పెకిలింపబడి ఈ వెల్లువలో కొట్టుకు పోతామని భయపడి నామ మాత్రమైన స్వాతంత్ర్యం ఇచ్చి మోసపుచ్చ ప్రయత్నించు తున్నారు. అధినివేశ ప్రతిపత్తిని ప్రసాదించే చట్టాన్ని బ్రిటిషుపార్లమెంటు ఆమోదించింది. అగస్టు 15న అధినివేశ ప్రతిపత్తి ప్రవేశపెట్టబడ బోతోంది. కాని తమ చీల్చి పరిపాలించే కుతంత్రాన్ని వాళ్ళు వదలుకోలేదు. భారత దేశాన్ని పాకిస్థాన్, ఇండియన్ యూనియన్ అని రెండు భాగాలుగా చీల్చారు. ఈ రెండు భాగాలను ఎల్లప్పుడూ ఒక దానితో వరొకటి బద్ద విరోధంతో ఉంచుతూ తమ పెత్తనాన్ని పరోక్షంగా కొనసాగించుకోడానికి కుయుక్తులు పన్నుతున్నారు. తమ తొత్తులైన స్వదేశ సంస్థానాధీశులను స్వతంత్రులుగా ప్రకటించి, వారి ద్వారా ఇండియను యూనియన్, పాకిస్థాన్‌ల మీద వత్తిడి తెచ్చి, వాటిని తమ అధినివేశ రాజ్యాలుగా ఉంచుకోడానికి, వీలుతప్పితే తమ కనుకూలమైన వాణిజ్యమిలిటరీ సంధులను సాధించడానికి తీవ్ర ప్రయత్నాలు సాగించు తున్నారు.

ఇట్టి విషమ సమయంలో భారత యువకులమీద ఎంతో భారమున్నది. బ్రిటిషు సామ్రాజ్యవాదుల కుతంత్రాన్ని భగ్నంజేసి, వాళ్ళ యిస్తున్న నామమాత్రమైన స్వాతంత్ర్యాన్ని నిజమైనస్వాతంత్ర్యంగా చేయాలిసిఉంది. ఆంధ్రలో యువజనోద్యమం యువకుల జీవితంలో ప్రముఖస్థానాన్నలంకరించింది. ఈ సమయంలో ఆంధ్రయువజనోద్యమాన్ని సమీక్షచేసి, ముందుకార్యక్రమాన్ని వేసుకొని, కర్తవ్యనిర్వహణకు ఆంధ్రయువకులు ముందుకు సాగిపోవడం నేడు ఎంతేని అవసరం. ఈ వ్యాసం అందుకు ఉద్దేశించబడింది.

సంఘటిత యువజనోద్యమ పుట్టుక ప్రథమ దశ 1935-38

ద్వితీయ సత్యాగ్రహోద్యమం (1930-34) అణిపివేయబడిన రోజులవి. సత్యాగ్రహోద్యమంలో అనేక త్యాగాలు చేసిన యువకులు

వ్యాసకర్త



ఆంధ్రయువజనోద్యమ వ్యవస్థాపకులలో ఒకరు
శ్రీ చండ్ర రాజేశ్వర రావు

జైళ్ళనుండి క్రమంగా వదలిపెట్టబడుతున్నారు. స్వాతంత్ర్య సంపాదనకు గాంధీజీ చూపిన మార్గంలో విశ్వాసం పోయి. యువకులు కొత్త మార్గాలు వెతకనారంభించారు. దీనిఫలితమే 1936 లో విశాఖపట్టణంలో జరిగిన ప్రథమ ఆంధ్రరాష్ట్ర యువజన మహాసభ, తీవ్రరాజకీయ కార్యక్రమంతో, ఆంధ్రరాష్ట్ర యువజన సంఘం ఏర్పడింది. యువజనోద్యమానికి పునాది వేసినవారిలో ముఖ్యులు పుచ్చలపల్లి సుందరయ్య, జొన్నలగడ్డ రామలింగయ్య, అల్లూరి సత్యనారాయణ, అప్పటికి తీవ్రవాదులుగా ఉన్న పళ్ళంరాజు, తెన్నేటి విశ్వనాథం ప్రభృతులు. ఆంధ్రరాష్ట్ర యువజన సంఘం తీవ్రవాదరాజకీయ ప్రచారానికి వేదికగా ఉండేది. క్రమంగా కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలలో జిల్లాసంఘాలు స్థానికసంఘాలు ఏర్పడినవి. యువజనోద్యమం 1937 రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో తనపాత్రనుఅమోఘంగా నిర్వహించింది. సామ్రాజ్యవాదుల తొత్తులైన జమీందార్లు ఇతర స్వామిభక్తి పరాయణులకు ఎన్నికల్లోజరిగిన పరాజయానికి, కాంగ్రెసు యొక్క అఖండవిజయానికీ యువజనసంఘం తీవ్రకృషి చేసింది. కాంగ్రెసు ప్రముఖుల మన్ననలనుగూడ పొందింది.

ద్వితీయ దశ 1938 - 42 సామాన్య యువకుల సమీకరణకు కార్యక్రమ స్వీకారం

అతివాద యువకులలో సోషలిస్టు భావాలు క్రమంగా స్థిరపడినవి. సోషలిస్టుభావాలుగల యువకులు సోషలిస్టు పార్టీలో సంఘటితంకాజొచ్చారు. ఇక ఆంధ్రరాష్ట్ర యువజనసంఘం అతివాద యువకుల రాజకీయ వేదికగా ఉండాలిసిన అవసరం పోయింది. అందుచే ఆటలు, పాటలు, విద్య, విజ్ఞాన ప్రచారం మొదలైన విశాల యువజన కార్యక్రమంద్వారా యువకులలో ప్రబలియున్న దురభ్యాసాలను, అజ్ఞానాన్ని పోగొట్టి, సామాన్య యువకులనందరినీ స్వాతంత్ర్యోద్యమంలో తమపాత్రను నిర్వహించడానికి సమీకరించ పూనుకొంది. ఆంధ్రరాష్ట్ర యువజనసంఘం ఆంధ్ర యువకులందరి రాజకీయ వైజ్ఞానిక విశాల వేదికగా, అభివృద్ధికా ప్రారంభించింది. కృష్ణాజిల్లా పొట్టిపాడు గ్రామంలో జిల్లా ఒలెంపిక్ ఆటల

మిగతా 13వ పేజీలో

చినఓగిరాల

ఆదర్శ గ్రామ యువజనసంఘం

"సమైనలో ఏ చిన్న పొరపువచ్చినా, సంఘంవారి ద్వారా పరిష్కారం చేసుకుంటాం. ఎంతగడ్డు సమస్యనైనా సంఘంవారు అరటి పండు ఒలిచి చేతిలోపెట్టినట్టు తీర్పు చెబుతారు." అని గ్రామస్థులంతా యువజన సంఘాన్ని గౌరవించడమేగాక తమ తలలో నాలుకగా ఎంచి "సంఘంవారు" అని ఎంతో ఆప్యాయంగా పిలుచుకుంటారు.

యువజనసంఘం ఏర్పడకపూర్వం గ్రామంలో రెండు, మూడు పార్టీలుండేవి. అభివృద్ధినిరోధకులైన కొంతమంది స్థానిక పెత్తందార్లు కుల, మతాలపేరిట చీలికలు కల్పించి యువకులను తమ స్వార్థానికి ఉపయోగించుకునేవారు. ఈ చీలికలవల్ల యువకులు కర్తవ్యతా విమూఢులై అనేక దురభ్యాసాలకు గురి అయ్యారు. ఆ స్థితిలో చదువుకున్న యువకులు ఒకరిద్దరు కాలేజీలనుండి స్వగ్రామానికి వచ్చి, తమ గ్రామపరిస్థితులను ప్రత్యేకంగా యువకుల నైతికపతనాన్ని చూచి, అన్నిపార్టీలలోని యువకులను కలిపి ఒకే త్రాటిపై నడపకపోతే గ్రామజీవితమే దుర్గతిపాలౌతుందని ఎంచి 1938 లో అన్నిపార్టీల, కులాల యువకులతో యువజనసంఘాన్ని స్థాపించారు. అప్పటినుండి యువజన సంఘం ప్రజల దైనందిన కష్టసుఖాలలో భాగస్వామిగా పని చేస్తోంది. ఇలా పనిచేయడం అభివృద్ధినిరోధక పెత్తందార్లకు గిట్టలేదు. వారికి చీమలు, జెర్రులు ప్రాకినట్లయింది. యువజన సంఘాన్ని చీల్చడానికి అనేక కుయుక్తులు పన్నారు. యువకులు గ్రహించారు. పెత్తందార్లు లోగడనుండే తమను ఉపయోగించుకొని గ్రామ అభివృద్ధికి యెలా నాశనకారకులైందీ వారు మర్చిపోలేదు. వారి ఎత్తుల నుండి యువజన సంఘం తన ఐక్యతను కాపాడుకొంది. ముందుకు అధిగమించింది. అప్పటినుండి అన్నికులాల యువకులను ఆటపాటలద్వారా ఆకర్షించింది. ప్రత్యేకంగా హరిజన యువకులు అగ్రకులాలతోపాటు అభివృద్ధికి రావడానికి అవకాశం కల్గింది. తాలూకా ఆటల పోటీలలో ప్రతి సంవత్సరం రెండు లేక మూడు హరిజనటీములు పాల్గొని, తమకు అగ్రకులాల యువకులకు మధ్య అంతర్యం లేదు; అందరం యువకులం; అందరి అభివృద్ధికి పాటుపడదాం అనే భావం హరిజన యువకులకు యువజన సంఘం కల్గించింది. ఒక ఆటలలోనేగాదు - నాటకాలు వేయడం మొదలుకొని, రాత్రిపాఠశాలలో అగ్రకులాలతో పాటు కలిసి చదువుకోవడం వరకు హరిజనులకు అవకాశం కల్గింది. రాత్రి పాఠశాలల ద్వారా ప్రతిసంవత్సరం 30 మంది హరిజనులు పేపర్లు, పుస్తకాలు చదివి అర్థంచేసుకునే దశకు తయారవుతున్నారు. అంటువ్యాధులు వచ్చినపుడు తమ గూడెంలో ఆరోగ్యవిధులను ప్రచారంచేసి రోగులకు చొరవతో ఉపచారాలు చేస్తున్నారు. కాలువలు త్రవ్వడం మొదలైన గ్రామ సమస్యలలో హరిజనులు యెంతో ముందుకువచ్చి తమవంతు బాధ్యతను ఆదర్శంగా నెరవేర్చారు. త్రాగుడు, జూదాలు మొదలైన దురభ్యాసాలను పారద్రోలారు. ఎంతోకాలంనుండి అణగద్రొక్కబడిన తాము యువజనసంఘం ద్వారా అభివృద్ధికి రావడంవల్ల సంఘ సభ్యులమని సగర్వంగా చెప్పుకుంటారు.

ఇలా అన్నికులాల యువకులను ఐక్యంగా నడుపుతున్న గ్రామ యువజనసంఘం చెడుగుడులో వరుసగా 5 సంవత్సరాలు తాలూకా ఆటలపోటీలలో మొదటిదిగా వచ్చింది. జిల్లా పోటీలలో ఒక సంవత్సరం మొదటిదిగాను, మరియొక సంవత్సరం రెండవదిగాను వచ్చింది.

వరవిక్రయం, పతితపావన, ప్రతిమ మొదలైన నాటకాలను, అనేక గ్రామాలలో ప్రదర్శించి ప్రజలమన్నన పొందినది. ప్రస్తుతం "మా భూమి"ని తయారు చేస్తోంది.

కష్టపడి, స్వంతంగా ఒక గ్రంథాలయాన్ని నిర్మించి 500 గ్రంథాలను సేకరించి నడుపుతోంది. నూటికి 95 మంది యువకులు, యువజనసంఘ సభ్యులు.

ఈ ఆదర్శ యువజనసంఘం 1946 మార్చి 20 తేదీన జరిగిన జిల్లా యువజన మహాసభకు ఏతెంచిన 50 వేలమంది ప్రజలను సత్కరించి దిగ్విజయం చేసింది. ప్రపంచ యువజన ప్రతినిధివర్గానికి ప్రేమతో ఆతిథ్యమిచ్చి జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. ఆ ఆదర్శ గ్రామ సంఘమే కృష్ణాజిల్లా, గన్నవరం తాలూకా "చినఓగిరాల" గ్రామ యువజనసంఘం.

—దాసు

గుంటూరులో


తిండీకరువే! ఇండ్లూకరువే!

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి కేంద్రమైన గుంటూరులో ఈసంవత్సరం దాదాపు 8000 విద్యార్థులు గలరు. లోగడ ఆరోగ్యశాఖా మంత్రిణి వచ్చినప్పుడు పరిస్థితులు కళ్ళారచూచి ఆరోగ్యానికి భంగకరమైన పొగాకు గిడ్డంగుల 47 మేలోగా పట్టణంబయటికి పంపవలసిందని మున్సిపాల్టీకి తాఖీదులు పంపారు. దానినిఆచరణలో పెట్టకపోగా నెలరోజులక్రితం పైతాఖీదులను ఉపసంహరించుకోవడం ఆశ్చర్యకరం. 20 వేల మందికి సరిపోయే యీ 1500 గిడ్డంగులను వెంటనే ఖాళీచేయించి విద్యార్థులకు, వేలకొలది ప్రజలకు వసతులేర్పాటు చేయకపోతే అసలే దుర్భరంగానున్న పరిస్థితులు మరింత విషమించగలవు.

దీనిని మించిన హోటళ్ళ సమస్య విద్యార్థుల నెదుర్కొంటున్నది. బెజవాడలోపూటకు 0-8-0 అయితే అంతకంటే నాసిరకమైన భోజనానికి 0-12-0 వసూలు చేస్తున్నారు. బెజవాడలో రెండణాలకు యిచ్చే పదార్థము (స్వీటు) గుంటూరు కాఫీహోటళ్ళలో 4 అ. లేక 5, అణాలు ఖరీదు గలదు. గత సంవత్సరం నెల 1కి భోజనానికి 22-8-0 ఉన్న రేటును యీ సంవత్సరం రు. 28 లేక 30 రూపాయలకు పెంచారు. నెయ్యి మినహా జీవితావసర ఆహార పదార్థాలకు ధరలు పెరుగలేదు. పైగా కొన్నిటి ధరలు తగ్గినవి. అకారణంగా హోటలు రేట్లు పెరుగుటవలన విద్యార్థులు ఆర్థికంగా ఎంతో అవస్థపడుతున్నారు.

పై సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు, ప్రజలకు వసతులు కల్పించడం ప్రజాప్రభుత్వ కనీస ధర్మం. కాని అట్టి ప్రయత్నాలేవీ కనపడటంలేదు. పట్టణంలో విద్యార్థులెంతో కలవరపడుచున్నారు.

స్థానిక విద్యార్థిసంఘం పై సమస్యల పరిష్కారానికి ఆందోళన చేయుచున్నది.



అధిక ఆహారోత్పత్తికి బందరుకాల్వ త్రవ్వటానికి రాష్ట్ర రైతుసంఘం పిలుపిచ్చింది. వందలకొలది యువకులు ఆ పిలుపునందుకొని పనిచేస్తున్న దృశ్యం

★

పోటీలు 1938 వేసవిలో జరుపబడినవి. నాటి నుండి నేటివరకు ప్రతి సంవత్సరం, ఆటల పోటీలు జరుపబడుతూనే ఉన్నవి.

1941 వేసవిలో యలమర్రు, జమిగొల్వేపల్లి గ్రామాలలో వయోజన విద్యా కేంద్రాలు ఆరంభింపబడి, వందలకొలది నిరక్షరాస్యులకు విద్య గరపబడింది. అక్షరంముక్క తెలియని కష్టజీవులకు కొద్దికాలంలో చదువుట, వ్రాయుట గ్రామప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. యువజన సంఘంవారి ఆదరణ మన్ననలను పొందింది. ఇంతగిట్టని అఖ్యయిజర్ల మద్రాసు ప్రభుత్వం, కమ్యూనిస్టు ప్రచారం చేస్తున్నారనే సాకుతో వయోజన విద్యాప్రచారాన్ని నిషేధించింది.

విశాల యువజన కార్యక్రమం అసలు జరుపని మిగతా జిల్లాల్లో యువజనోద్యమం తాత్కాలికంగా మందగించింది,

తృతీయదశ 1942 - 47
ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం కార్యక్రమ విస్తరణ

పశ్చిమాన ఫాసిస్టు జర్మనీ,ఇటలీలు యూరోపా ఖండాన్నంతా మ్రింగి సోవియటు యూనియన్ మీద దాడి చేసినవి, తూర్పున ఫాసిస్టు జపాను ఫిలిప్పైన్సు, ఇండొనీషియా, ఇండో చైనాల మీద దాడిచేసి ముందుకు వస్తూ ఉన్నది. భారత దేశానికి తూర్పు పశ్చిమ రెండు వైపులనుండీ ఫాసిస్టు ప్రమాదం ఏర్పడింది. బ్రిటిషు సామ్రాజ్య వాదులు భారత దేశాన్ని జపానుకు బలి జేయడానికైనా సిద్ధపడ్డారు గాని, భారత దేశ ప్రజల సహకారంతో ఫాసిస్టు ప్రమాదాన్నుండి భారతదేశాన్ని తప్పించడానికి అంగీకరించ లేదు. ఇట్టి విషమ పరిస్థితులలో యువజన సంఘం యువకులను ప్రజలను మేల్కొలపడానికి నడుం బిగించింది. ప్రాచీన ప్రజా వైజ్ఞానిక రూపాల ద్వారా ప్రజల్లో ప్రవేశం చేయ ప్రారంభించింది. కృష్ణాజిల్లా యువజనసంఘం తరఫున 1942లో గండిగుంటలో ఫాసిస్టు వ్యతిరేక వైజ్ఞానిక శిక్షణ శిబిరం నెలకొల్పబడి యువకులకు తర్ఫీదు ఇవ్వబడింది. ఈ సుశిక్షితులైన యువకులు గ్రామాల్లో ప్రచారం జేసి లక్షలాది ప్రజలను ఫాసిస్టు ప్రమాదానికి మేల్కొలిపారు. ఇందువల్ల యువజనోద్యమం ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేయుటతో పాటు, ప్రాచీన కళారూపాలను (గొల్లసుద్దులు, బోడు వేషం, నాటికలు వగైరా) పునరుద్ధరించి నూతన జీవం పోసి నూతన ప్రజా వైజ్ఞానికోద్యమానికి పునాదులు వేసింది.

ఇంతలో 1942 అగస్టు దుర్దినాలు వచ్చాయి. బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రధమ ప్రజా సంస్థ అయిన కాంగ్రెసు సహకారాన్ని తీసుకోడానికి

యువజనోద్యమ బాధ్యతలు

బదులు ఆగస్టు 9న కాంగ్రెసు నాయకులను అకస్మాత్తుగా అరెస్టుజేసి కాంగ్రెసు మీద తీవ్ర నిర్బంధ విధానానికి పూను కొన్నారు. దీనితో కాంగ్రెసు వాదులు రెచ్చిపోయి విధ్వంస చర్యలకు పూనుకొని నిరంకుశోద్యోగులకు పూర్తి అవకాశం ఇచ్చారు. భారతదేశ మంతా అగ్నిజ్వాలల్లో పడిపోయింది. యువజనోద్యమం దీనికి కారకులైన బ్రిటిషు సామ్రాజ్యవాదుల నిర్బంధ విధానాన్ని నిరోధించుతూ, దేశ స్వాతంత్ర్యానికి విధ్వంస చర్యలు మార్గం గాదని వారించింది దీనితో యువజనోద్యమంలో చీలిక వచ్చింది. యువజన సంఘం పాలసీతో భేదించిన వారందరూ చీలిపోయి యువజన కాంగ్రెసును స్థాపించారు ఐదేళ్ళ నాటి ఆచీలిక ఈ రోజువరకు అలాగేఉంది.

అన్ని అభివృద్ధికర రాజకీయాభిప్రాయాలు గల యువకులందరినీ ఒక వేదికమీద సమీకరించ లేకపోయినప్పటికీ యువజనసంఘం కార్యక్రమాన్ని విస్తృతపరచుటద్వారా ఎంతో అభివృద్ధిచెందింది. ఆటలు, స్పోర్ట్సు గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి మొదలైన జిల్లాలకుగూడ వ్యాపించాయి. జిల్లా ఒలెంపిక్ పోటీలేగాక తాలూకా ఒలెంపిక్ పోటీలుగూడ ఏర్పరుపబడినవి. వేలకొలది యువకులు వీనిలో పాల్గొన్నారు. ఒక్క కృష్ణాజిల్లాలోనే 1946 సంవత్సరం పోటీలలో సుమారు 2500 మంది కూలీ, రైతు మధ్యతరగతి యువకులు పాల్గొన్నారు. ఇంతేగాక ఆటల టెక్నికులో గూడ అభివృద్ధికరమైన మార్పులు యువజన సంఘం తీసుకువచ్చింది యువకులకు కనీస శారీరక శక్తిసామర్థ్యాలు వచ్చేటందుకు యువకులను ప్రోత్సాహపరచడానికి దేహ దారుఢ్య పోటీలు 1946 లో ప్రారంభించింది. ఈ ఉద్యమం ఆంధ్ర యువకులను శక్తివంతులనుగా చేయడానికి ఎంతేని ఉపకరించుతుంది. ఇది ఆంధ్ర యువజనోద్యమంలో ఒక నూతన ఘట్టం.

సంక్రాంతి, దసరా, దీపావళి మొదలైన పండుగల పేరుతో జరిగే దురభ్యాసాలు; దురాచారాలను అరికట్టి, నూతన పద్ధతుల్లో వాటిని జరిపేటందుకు యువజన సంఘం పూనుకొంది. ముఖ్యంగా సంక్రాంతి పండుగ రోజున గ్రామాల్లో ఆటలు, స్పోర్ట్సు, వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిపి, యువకుల దృష్టిని జూదం, కోడిపందాలు మొదలైనవాటినుండి మరల్చుతోంది. ఇందువల్ల యువజనసంఘం పెద్దల అభిమానాన్ని చూరగొంటూఉంది.

రాత్రి పాఠశాలలను విరివిగా జరుపుతూ అజ్ఞానాన్ని పారదోలుతూఉంది. గత సంవత్సరం కృష్ణా జిల్లాలో 110 సెంటర్లలో సుమారు 2500 మందికి విద్య గరపబడింది. ఇందుకు అవసరమైన 'మా పాఠాలు' అనే పాఠ్యపుస్తకాలుగూడ అచ్చొత్తించ బడినవి.

మూలబడివున్న పుస్తక భాండాగారాలను పునరుద్ధరించడం కొత్తవి తెరవడం ద్వారా లైబ్రరీ ఉద్యమాన్ని యువజనసంఘం అభివృద్ధి పరుచుతోంది. ఇందుకు ఆంధ్రరాష్ట్ర పుస్తక భాండాగార సంఘంయొక్క మన్ననలను పొందిందిగూడా.

తిరుణాళ్ళు, అంటువ్యాధులు, అగ్నిప్రమాదాలు మొదలైనవాటిలో ప్రజలకు సేవచేసి ప్రజాదరణనుగూడ సంపాదిస్తూఉంది

కందుకూరి వీరేశలింగంపంతులు, కోడి రామమూర్తి గురజాడ అప్పారావు మొదలైన ఆంధ్రలో నూతన యుగపురుషుల వర్ధంతులను జరిపి, వారి సందేశాలను ప్రజలకు వినిపించుతూఉంది.

బాలసంఘాలను నిర్మించి వారికి ఆట, పాటలను నేర్పి భావిపౌరులుగా తమ కర్తవ్యం నిర్వహించేవారినిగా బాల, బాలికలను తయారు చేస్తూంది.

చినఓగిరాలలో 1947 ఫిబ్రవరిలో జరిగిన కృష్ణాజిల్లా యువజనమహాసభ, ఆంధ్రయువజనోద్యమంలో నూతనాధ్యాయం తెరిచింది. ఇన్ని సంవత్సరాలనుండి కృష్ణాజిల్లా యువజన సంఘం సాగించుతున్న నిరంతర కృషిఫలితం ఆ మహాసభ స్పష్టంగా కనబరచింది. ప్రపంచ యువజనసభ ప్రతినిధులురాక ఆ మహాసభకు శోభనిచ్చింది. సుమారు 50 వేలమంది ప్రజలు సభకు హాజరు అయ్యారు. సభలో ప్రదర్శింపబడిన వైజ్ఞానిక ప్రదర్శనాలు ఆటలు, స్పోర్ట్సు ఉన్నతస్థాయిని చేరినవి. ఈ మహాసభ ఆంధ్ర యువకులను ఎంతో ఉత్సాహపరచింది. ఈ మహాసభ తర్వాత రాష్ట్రమంతటా యువజన కార్యక్రమం చురుకుగా సాగుతోంది.

ఈకార్యక్రమంద్వారా ఆంధ్రరాష్ట్ర యువజన సంఘం వివిధజిల్లాలలో సుమారు 20,000 మంది సభ్యత్వాన్ని కలిగిఉంది. కాని 1942లో యువజనోద్యమంలో ఏర్పడిన చీలిక అలాగే ఉంది. యువకులలో అగ్రగాములైన విద్యార్థులు యువజనోద్యమంలో ఇముడ్చుకోబడలేదు. మాగాణి ప్రాంతంలోని తీరిక ఎక్కువగా ఉండే రైతు యువకులలోనే యువజనోద్యమం ఎక్కువగా వ్యాపించింది; తీరిక సమయం అంతగా ఉండని వ్యవసాయకూలీ యువకులు పట్టణ బీదయువకులు, మెట్టప్రాంతాల యువకులను, సమీకరించే పద్ధతులను ఇంకనూ యువజనోద్యమం తగినంతగా స్వీకరించలేదు. అన్ని అభివృద్ధికర రాజకీయాభిప్రాయాలు గల యువకులను కూలీ - రైతు పట్టణ బీద మధ్యతరగతి యువకులను విద్యార్థులను, మెట్ట మాగాణి ప్రాంతాల యువకులనందరినీ ఒకే వేదికమీదికి విశాల యువజన కార్యక్రమంమీద సమీకరించడం, ఆంధ్రరాష్ట్ర యువజనసంఘ కర్తవ్యం.

యువజనోద్యమ బాధ్యతలు

1. నేటి భారతదేశ పరిస్థితులు అభివృద్ధికి ఎంత అవకాశాన్నిస్తున్నాయో, అంత ప్రమాద భరితంగా కూడ ఉన్నవి. బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రజా వెల్లువకు భయపడి, నామమాత్రమైన స్వాతంత్ర్యం ఇచ్చి హిందూ ముస్లిం కలహాలు, భారతదేశ విభజన, స్వదేశ సంస్థానాలద్వారా తమ పెత్తనాన్ని పరోక్షంగా కొనసాగించడానికి యెత్తులువేస్తున్నారు. వీనిని భగ్నమొనర్చి, ఇండియన్ యూనియన్, పాకిస్థానులు సహకారభావంతో ఉండేలా చేసి భారతదేశాన్ని సంపూర్ణ స్వతంత్రంగా చేయాల్సిన బాధ్యత భారత యువకులమీదవుంది.

మధ్య యుగాలనాటి దుర్భర బానిసత్వం క్రింద బాధపడుతున్న నైజాం సంస్థాన ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి పూర్తి దోహదమిచ్చి 90 లక్షల తెలంగాణా ఆంధ్రులను మిగతా ఆంధ్రదేశంతోచేర్చి విశాలాంధ్రను నిర్మించడంలో అగ్రగాములుగా ఉండాలిసిన బాధ్యత ఆంధ్ర యువకులమీద ఉంది.

ప్రస్తుత విషపూరిత రాజకీయ వాతావరణాన్ని ఉపయోగించుకొని ఆర్. ఎస్. ఎస్, హిందూ మతతత్వవాదులు, నైజాం దుష్టపరిపాలనను సమర్థించే ముస్లిం మతతత్వవాదులు

[illegible] అంతట్ల హిందూ ముస్లిం ఐక్యతను సాధించాలి.

2. ఆగస్టు 15 నాటికి పాకిస్తాన్ ఇండియను యూనియనుల రెండు అధినివేశ ప్రభుత్వాలు ఏర్పడతాయి.

భారతదేశం ఆర్థిక రాజకీయ వైజ్ఞానిక పునర్నిర్మాణ కార్యక్రమం కొనసాగించడానికి చక్కని అవకాశం ఏర్పడింది. అందుచే అట్టి సర్వతోముఖమైన జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం అమలు జరుపమని ఇండియను యూనియను ప్రభుత్వంమీద, రాష్ట్ర మంత్రివర్గాలమీద వత్తిడి తీసుకు రావాలి.

(అ) పరిశ్రమలూ, వ్యవసాయం మొదలైనవాని అభివృద్ధికి ప్రభుత్వం కొనసాగించే ప్లానులతో పూర్తి సహకారం చేయాలి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తమ జీవితాన్ని చక్కబరచుకోడానికి సాగించే ఉద్యమాలన్నిటిలో ముందు నిలబడాలి.

(ఆ) జాతీయ విద్యా విధానంకోసం వయోజన విద్యావ్యాప్తికి ప్రభుత్వం మీద వత్తిడి తేవాలి, జాతీయ విద్యా పునర్నిర్మాణ కార్యక్రమంలో ప్రభుత్వంతో పూర్తి సహకారం చేయాలి.

(ఇ) ప్రతి పట్టణంలోనూ గ్రామంలోనూ యువకులకు ఆటపాటలకు అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం మీద వత్తిడితెచ్చి యువకుల శారీరక మానసిక పునర్నిర్మాణానికి పూర్తి కృషి చేయాలి,

3. ఇందుకు పై ప్రజా కార్యక్రమం మీద ఐక్య యువజనోద్యమాన్ని నిర్మించాలి. అన్ని అభివృద్ధికర రాజకీయాభిప్రాయాలు గల యువకులను రైతు కూలీ కార్మిక మధ్యతరగతి యువకులను విద్యార్థులను, హిందూ ముస్లిము యువకులను అందరినీ ఒకే విశాల వేదిక మీదికి తీసుకు రావాలి,

---

(10 వ పేజీ తరువాయి)

"కుర్రోళ్ళయితే యేం ? ఏం బాగా నాటకం ! పెద్దోళ్ళు అళ్ళముందర తిపికట్టె ! అసలాళ్ళ దోవేయేరు !"

ఈమాటలు యిప్పుడిప్పుడే అక్కడక్కడ మనకు వినిపిస్తున్నాయి. "పెద్దపేర్లు చూచి మోసపోతావంట్రా ? నాతోవస్తే కుర్రోళ్ళనాటకం చూసేవాడివి గందా ? నాటకమంటే నాటకమా ? చూస్తున్నంతసేపూ నేనుకూడా యాసం కట్టినట్టు. ఆళ్ళు నా సొదే చెప్తున్నట్టు ఉంటే!"

ప్రజాసామాన్యంలో ఈ మాటలు ఉద్భవించడమే నవ్యనాటక కళోపాసకులకు నీరాజనం.

జన్మ తరించింది

వి. వి. శేషాచార్యులు ★

నిద్ర తూగుతూంది. ఇప్పుడేమి ప్రొద్దుపోయిందిలే అని దగ్గర ఉన్న పత్రిక తిరగేస్తున్నా. అందులో నా దృష్టి "జమీందారు జన్మ" అనే శీర్షికపై పడింది. ఆ జమీందారు కుటుంబము అంటే ఎంతో గౌరవము. వారి తాతల కాలమునుండి గూడా వారిది పెద్ద జమీందారి. వారు ప్రభుత్వానికి 20 వేల రూపాయిలు పేష్కసు చెల్లించాల్సిఉంటే, యేదో పన్నుల రూపంగా లక్ష రూపాయలు వసూలుచేసి, పేష్కసుపోను కుటుంబము అంతా కోళ్ళతోను, కుక్కలతోను జల్సాగా పోతుండేది. అప్పటిలో మా సుఖం చూడలేక కొంతమంది, "జమీందారీ విధానం నశించాలని" "మేము అధికారంలోకొస్తే నాశనం చేస్తామ"ని ప్రచారం చేసేవారు.

"మంత్రాలకు మామిడికాయలు రాల్తాయా" అన్నట్లు వాళ్ళ అరుపులవల్ల జమీందారులకు ప్రమాదం లేదులే అనుకున్నాము. "పాటిమీద గంగానమ్మకు కూటిమీదనే ధ్యాస" అన్నట్లు యింకా శిస్తులు ఎలా పెంచుకుందామా అని ఆలోచిస్తున్నాము. ఇలా ఉండగా కొంత కాలానికి మా జమీందారీలను రద్దుచేస్తామన్న వాళ్ళే అధికారంలోకి వచ్చారు. రద్దు చేయాలని బిల్లును తయారుచేశారు. కొన్ని అవాంతరాలవల్ల, మా అదృష్టం బాగుండి, వాళ్లు తమ పదవులకు రాజీనామాయిచ్చారు. ఇంకేం, మాకు దోపిడీతనానికి మరికొంతకాలము వ్యవధి చిక్కింది. మరల కొంతకాలం బాగా దోచుకొని భాగ్యవంతులయినాము. కాని మళ్ళీ అధికారంలోకి వచ్చారు. అయితే ఈదఫా వాళ్ళూ మేము రాజీపడ్డాము. ఎన్నికలప్పుడు కాంగ్రెసుకు తోడ్పడ్డాము. అందువల్ల కాంగ్రెసు నాయకులు "వాళ్ళు మాత్రం బ్రతికేదెట్లాలే - జమీందారీ విధానం రద్దు చేసేటట్లయితే నష్టపరిహారం" యివ్వాలని ప్రకటనలు చేయడం మొదలుపెట్టారు. ఇలా ఉండగా మరల బయలుదేరారు కొంతమంది కుర్రకుంకలు, "కమ్యూనిస్టులట" "పిట్టకొంచెము కూత ఘనమ"న్నట్టు వీరిదెబ్బ మహా లావు దెబ్బగా ఉందిలే. ఎట్టి నష్టపరిహారం లేకుండా జమీందారీవిధానం రద్దు చేయాలన్నారు ? దేశద్రోహుల మన్నారు ? పంచమాంగదళమన్నారు ? ప్రజాద్రోహుల మన్నారు ? యెందుకులే. మమ్మలను మాట్లాడిన నీచపు మాటలు యింకెవరినీ అనలేదు. ప్రజాద్రోహులమని మామీద నాటకాలుకూడ వ్రాశారు.

అన్నిరాష్ట్రాలలో ప్రభుత్వాలుకూడా మాకే అనుకూలంగా ఉండుటచే నాటకాలమీద నిషేధం పెట్టించాము. ఇప్పుడు నష్టపరిహారం యివ్వనిదే మా జమీందారీలను రద్దుచేయటానికి మేము ఒప్పుకోలేదు. చివరకు బీహారురాష్ట్రంలో ప్రభుత్వం నూరుకోట్ల రూపాయిల నష్టపరిహారంతో రద్దుచేయడానికి నిశ్చయించింది. విన్నారా ! ఇట్లు "జమీందారు" అని వ్రాసియున్నది.

నాగుండె జలదరించింది. నష్టపరిహారమా ? ఎవరికి ? ఎందుకు ? ఎన్నాళ్ళనుండో ప్రజల రక్తాన్ని జలగల్లాగ పీల్చినవారిని, కాంగ్రెసు ప్రభుత్వాలైన ప్రజా ప్రభుత్వాలు ఉరితీయాలిసిందిపోయి, ప్రజలను పీల్చి పిప్పిచేసి నిలువు దోపిడీచేసే జమీందారుకు ఏంనష్టం కలిగింది ? పాపం ! పరిహారం యివ్వాల్సివచ్చింది. తెలిసిందా ? ప్రజా మంత్రివర్గాలు ప్రజా పీడకులైన జమీందారులకు ఎలా లొంగిపోతున్నాయో ! బీహారులో నష్టపరిహారం యివ్వడం, అంటే జమీందారులు మరల ఆ నష్టపరిహారపు ధనముతో ఫ్యాక్టరీలుకట్టి, కార్మికుల ప్రాణాలు తీయడానికి లైసెన్సు యిస్తున్నారన్నమాట కాంగ్రెసు మంత్రులు !

ఎంతకాలంనుండో రైతులను పీల్చి పిప్పి చేసిందికాక కార్మికులనుగూడా నాశనం చేయబోతున్నారు జమీందారులు. జమీందారుల "జన్మ తరించింది !"

ఉదయగుంగూరు [illegible] వ్రాతపత్రిక "బాలజ్యోతి" నుండి

లోకమాన్యుని సందేశం

వి. హనుమంతరావు

"స్వాతంత్ర్యము మన జన్మహక్కు. ఇది పరుల దయాధర్మ భిక్షముగాదు, దీని కొరకై మీరెట్టి త్యాగములు చేయవలసి వచ్చినను చేయకతప్పదు. ఇట్టి దృఢసంకల్పముతో మీరు పనిచేసినయెడల ముల్లోకములందును మీకడ్డము వచ్చునదేదియు లేదు" ఈ పవిత్ర సందేశం ఇచ్చింది ఎవరో తెలుసునా ?

అతడే బాలగంగాధర తిలక్. అయితే, ఆయననుగురించి మీరు చిన్నపుడు పుస్తకాలలో చదివే ఉంటారు. కాని ఆయన ఇచ్చిన పై సందేశం ఆ పాఠాలలో మీరు చదువుకొని ఉండరు. ఎందుచేత ? ఈ క్రింది విషయాలు చదివితే మీకు తెలుస్తుంది.

23-7-1857 న గొప్ప మహారాష్ట్ర వంశంలో పుట్టాడు. చదువులో అంగలు వేసుకొంటూ ముందుకు పోయాడు. 1879 వచ్చేసరికి బి. ఏ. ఎల్. ఎల్. బి. లో ఉత్తీర్ణుడయ్యాడు. కాలేజీ వదలి బయటకు వచ్చాడు.

ఉద్యోగం చెయ్యటమా లేక లాయరువృత్తి చేపట్టి ధనార్జన చేయటమా అన్న సమస్య అతన్ని ఎదుర్కొంది. కాని ఈ రెండూ కూడ అతనికి నచ్చలేదు. మొదటిది చేపట్టడమంటే తెల్లవాళ్ళ బానిసగా తయారవటం, రెండవ పంథా త్రొక్కితే మళ్ళా ఆ తెల్లవాళ్ళ దగ్గరే "Yes, Sir" అనో లేక 'Your honour, Sir' అంటూనో జీవితం గడపటం. తెల్లవా ళ్ళంటే ఆయనలో ఉన్న ఈ విపరీత ద్వేషమే, ఆయన పై రెండు మార్గాలు వదలిపెట్టి స్వచ్ఛంద దేశభక్తుడిగా తయారు కావటానిక్కారణ మయింది.

1880లో 'కేసరి', 'మరాఠా' అను పత్రికలను నెలకొల్పి, వాటిలో దేశ పరిస్థితులకు రాజకీయాలకు సంబంధించిన వ్యాసాలు వ్రాస్తూ ఉండేవాడు. ఈ పత్రికలను నడుపుతున్న దినాల్లోనే కొల్హాపూరు రాజును ఒక తెల్లదొర అవమానించగా, అతనిని తీవ్రంగా తన పత్రికలో విమర్శించినందుక్కు 100 దినములు కారాగార శిక్ష విధించింది ప్రభుత్వం.

1885 లో స్థాపింపబడిన కాంగ్రెసులో సభ్యుడుగా చేరాడు. దక్షిణ హిందూదేశ స్థాయి సంఘమునకు కార్యదర్శిగా పనిచేశాడు. బొంబాయి రాష్ట్ర శాసన నిర్మాణ సభలో ప్రజల పక్ష సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు.

తిరిగి 1897 లో ర్యాండు, ఐరిస్ట్ అను ఇద్దరు ఆంగ్లేయులను ఎవరో చంపితే ఈయన యొక్క ఉద్రేకపూరితమైన వ్రాతలే కారణమని 18 నెలలు శిక్ష విధించారు. బట్టతలకు, మోకాలికి ముడిపెటినట్టుంది ఈ సంగతి !

1905 లో లార్డ్ కర్జన్ అనే గవర్నరు జనరల్ బంగాళా భూమిని రెండుగా విభజించాడు. దీనితో భారతదేశంలో పెద్ద కలవరం పుట్టింది. దీనితో బహిష్కారణోద్యమం బయలుదేరింది. తిలక్ ఎంతో ఉద్రేకంతో దీనిని నడిపించాడు.

ఇట్లా తన జీవితంలో ప్రతి ఘట్టంలోను రాజకీయాలను విడనాడకుండా ప్రజలలో అదేపనిగా ప్రబోధం చేస్తూ, దేశభక్తిని రేకెత్తించాడు. ఆ రోజుల్లో ఈయన ఒక అతివాదిగా పరిగణింపబడేవాడు.

మరుసటి సంవత్సరం జరిగిన కాంగ్రెసు మహాసభలో స్వరాజ్యవినాదంయొక్క స్థాయిని కొంచెము తగ్గించాలని పట్టుబడుతున్న మితవాదుల కెదురుగానిలబడి పోరాడాడు, రాజ్యము చేయుటయననేమో తెల్లవారిదగ్గర నేర్చుకోవలెనని, మనమిప్పుడే స్వరాజ్యము పొందనర్హులముగామని చెప్పే మితవాదులవాదనలను తీవ్రముగా ఖండించాడు.

ఇట్లా మితవాదులయొక్క రాజీపాలసీకి వ్యతిరేకంగా తిలక్ చేస్తున్న ఆందోళనను చూచి బ్రిటిషువాళ్ళకు గంగవెర్రు లెత్తింది. ఎట్లాగో అతనిని అరెస్టు చేయటానికి విశ్వప్రయత్నాలు చేసి, ఆఖరుకు 1908 లో టెర్రరిస్టు ఉద్యమం సాగుతున్న రోజుల్లో, ప్రజలనుద్రేకపరచే వ్యాసాలు వ్రాస్తున్నాడనే నెపంతో అరెస్టు చేశారు.

1908 జూలై 13 వ తేదీని విచారణ ప్రారంభమయింది. తిలక్ తానే స్వయముగా విచారణ మొదలుపెట్టిననాటినుండి తన వాదన ప్రారంభించి 8 వ దినంనాటికి ముగించాడు. అయినప్పటికీ 6 సంవత్సరములు కఠిన శిక్ష తప్పలేదు.

ఈ సందర్భంలోనే భారతదేశంలో కార్మికులు తిలక్ అరెస్టును వ్యతిరేకంగా మొదటి రాజకీయ సమ్మెను జరిపారు.

1914 లో విడుదల అయిన తరువాత 17 వ రాష్ట్రీయసభలో "స్వరాజ్యం మన జన్మహక్కు" అనే నినాదం ఇచ్చాడు.

ఆతరువాత తిలక్ లండన్ వెళ్ళి అక్కడ కూడ ఇండియానుగురించి ప్రచారం సాగించాడు. అనేకమంది బ్రిటిష్ ప్రముఖులను, పార్లమెంటులోకి రానున్న కార్మికపక్షపు నాయకులను భారతీయ స్వరాజ్యానికి సుముఖులుగా చేశాడు.

ఇట్లా మాతృసేవ చేస్తూనే తన 63 వ ఏట మరణించాడు. ఆయన మరణించినా, ఆయన యొక్క "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే నినాదం ఈరోజుక్కూడా ప్రతివ్యక్తి చెవుల్లోనూ గింగురుమంటూఉంది.

ఆయన ఏ ఆదర్శంకోసం అయితే అహోరాత్రములు కృషిచేస్తూ మరణించాడో, ఆ ఆదర్శానికి దరిదాపుకు మనం చేరుకున్నాం. అదే ఆగస్టు 15 దినం.

కాని ఈ ఆగస్టు 15 కేవలం ఒక మజిలీ వంటిది మాత్రమే. మనకు ఇపుడు వచ్చిన పరిమితాధికారాలను అవకాశంగా తీసుకొని, సంపూర్ణ స్వాతంత్ర్యం పొందటానికి, ముఖ్యంగా యువకుల, విద్యార్థులపైన మహత్తర బాధ్యత ఉంది.

ఆ రోజుల్లో ఈ మితవాదుల చెప్పుచేతల్లోనే కాంగ్రెసు మహాసంస్థ ఉండేది. మన తిలక్ మహాశయుని వెనుకనున్న యువక బృందానికి ఎంత తక్కువ బలమున్నా, తన దృక్పథం సరియైనదనే నమ్మకంతోనే మితవాదులతో తీవ్ర పోరాటం సాగించాడు, ఆ రోజుల్లో ఉండేటటువంటి అతివాదుల కృషి ఫలితంగానే మనం ఇప్పటికైనా స్వరాజ్య పొలిమేరల్లోకి చేరుకున్నాం.


మిగతా 19 వ పేజీలో

లోకమాన్య



బాల గంగాధర్ తిలక్

విశ్వకవి



రవీంద్రనాధ టాగూర్

జయహో విశ్వకవీ!

జగ్గయ్య

అది 1941 ఆగస్టు 7 తేదీ: విశ్వకవి రవీంద్రుని అస్తమయదినం. దుర్నిరీక్ష్యమైన భారత ప్రతిభాజ్యోతిని ఖండఖండాంతరాల ప్రదర్శించి, జోహారులందుకొన్న ఒకానొక దివ్యమూర్తి, భౌతిక ప్రపంచాన్నుండి నిర్గమించినరోజు. స్వీయకవితా మాధుర్యంతో ఉదాత్తతాత్త్విక భావసంపత్తితో, ఆత్మ దేశంలో సాంస్కృతిక మహోదయం దీప్తం చేసి, భారతీయుల రక్తనాళాలలో నూతన చైతన్యం రగిల్చి, జాతీయ జీవితానికి రూపకల్పన చేయడమేగాక - సకల సభ్య ప్రపంచానికీ నూతన సాహితీమరందం రుచిజూపి ప్రాక్పశ్చిమప్రజా హృదయవీథుల్లో, మహోజ్జ్వలమైన ప్రేమ సందేశం గానంచేసి - అన్యదుర్లభమైన నోబిల్ బహుమానాన్ని ఆర్జించి తొలగిపోయాడు మన గురుదేవుడు.

బాల్యదశలో మానవ మేధస్సు అతికోమలంగానూ, వినిర్మలంగానూ ఉంటుంది. ఆ దశలో అందులో నాటుకునే భావాలూ ఏర్పడే అభిప్రాయాలూ, కలకాలం నిలిచి పోతాయి. కాబట్టే-ఒకవ్యక్తి ఉత్తమ పౌరుడుగా తయారు కావాలంటే, అది బాల్యంలో అవ్యక్తి కీయబడే శిక్షణ మీదా విద్యా బోధన మీదా ఆధారపడి ఉంటుంది, అందుకనే దేశ కళ్యాణానికి ఉత్తమమైన జాతీయ విద్యావిధానం పునాదిరాయి అని ఎలుగెత్తి చాటాడు విశ్వకవి

ప్రకృతికీ బాలుర మనస్తత్వానికీ ఎంతో సాన్నిహిత్యమున్నది. కోమలమైన శిశు హృదయం అడుగడుగునా ప్రకృతిభావానికిపులకాంకితమౌతూంటుంది దినదినమూ ప్రకృతిలో సంభవించే క్రొత్తక్రొత్త విషయాలను, పరిశీలించి అర్థం చేసుకోవాలని అభిలషిస్తుంది శిశుమేధ ఈదశలోవాళ్ళ ఆసక్తిని ఉచితరీతిలో స్వేచ్ఛగాప్రోత్సహించాలి; లేకపోతే మెదడు మొద్దుబారి పోతుంది. ఇది విద్యావిధానంలో ప్రాథమిక సూత్రం. అందుచేతనే, ప్రకృతి సహజమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధనజరగాలి. ఉదాహరణకు శాంతినికేతనంలో యిదేపద్ధతి అమలులో ఉంది ప్రతి రోజూ నియమితంగా ఒకేగంటలో ఒకేపారం బోధించే పద్ధతి పిల్లలను నిర్వీర్యం చేస్తుంది. ఈ విధంగా బలవంతంగా కూర్చోబెట్టి - ప్రతి రోజూ ఒకేవిషయం రుద్దిచెప్పడమూ - క్రమశిక్షణ అనే పేరుతో ఒకచోట బంధించడమూ- వీటివలన శిశుమేధస్సుయొక్క చైతన్యం చచ్చిపోతుంది. కాబట్టి పిల్లలు ఎప్పుడే విషయాన్ని గురించి ఆసక్తి కనబరుస్తారో, అప్పుడా విషయాన్ని బోధించడం (By activity) ఉత్తమ విధానం. అంతేకాదు. కేవలం కొన్నిపుస్తకాలను పఠనీయంగా నిర్ణయించి, వాటిని మాత్రమే పైనుంచి క్రిందకు బట్టీవెయ్యడం, పరీక్షలు ప్యాసుకావడం చూస్తూనే ఉన్నాం. కాని నిజమైన విద్యావిధానం భావోద్వేగాన్నీ, ఇంద్రియ వికసనాన్నీ వికసింపచేయడమే అప్పుడే నిజమైన చైతన్యం, వికాసం విజ్ఞానము సిద్ధిస్తాయి. విశ్వకవి స్థాపించిన "శాంతి నికేతనం"లో నిత్యమూ సాయంకాలం బాలబాలికలు - కేరింతలు కొడుతూ - తోటలచుట్టూ తిరుగుతూ, జాతీయ బృందగానం చేస్తూంటే-హృదయం పులకరిస్తుంది

భౌతిక,భావస్వాతంత్ర్యాలు రెండూ ఉత్తమ విద్యకు ప్రాతిపదికలు. స్వేచ్ఛా బోధనవలన, విద్యార్థులలో సాంఘిక సేవాబుద్ధి పునర్నిర్మాణ కృషి వృద్ధి చెందుతాయి. అంతేకాదు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన మాత్రాన్నే — మన సమస్యలు తీరిపోవు. ఆర్థిక, సాంఘిక, నైతికాంశాలు జీవితంలో రాజకీయాలనుండి విడదీయరానివి. అందుచేతనే స్వాతంత్ర్యాన్ని సాధించడమేగాక దాన్ని నిలుపుకోగలిగిన నిర్మాణాత్మకకృషినైతం సాగించడం అత్యంత వాంఛనీయం. ఇందుకు విద్యార్థుల మనసుల్లో సృజనశక్తి నుద్దీపింపజేసేచదువువారికిచెప్పాలి. ఈ అంశాలన్నింటినీ ఆచరించుకొని, ఏ వికసనశక్తినీ నిర్లక్ష్యం చేయనిదిగా ఉండేదే ఉత్తమ విద్యావిధానం.

ఈ ఉత్తమ విద్యాసంస్కరణలను 1901 లోనే రవీంద్రుడు ప్రతిపాదించాడు కాని ఆనాడు, అందరూ ఆయన్ను చూసి వెక్కిరించినవారే! అయినా, పట్టువిడువక, దీక్షతో కృషిసాగించి, విజయం సాధించాడు. ఈనాడు అభివృద్ధికాములైనవారందరూ వీటిని ప్రశంసిస్తున్నారు అనేక సంస్థల కాద మైన వీసంస్కరణలు,


మాతృభాషద్వారానే విద్యాబోధన జర లన్న ఉద్యమాన్ని నిర్మించిందికూడా రవీ ద్రుడే కళ్యాణ కాంక్షి! "అధికారపూరితమై ఆంగ్లవిద్యావాహినులనుండి భారతీయవిద్యార్థు చెంతకు ప్రవహించి వచ్చినది, ఉదాత్తమై సాహితీ సౌరభముకాదు. వారిని స్వీయ విజ్ఞ నమునుండి దూరము చేయగలిగిన తద్వ్య రేక భావగుచ్ఛము మాత్రమే"-అని ఆనా ఆయన ఆంగ్ల విద్యాప్రాబల్యాన్ని నిరసించాడు

"That the mother tongue is fo Students what mother's milk is fo infants, is what I then averred an now repeat" అని ఒకానొకచోట సింహగర్జనం చేశాడు

విద్యార్థుల్లో అంతర్జాతీయతత్వం అభివృద్ధి కావాలని టాగూర్ వాంఛించాడు కొన్ని దశాబ్దాలక్రితం ఆయనప్రతిపాదించిన ఉత్కృష్ట సంస్కరణలు, మన దేశంలో యీనాటికి అమలుజరగకపోవడం లజ్జాకరం. ప్రాక్పశ్చిమ దేశాలలో పర్యటించి - ఆ యా దేశాలలో, ముఖ్యంగా సోవియట్‌రష్యాలో విద్యాబోధనాన్ని సమగ్రంగా పరిశీలించి - తాను స్వయముగా స్థాపించిన అంతర్జాతీయ విద్యాసంస్థ "శాంతి నికేతనం"లో వాటినన్నింటినీ శుభ సమ్మేళనం చేశాడు.

ప్రపంచ విఖ్యాతి నార్జించు కొన్న పిదప కూడా మొత్తం నలభై ఏండ్లుగా టాగూర్ బడి పంతులు జీవితం గడిపాడు. కాని ఆనాటికీ ఈనాటికీ మన సమాజంలో బడి పంతులు స్థితి మారక పోవడం శోచనీయం. "Teachers should be the ideal comrades of those, whom they teach" అన్నది ఆయన ఆదర్శం. తన జీవితారంభంనుండీ విశ్వకవి ఏ సంస్కరణల కోసం శ్రమించాడో తన జీవితాంతం వరకూ ఏ సంస్కరణలను ప్రచారంచేసి, దేశ కళ్యాణాన్ని సుస్థాపించడానికి కృషిచేశాడో ఆ విద్యా సంస్కరణలను సర్వత్రా అమలు జరిపేందుకు దీక్షతో యత్నించడం భారతజాతి విధ్యుక్తధర్మం.

ప్రజాతంత్ర ఆందో



రాజ్యాంగసభ ఏర్పడ్డ తర్వాత ప్రధమ పర్యాయం సర్వస్వతంత్రం గల్గిన సభగా జూలై 14 వ తేదీన సమావేశమయింది. సామ్రాజ్యవాదులు భారత రాజ్యాంగసభను ఏర్పరచిననాడు, రాజ్యాంగసభయొక్క అధికారాన్ని సంక్షిప్తపర్చు అనేక అడ్డంకులు ఏర్పరచారు. కాని మన జాతీయోద్యమం సామ్రాజ్యవాదులు పెట్టిన అనేక అడ్డంకులను దాటి ముందుకు సాగింది. దీని ఫలితమే మౌంటుబాటన్ ప్రణాళిక, పార్లమెంటులో అంగీకరింపబడిన ఇండియా స్వతంత్రచట్టం.

నేడు సమావేశమవుతున్న రాజ్యాంగసభ స్వతంత్ర భారతదేశానికి నూతన రాజ్యాంగాన్ని తయారుచేయవలసియుంది. సంవత్సరముల తరబడి సామ్రాజ్యవాద యినుప సంకెళ్ళక్రింద 1935 చట్టంక్రింద పరిపాలింపబడిన భారత ప్రజానీకం నేటి రాజ్యాంగసభ స్వతంత్ర భారతదేశానికి వన్నెతెచ్చే స్వతంత్ర రాజ్యాంగాన్ని తయారు జేస్తుందని ఆశిస్తున్నారు. అందుచే ప్రతివర్గంవారు నేటి రాజ్యాంగసభ చర్చల ఎడ ఆశతో ఎదురు జూస్తున్నారు.

సామ్రాజ్యవాద కుట్రలు

సామ్రాజ్యవాదులు మన జాతీయోద్యమ శక్తికి తట్టుకోలేక భారతదేశానికి 'స్వతంత్రం' యిచ్చామని ప్రకటించారు, కాని భారతదేశాన్ని బ్రిటిష్‌కామన్‌వెల్తులో భాగంగా ఉంచుటకు, మన దేశ ఆర్థికసంపత్తిని తమ చెప్పుచేతల్లో ఉంచుకొనుటకు శక్తికొలది కృషిచేస్తున్నారు అట్లే రాజ్యాంగ నిర్మాణవిషయంలోగూడ సామ్రాజ్యవాదులు తమ ఏజంట్లయిన సంస్థాన ప్రతినిధులద్వారా భారతదేశ భవిష్యత్‌రాజ్యాంగంలో ప్రజాస్వామ్యసూత్రాలు ఆచరించకుండా యుండునట్లు నానాప్రయాసలు పడుతున్నారు

రాజ్యాంగసభలో చేరిన స్వదేశసంస్థాన ప్రతినిధులద్వారా సామ్రాజ్యవాదులు యీ కార్యక్రమం నెరవేర్చ జూస్తున్నారు. రాజ్యాంగ నిర్మాణములో తమకు పూర్తిగా అనువయిన షరతులను జాతీయనాయకత్వంచే ఒప్పించుటకు ఒత్తిడితెచ్చుటకు వీలుగా మరికొన్ని సంస్థానాలను 'స్వతంత్రులుగా' ప్రకటించునట్లు చేశారు. ఇండియన్ యూనియన్ సామ్రాజ్యవాదులయొక్క యీ కోర్కెలకు లొంగి అంగీకరించినప్పుడే యీ 'స్వతంత్ర' సంస్థానాలను భారత రాజ్యాంగ సభలో జేరమని సలహా యివ్వాలనీ, లేకున్న భారతదేశఐక్యతను మరీ విచ్ఛిన్నపర్చి తమ ఆర్థిక దోపిడిని కొనసాగించుకొనుటకు సైనికకేంద్రాలుగా యీ సంస్థానాలను ఉపయోగించుకొనాలనీ సామ్రాజ్యవాదులు కుతంత్రాలు పన్నుతున్నారు.

యువకులం, విద్యార్థులం నేటి రాజ్యాంగ నిర్మాణంలో మన పాత్రను మనం నిర్వర్తించవలసియుంది. నేడు మనం మన కర్తవ్యమును నిర్వహించనిచో సామ్రాజ్య వాదులు మన జాతీయోద్యమ బలహీనతలను, సర్దార్ పటేల్ వంటి నియంతృత్వ వాదులకున్న పలుకుబడిని ఉపయోగించి స్వతంత్ర రాజ్యాంగానికి బదులు ఒక ఉక్కుచట్రాన్ని తయారుజేయుటలో సఫలీకృతు లవుతారు భవిష్యత్ పౌరుల మయిన మనం అనేక కష్టనష్టములకు గురి కావలసియుంది. ఇప్పటి కప్పుడే రాజ్యాంగ సభలో తీసికొనిన కొన్ని నిర్ణయాలను జూస్తే యువకులకు తీరని అన్యాయం జరిగిందని చెప్పక తప్పదు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

వయోజన వోటింగు హక్కు

మొన్నటి రాజ్యాంగ సభ సమావేశంలో ఎన్నికలలో వయోజన వోటింగు హక్కు సూత్రం అంగీకరింప బడింది. 21 సంవత్సరములు నిండిన ప్రతి భారతీయునకు ఎన్నికలలో పాల్గొనే హక్కు అంగీకరించ బడింది, నూటికి 7 గురికి గూడ వోటింగు హక్కు లేని నేటి ఎన్నికలతో పోల్చిచూస్తే ఇది పెద్ద ముందడుగే. ఎన్నో సంవత్సరములనుండి కాంగ్రెస్ సంస్థ 18 సంవత్సరములు నిండిన భారతీయులకందరకు ఎన్నికలలో పాల్గొనే అవకాశం ఉండాలని ఆందోళన జేస్తూ వచ్చింది. వ్యక్తి యొక్క సగటు జీవితం 27 సంవత్సరములుగలభారత దేశంలో 21సం. లను వోటింగుకు కనీస అర్హతక్రింద నిర్ణయించుట అన్యాయం ఆసియా సోషలిస్టు రిపబ్లికులలోను విముక్తి పొందిన చైనా రాష్ట్రాలలోగూడ వోటింగు అర్హత 18 సం. లుగా నిర్ణయింప బడింది. ఇదే పద్ధతి యుద్ధానంతరం ఏర్పడిన వీట్ - నాం, ఇండోనీషియా రిపబ్లిక్కులలో ఆచరింపబడుతూంది భారత జాతీయ నాయకత్వం రాజ్యాంగ సభలోవుండి 21 సం. లను వోటింగుకు కనీస అర్హతగా నిర్ణయించుట విచారకరం. ఈ నిర్ణయంవలన 18 సం. లు

బల్గేరియా రిపబ్లిక్

పునర్నిర్మాణంలో విద్యార్థుల కృషి

ఎ. కె. ఆర్. బి. కోటేశ్వరరావు

పశ్చిమ యూరప్ దేశాలన్నిటి నాక్రమించుకుని 1941 ఫిబ్రవరిలో ఫాసిస్టు హిట్లరు బల్గేరియా మీద విరుచుకు పడ్డాడు. దేశాన్ని నానా భీభత్సం చేశాడు. ఎటుచూచినా నాజీ నిరంకుశత్వం తాండవించింది ఆర్థిక సంక్షోభం బయలుదేరి ప్రజలకు తిండి, బట్ట కరువై పోయినవి, విద్య సంస్కృతిధ్వంసంచేయబడ్డాయి అసమాన ధైర్యసాహసాలతో పోరాడి బల్గేరియా ప్రజలు మాతృభూమి నుండి ఫాసిస్టు మూకల్ని పారద్రోలారు. స్వతంత్ర బల్గేరియా రిపబ్లికను నిర్మించు కున్నారు. ఫాసిస్టు తొత్తు ప్రభుత్వాల నూడబీకి స్వతంత్ర రాజ్యాలైన బల్గేరియావంటి రిపబ్లికలను చూచే బెవిన్, ట్రూమన్‌లవంటి సామ్రాజ్య వాదులు యూరప్‌లో "అరాజకం" యేర్పడిందని, "కమ్యూనిస్టు పెనుభూతం" వ్యాపించుతోందని వాపోవుతున్నారు.

విద్యార్థి సంఘ కృషి

తమ మాతృదేశ విముక్తిలో వీరోచిత పాత్ర నెరవేర్చిన బల్గేరియా విద్యార్థులు యువజనులు నేడు సౌఖ్యప్రదమైన జీవితం కొరకు దేశాన్ని పునర్నిర్మించు తున్నారు. అభివృద్ధి నిరోధకుల పాలనలో అణచబడిన వారు నేడు అవిద్యను ఆర్థిక సంక్షోభాన్ని రూపుమాపి ఉజ్వల భవిష్యత్తును నిర్మించు కుంటున్నారు. స్వతంత్ర రిపబ్లిక్‌లో ప్రజా స్వామ్యం వైపు పురోగమించుకున్నారు. విద్య దేశాభ్యుదయానికి వెన్నెముకవంటిది. బల్గేరియా విద్యార్థి సంఘం "ఇమూస్"దేశంలోని విద్యను అవిద్యార్థులలోని దురలవాట్లను రూపుమాప పూనుకుంది. ఒక క్రమ పద్ధతి ప్రకారం చదవక పోవడం యిష్టమొచ్చినట్లు క్లాసులు యెగ్గొట్టడం కాపీకొట్టి మార్కులు సంపాదించడం మొదలైన విద్యార్థులలో ఉండే దురలవాట్లను పోగొట్టి వారిని సక్రమ పద్ధతులలో పెట్టుటకై విద్యార్థి సంఘం కృషిచేసింది కొద్ది కాలంలోనే అద్భుత ఫలితాలు సాధించ బడ్డాయి. విద్యార్థులలో యిదివరకున్న దురలవాట్లు తగ్గి, సక్రమ పద్ధతుల నవలంబింప మొదలుపెటారు. తక్కువ మార్కులు వచ్చేవారికి ఉపాధ్యాయులు మేధావంతులైన విద్యార్థులు యెక్కువ కాలం బోధ చేసేవారు. అందువల్ల తక్కువ మార్కులు వచ్చే విద్యార్థుల సంఖ్య చాలవరకు తగ్గింది. గత మార్చి నెలలో బల్గేరియా జాతీయ నాయకుడైన జార్జి డిమిట్రాఫ్ అధ్యక్షతను జరిగిన రెండవ విద్యార్థి మహాసభలో మంచిమార్కులు తెచ్చుకున్నందుకుగాను 1075 మంది విద్యార్థులకు పైగా బహూకరింప బడ్డారంటే విద్యార్థి సంఘం యెలాంటి విజయాలు సాధించ గలిగిందో ఆలోచించవచ్చు "ఇమూస్" బీద విద్యార్థులకు ఆర్థిక సహాయం కూడ చేస్తున్నది. వారికి ఉచిత భోజనశాలల నేర్పాటు చేసింది స్కూళ్ళు తెరచిన మొదటి టరములోనే 245 ఉచిత భోజన శాలల్లో 22 వేలమందికి పైగా సౌకర్యం పొందారు.



విద్యయెడ నూతన దృక్పథం

నూతనంగా స్థాపించబడిన బల్గేరియా "రిపబ్లిక్"కు ఆధునికపద్ధతులలో ఆరితేరిన విద్యావంతులు శాస్త్రజ్ఞులు, వృత్తి విద్యలలో నిపుణులైనవారు కావాలి అందుకుగాను విద్యయెడ విద్యార్థులలో నూతన దృక్పథం యేర్పరచాలి. బల్గేరియా విద్యార్థిసంఘం విద్యయెడ ముఖ్యంగా సైన్సుయెడ విద్యార్థులలో నూతన దృక్పధాన్ని యేర్పరచ పూనుకుంది దీని ఫలితంగా విద్యార్థులలో సబ్జక్టు అంటే అభిరుచి మంచి మార్కులు తెచ్చుకోవాలనే పట్టుదలే గాక, తమ విజ్ఞానంతో దేశాభ్యుదయానికి తోడ్పడాలనే దీక్ష యెక్కువయింది విద్యార్థి సంఘ కార్యక్రమమెంత ఉత్తమమైనదో రోజురోజుకూ పెరుగుతున్న విద్యార్థిసంఘం (ఇమూస్) బలమే ఋజువు చేస్తున్నది. మార్చి మహాసభనాటికే "సంఘ సభ్యత్వం" 1 లక్ష 80 వేలకు పెరిగింది నూటికి 95 మంది "ఇమూస్"లో చేశారు. అది ఒకపెద్ద ప్రజా సంఘంగా మారిపోతున్నది.

దేశ పునర్నిర్మాణం

విద్యార్థిసంఘకృషి కేవలం విద్యార్థులను మంచి విద్యార్థులుగ తయారుచేయడంతో

అంతం కాలేదు. తమ మేధాశక్తిని, విజ్ఞానాన్నిసంస్కృతినీ అభివృద్ధిచేసుకోప్రయత్నిం, చడమేగాక విద్యార్థులు దేశంలోని తదితర కార్మిక, కర్షక యువజనులతో కలసి నూతన రిపబ్లిక్ పునర్నిర్మాణానికి తోడ్పడాలన్న డిమిట్రాఫ్ సందేశాన్నక్షరాలా అమలుపెట్ట పూనుకున్నారు. వచ్చే వేసవిలో బల్గేరియా పునర్నిర్మాణానికై విద్యార్థులు, యువజనులు 5 స్కీములు వేసుకున్నారు "కోప్రింకాడాము, వాలోయక్ - పెరిక్ రైల్వే, ప్లోవ్‌డివ్ - సోయాఫి ఎలెక్ట్రిక్ లైను నిర్మాణము యీ స్కీములో ముఖ్యమైనవి. ఈ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో 60 వేలమంది పాల్గొంటున్నారు వీరిలో 30 వేలకు పైగా హైస్కూలువిద్యార్థులే పాల్గొంటారు. విద్యార్థి మహాసభకువచ్చిన ప్రతినిధులంతా పునర్నిర్మాణ దళాల్లో (Brigades) చేరారంటే మాతృదేశ పునర్నిర్మాణంయెడల బల్గేరియా విద్యార్థు లెంత వుత్సాహం చూపుతున్నారో అర్థంచేసుకోవచ్చు విద్యలో అభివృద్ధి చూపితేనే విద్యార్థి తన కర్తవ్యాన్ని నెరవేర్చిన వాడవుతాడు అందువల్లనే విద్యార్థిసంఘం చదువులో వెనకబడ్డ విద్యార్థులను పునర్నిర్మాణ దళాల్లో చేర్చుకో నిరాకరించింది. తన దేశభక్తిని ఋజువు చేసుకోదలచిన ప్రతి విద్యార్థీ దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనాలని అభిలషిస్తాడు. అందుకుగాను విద్యలోకూడ తప్పక అభివృద్ధి చూపించుతాడు. అటు విద్యార్థిగా విద్యాభివృద్ధికీ, యిటు దేశభక్తుడుగా దేశ పునర్నిర్మాణానికీ, తద్వారా ఉజ్వలభవిష్యత్తుకూ విద్యార్థి పునాదులు నిర్మించుతాడు విద్యార్థిసంఘ ఆదర్శ కృషి ఫలితం ఇదే.

అంతులేని ఉత్సాహం - అపూర్వమైన పునర్నిర్మాణం

పునర్నిర్మాణ కార్యక్రమంలో అంతులేని ఉత్సాహంతో లక్షలకొలదిగ విద్యార్థులు, యువజనులు. తదితర ప్రజలు, పాల్గొంటున్నారు. ప్రతి ఆదివారమూ పల్లెలలోని రైతులకు పునర్నిర్మాణములో తోడ్పడడానికై వేలకొలది పునర్నిర్మాణ దళాలు, వాటితోపాటు వైజ్ఞానిక దళాలు పట్టణాలనుండి గ్రామాలకు వెళుతున్నవి గత సంవత్సరం జనవరినుండి జూన్‌వరకు అంటే 6 నెలల్లోను యిలాంటి దళాలు 8565 పట్టణాలనుండి పల్లెలకు వెళ్ళాయి. వీరిలో హైస్కూలు విద్యార్థులు, యువజనులు అధిక సంఖ్యాకులు ప్రభుత్వ లెక్కల ప్రకారం వీరు 347, 654, 126 లేవాల (బల్గేరియా నాణెము) విలువగల పని చేశారని తేలింది ఈ దళాలు నిర్మించిన మార్గాలు దేశానికి ఆర్థికంగా ఎంతో తోడ్పడుతున్నాయి ఈ విధంగా బల్గేరియా విద్యార్థులు తదితర యువజనులు అంతులేని ఉత్సాహంతో తమ స్వతంత్ర రిపబ్లిక్‌ను పునర్నిర్మించుకుంటున్నారు। ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలనే దీక్షతో బల్గేరియా యువజనులు ముందుకు సాగిపోతున్నారు.

★

కృతజ్ఞత

'నవయుగ' క్రితం సంచికలోను యీ సంచికలోను ముద్రించిన శీర్షిక బ్లాకులు యువ చిత్రకారులైన శ్రీవల్లం నరసింహారావుగారు తిరువూరు, (కృష్ణాజిల్లా) వ్రాసి పంపారు. వారి కృషికి మా అభివందనలు

— సంపాదకుడు

★

'హిగ్గింబాతమ్స్'లో 'నవయుగ'

'నవయుగ', ఆగస్టు సంచికనుండి యీ క్రింద రైల్వేస్టేషన్సులో 'హిగ్గింబాతమ్స్'లో అమ్మబడును.

ఆదోని	గూటి	సామర్లకోట
బళ్లారి	గుంతకల్లు	తెనాలి
బెజవాడ	గుంటూరు	తిరుపతి
కడప	నెల్లూరు	నిడదవోలు
ఏలూరు	ఒంగోలు	రాయచూర్
గోదావరి	గుడివాడ	రాజమండ్రి

★

చందాదారులకు

అనేకమంది చందా డబ్బును మేనేజరుపేర మనిఆర్డరు పంపుటకు బదులు-పోష్టలు ఖర్చు తగ్గుతుందని వ్యక్తుల ద్వారా ఆఫీసుకు పంపుతున్నారు. ఇందుచే చందాదారుల డబ్బు సకాలంలో ఆఫీసుకు చేరుటలేదు. అందుచే స్థానిక కార్యకర్తలు వసూలు జేయు చందాల డబ్బు మనిఆర్డరు ద్వారా నేరుగా 'నవయుగ' మేనేజరుకు పంపగోరుతాం. ఈపద్ధతి, చందాదారులకు పత్రిక సకాలంలో అందుటకు చాల అవసరం.

— మేనేజరు 'నవయుగ'

విద్యార్థులకు తలిదండ్రుల అండ

ఐక్య విద్యార్థి సమావేశంలో తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుని అభిభాషణ

★

జులై 14 వ రాష్ట్రవిద్యార్థి కాంగ్రెస్, విద్యార్థి ఫెడరేషన్ ఇచ్చిన పిలుపునందుకొని ఐక్యాభిలాషులైన తిరువూరు విద్యార్థి కాంగ్రెస్, ఫెడరేషన్ వర్కర్లు సంయుక్త అధ్వర్యాన అద్మిషన్ల, జీతాల సమస్యలమీద బహిరంగసభ జరిపారు. 10 వ నెల జీతం తగ్గించాలి, బందరు ప్రిన్సుపాలను తొలగించాలి. మొదలగు నినాదాలతో ఐక్య విద్యార్థి ఊరేగింపు జరిపి వూరంతా బహిరంగ సభనుగూర్చి ప్రచారం చేశారు

సాయకాలం 5 గంటలకు కొదమసింహ్వం రంగాచార్యులుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగినది స్థానిక విద్యార్థి ఫెడరేషన్ నాయకులు శ్రీకొల్లా నరసింహారావు విద్యార్థిఐక్యతావశ్యకతనుగూర్చి, విద్యార్థుల నెదుర్కొంటున్న తీవ్ర సమస్యలనుగూర్చి ఉపన్యసించారు పిదప తాలూకా కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు శ్రీ పేట రామారావు సామ్రాజ్యవాదులు మన విద్యాభివృద్ధిని ఎలా అరికట్టినదీ వివరిస్తూ, ప్రస్తుత ప్రజా మంత్రివర్గ హయాంలో రైతులకు జరుగుతూన్న అన్యాయాలను గూర్చి చెప్పి, సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాల అవసరాన్ని నొక్కి చెప్పారు తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ మరుకుంట్ల అప్పయ్యగారు ప్రభుత్వ అశ్రద్ధను, అసమర్థతను విమర్శిస్తూ విద్యార్థులు చేసే ఆందోళనకు తలిదండ్రులంతా అండగా ఉండాలని కోరారు. జీతాలను పెంచి, ఆర్థికంగా అవస్తలపాలు చేయడం అన్యాయమనిచెప్పి అధ్యక్షులు సభను ముగించారు.

10 వ నెలజీతం తగ్గించాలని, బందరు ప్రిన్సిపాలును తొలగించాలని, వడపోత విధానం రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడింది.

ఆంధ్రుల అభిమాన జాతీయ క్రీడ

వేములపల్లి వెంకటదాసు

అనాదినుండి ఆంధ్రులకు ఆటలంటే ఎక్కువ అభిలాష. ఆ అభిలాషతోనేవారు వెన్నెలరాత్రులందు, తీరిక సమయాలలో చెడుగుడు, ఉప్పుచెర్రు, కొక్కొ మొదలయిన జాతీయ ఆటలను, అతి చాకచక్యంగా, పట్టుదలతో పల్లె ప్రాంతాలలో ప్రదర్శించి ఆనందించేవారు యువకులు ఉత్సాహంతో ఆడుతుంటే, చూచే వృద్ధులు తమలో ఉబికివస్తున్న ఉద్రేకాన్ని ఆపుకోలేక పాల్గొనేవారు తమ ప్రాచీన ఔన్నత్యాన్ని చూచి మురుసుకునేవారు. వివిధ గ్రామాలమధ్య గ్రామంలోనే కోవలకు మధ్య, ఉత్తర దక్షిణ ప్రక్కలకుమధ్య ఇంటి పేరలమధ్య పోటీలు జరుగుతుండేవి చివరకు అత్తవారింటి అల్లుళ్లమధ్య కూడ పోటీలే। పై పోటీలన్నీ ఆంధ్రులకు తమ జాతీయ ఆటలంటే ఎంత అభిమానముందో ఋజువు చేస్తాయి. అందుచేతనే పూర్వకవులు వీరత్వాన్ని వర్ణించేటప్పుడు, ఆటలను తీసుకొని వర్ణించారు చెడుగుడులో వచ్చే "కవ్వించు" శబ్దం ఆ వర్ణనలోనిదే.

ఆంధ్రుల అభిమాన జాతీయ ఆటలలో చెడుగుడు తర్వాత "ఉప్పుచెర్రు" ప్రాముఖ్యత వహించింది. ఉప్పుచెర్రును వేర్వేరు ప్రాంతాలలో "ఉప్పుపట్టి, ఉప్పుచెర్రు, చెరపట్టి" అనే పేర్లతో పిలుస్తారు. ఆడే విధానంకూడ వివిధ ప్రాంతాల పద్ధతులలో తేడా ఉంది. పై పద్ధతులన్నింటినీ సమన్వయపర్చి, అందరికీ అందుబాటులో ఉండే నూతనపద్ధతిని ప్రవేశపెట్టాలి. ఆంధ్రుల జాతీయజీవనంలో ఒక ప్రముఖ పాత్ర వహించిన ఉప్పుచెర్రును, మరుగుపడి పోకుండా శాస్త్రీయ పద్ధతులపై ముందుకు తీసుకురావాలి

చెడుగుడు - ఉప్పుచెర్రులకు తేడా

(అ) చెడుగుడు టీములోని అందరు ఆటగాండ్రు అన్ని రకాలైన నేర్పరితనం లేక పోయినా ఇబ్బందిలేదు అంటే టీములోఉన్న అందరు ఆటగాండ్రు పట్టుకునేవారై ఉండక పోయినా లేక అందరూకూతకువెళ్ళి పాయింట్లు తెచ్చేవారు కాకపోయినా టీము గెలుపొందే అవకాశముంటుంది. సాధారణంగా కోపులందు కాచేవారు పట్టుకునేవారై ఉంటారు. బాగా పట్టుకోలేనివారు మధ్య ఉంటారు.


చెర్రుజట్టులోని అందరు ఆటగాండ్రు సరి సమాన నిపుణత్వం, చాకచక్యం కలిగిఉండాలి. అదే సమయంలో సమిష్టితత్వంకూడ ఉండాలి

(ఆ) ఒక జట్టులోని మనిషి కూతకు వెళ్ళినప్పుడు కూత అయిపోయేవరకు, కూతగాని జట్టు నిలబడి చూస్తూ ఉంటుంది.

చెర్రు మొదలుపెట్టినప్పటినుండి ఆపేవరకు ఇరుజట్టులోని అందరు ఆటగాండ్రు ఎంతో మెలకువగాను, అప్రమత్తతతోనూ మెలగాలి.

ఉప్పుచెర్రు

చెర్రుకోర్టు
జట్టుకు 6గురు



ఏ ఆటగాడైనా ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అతనివల్ల మొత్తం జట్టంతా నష్టపడుతుంది.

(ఇ) చెడుగుడులో పరుగుకు పెద్ద అవకాశం లేదు. చెర్రులో పరుగెత్తడం బాగా అభ్యాసమౌతుంది

(ఈ) చెడుగుడులో ఎంత శాస్త్రోక్తమైన పద్ధతులను ప్రవేశపెట్టినా, ఎంతో నిపుణతను ప్రదర్శించినా చిన్న చిన్న దెబ్బలు తగులక మానవు

చెర్రులో దెబ్బలు తగలవలసిన అవసరం, అవకాశం లేనేలేదు.

(ఉ) చెడుగుడుకు ఎక్కువ స్థలం అక్కర లేదు. ఇసుక కావాలి

చెర్రుకు స్థలం ఎక్కువ కావాలి. రిఫరీలు కూడ ఎక్కువమంది కావాలి.

చెడుగుడును నిరుత్సాహపరచడానికి ఇలా వ్రాసానని పాఠకులు, ప్రత్యేకంగా చెడుగుడు ఆడే పాఠకులు భావించకుందురుగాక। రెంటికీ ఉన్న తేడాలను శాస్త్రీయ దృక్పథంతో విమర్శన చేయడమే నాప్రధాన ఉద్దేశం।

చెర్రు ఉపయోగము

చెడుగుడువలెనే చెర్రు ఆడడంలోకూడ శరీరమంతా కదలి, తగినంత పరిశ్రమచేత అన్ని అవయవాలు సరిసమానంగా ఎదుగుతాయి, యువకులు శారీరకంగా ఎంతో అభివృద్ధి చెందడానికి చక్కటి అవకాశం వుంది. ఎత్తుకు పైఎత్తు వేయడం ఈ ఆటలో చాల అవసరం దీనివలన మానసికాభివృద్ధి పెంపొందడమేగాక, మందకొడితనం పోయి, చురుకుదనం అలవడుతుంది. చెర్రు ఆడడంవల్ల ప్రతి అవయవమూ పటుత్వంకలిగి ఉండడమేగాక, ఉత్సాహంకూడ ఎక్కువవుతుంది. ఉస్సురుమియా తనం పోతుంది.

ఆడే విధానం

కోర్టుకొలతలు పొడవు 71 అడుగులు, వెడల్పు 27 అడుగులు ఉండాలి, ఈ హద్దుల చుట్టూ 2 అంగుళముల వెడల్పుగల హద్దు గీతను గీయాలి కోర్టువెడల్పులో చెరిసగముగా పొడవునా ఒకగీత గీయాలి. దీనిని "కొలుబద్ది" అంటారు, కొలుబద్దను 5 భాగాలుగా విభజించు

6 బద్దిలను హద్దుగీతకు అంటునట్లు గియాలి. అనగా బద్ది బద్దికి మధ్య 13 అడుగుల దూరము ఉండాలి మధ్యగీయబడు బద్దులన్నీ 1 అడుగు వెడల్పు ఉండాలి ప్రతిఆటకు 6 గురు ఆటగాండ్రుగల రెండుజట్లుండాలి ఒకజట్టు కాచుకొనువారు (Defenders) గాను, రెండవ జట్టు పరుగెత్తువారు (Assailants) గాను ఉండాలి ఆట ఉద్దేశం ఎక్కువచెర్రులతో ఎదుటి జట్టును ఓడించుటే.

యువకుల కర్తవ్యం

ఆంధ్ర ప్రజా జీవితంలో అనాదినుంచీ ఒక భాగంగా ఉంటూ వచ్చిన చెడుగుడును అభివృద్ధి పర్చినట్లే చెర్రనుకూడ వృద్ధిలోకి తీసుకు రావలసిన బాధ్యత అన్ని స్థానిక యువజన సంఘాలపైనా ఉంది. మన ప్రాచీన ఆటలద్వారా పూర్తి శారీరకాభివృద్ధిని కూడ పొందగలమనే కాంక్షను ఉత్పన్న మయ్యేటట్లు చేయాలి ఇందుకు యువకులందరూ నడుముకట్టాలి. మన పూర్వపు ఆటల ఔన్నత్యాన్ని ముందకు తీసుకు రావడంలో యువజన కాంగ్రెస్, యువజన సంఘం ఐక్యంగా పని చేయాలని కోరుచున్నాను

విద్యార్థుల కర్తవ్యం

ఆంగ్లవిద్యగరిపే హైస్కూళ్లను కాలేజీలను, స్థాపించడంతో ప్రాచీన కాలపు ఆటలు పోయి, ఆంగ్ల ఆటలైన పుట్-బాల్, వాలీ-బాల్, బాడ్మింటన్ మొదలైన ఆటలు వచ్చాయి వీటివల్ల మన ప్రాచీన ఆటలు మరుగుపడి పోతున్నాయి ఆంగ్ల ఆటలతో పాటు మన ప్రాచీన ఆటలను కూడ ముందుకుతీసుకు రావలసిన బాధ్యత విద్యార్థులపై ఎక్కువగా ఉంది ఇటీవల విద్యార్థులు కూడ చెడుగుడును ఆడుటచేత గ్రిగ్‌స్పోర్ట్సులో ఆంగ్ల ఆటలతో పాటు చెడుగుడునుకూడ పెట్టక తప్పలేదు అదేవిధంగా చెర్రనుకూడ గ్రిగ్‌స్పోర్ట్సులో చేర్చి ముందుకు తీసుకు రావడానికై ఆందోళనచేయవలసిందిగా అన్ని విద్యార్థి సంఘాలను కోరుచున్నాను. మన ప్రాచీన ఆటల ఔన్నత్యాన్ని యథాస్థానంలోకి తీసుకు రావడంలో విద్యార్థి కాంగ్రెస్, విద్యార్థిసంఘం అనే భేదంలేకుండా, అందరూ ఐకమత్యంగా పని చేయాలని కోరుతున్నాను

ప్రభుత్వ బాధ్యత

కాంగ్రెసు మంత్రివర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మనప్రాచీన ఆటలను ఉద్ధరించి ఆంధ్రుల పూర్వపు ఔన్నత్యాన్ని యథాస్థానంలోకి తీసుకు రావాలి

['ఉప్పు చెర్రను'గూర్చి మీకు యింకా వివరాలు కావలెనన్న కృష్ణాజిల్లా యువజనసంఘం ప్రచురించిన "ఆటల నిబంధనలను" చదవండి]

★ సంపాదకీయం

అంగ్‌సాన్ ప్రభృతులకు మా జోహారులు

●

అంగ్‌సాన్ మొదలైన 7 గురు బర్మా మంత్రుల దారుణ హత్యా వార్త పిడుగులాగా వచ్చింది. బర్మా స్వాతంత్ర్యోద్యమానికి జీవగర్ర అంగ్‌సాన్. అట్టి మహావ్యక్తి మనలను వీడిపోయాడు,

అంగ్‌సాన్ విద్యార్థి దశలోనే తన మాతృదేశం యెడల తనకున్న పవిత్ర బాధ్యత తను గుర్తించాడు అందువల్లనే విద్యార్థి సంఘాలలో పనిచేస్తూ తద్వారా బర్మా దాస్య శృంఖలాల విచ్ఛేదనకోంస కంకణం కట్టాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాడాడు క్రూర జపాన్‌తో జీవన్మరణ పోరాటాన్ని సాగించాడు బలీయమైన జాతీయోద్యమాన్ని నిర్మించాడు. బర్మా ప్రజకు నాయకుడుగా నిలబడ్డాడు బర్మా తాత్కాలిక ప్రభుత్వానికి ఉపాధ్యక్షుడుగా, రాజ్యాంగ పరిషత్తుకు అధ్యక్షుడుగా వుంటూ స్వాతంత్ర్య ప్రకటన గావించాడు

ఇది సహించలేని కొంతమంది స్వార్థపరులు బ్రిటిషు సామ్రాజ్యవాదుల సాయంతో, అంగ్‌సాన్ మొదలగు7గురు బర్మా మంత్రులను పొట్టబెట్టుకున్నారు ఇటువంటి రాజకీయ హత్యలు ఉప్పొంగే ఉద్యమాలను ఆపలేవు పైగా ఉద్యమాలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు పోతాయి ఇదే చరిత్ర నేర్పే గుణపాఠం విద్యార్థి, యువకులు ఎక్కడున్నా సరే యిటువంటి రాజకీయ హత్యలకు వ్యతిరేకంగా పోరాడుతారు. సభ్యతను కాపాడుతారు. ఆసియాకు చెందిన ఒక మణిముత్యం రాలిపోయింది. భారతదేశం ఒక ప్రముఖ మిత్రుని కోల్పోయింది. అంగ్‌సాన్ ప్రభృతులకు యివే మా జోహార్లు !!!

ఆగస్టువారం జరపండి 7 నుండి 15 వరకు

★


ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ జి జగన్నాథరెడ్డి, మల్లవరపు రామకృష్ణారావుగార్లు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ఆగస్టు 7 నుండి 15 వరకు జాతీయ వారం జరుప నిశ్చయించింది. ఈ వారం భారతదేశ చరిత్రలో మరపురానిది ఈవార ప్రారంభం భారతదేశ ఔన్నత్యాన్ని విజ్ఞాన సంపదలను ప్రపంచంలో వెదజల్లి భారతావని కీర్తిని వేనోళ్ళ చాటిన విశ్వకవి రవీంద్రుని స్మారకదినంతో ప్రారంభమవుతుంది, ఆగష్టు 9 స్వతంత్రయోధులు సామ్రాజ్యవాద గుండ్లను ఎదిరించి తమ రక్తాన్ని చిందించిన రోజు, తమ ఆశయం సిద్ధించగలదనే విశ్వాసంతో స్వతంత్రయోధులు మహత్తరమైన బాధ్యతలను మనపై వదలి మరణ శయ్యలపై ఒరిగారు. స్వాతంత్ర యోధుల ఆత్మ బలిదానం ఫలించే అవకాశం ఈ రోజున మనకు కలిగింది యుద్ధానంతర ప్రజావిప్లవానికి సామ్రాజ్యవాదం లొంగి అగస్టు 15 నాటికి ఇండియన్ యూనియన్, పాకిస్థాన్ డొమినియన్లకు అధికారం అప్పగించడానికి అంగీకరించింది.

కాని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమకుట్రలను మాత్రం మానలేదు. దేశాన్ని చీల్చారు. సామ్రాజ్యవాద తొత్తులైన 562 సంస్థానీధీశులను "స్వతంత్రు"లని ప్రకటించారు, అప్పుడే స్వదేశ సంస్థానీధీశులు సంస్థానాలను కసాయిశాలలుగా మార్చారు. నైజాం, తిరువాన్కూరులు స్వతంత్రులమని ప్రకటించారు. కనుక ఆ రోజు విద్యార్థులంతా తమ భేదాలను విడనాడి ఐక్యప్రదర్శనలు, సమావేశాలు జరిపి బ్రిటిష్ కుట్రలను ఓడించాలని ప్రతినబూనాలి. బానిసత్వంతోపాటు బానిస విద్యావిధాన నిర్మూలనకు, ప్రజావిద్యావిధానం అమలుపర్చుటకు విద్యార్థులంతా శపథంపూనాలి. బానిస విద్యావిధాన నిర్మాతలైన నిరంకుశ విద్యాలయాధికారులను తొలగించి, విద్యాసమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులు ముందుకురావాలి.

★ జంగురు

శ్రీ తెన్నేటి సూరి



అనగనగా ఓ వూరు. ఆ వూళ్లో ఒక జమీందారుండేవాడు. వాడికి కర్ర వొస్తూ, ఇంతింత గుబురు మీసాలుండేవి. జంగురుబిల్లి మొహం, వాడూను. వాణ్ణిజూస్తే పిల్లలందరికీ భయమేసేది. వాడు, రాత్రిళ్ళు చీకట్లో, జంగురు బిల్లిలా, కోపంగా అరచి, వూళ్ళో వాళ్ళందర్నీ భయపెట్టేవాడు. పెద్ద వాళ్ళనీ, నాన్నంతంతవాళ్ళనికూడా దడిపించేవాడు.

వాడు తనచుట్టూ కొంతమంది రౌడీల్ని పోగుజేశాడు. వాళ్ళందరికీ రోజు రోజూ ఇన్నిన్ని రూపాయిలిస్తూ వుండేవాడు. అందుకని, వాళ్లేంజేసే వాళ్ళో తెలుసా? – ఆ జమీందారు ఎవళ్ళని కొట్టమంటే వాళ్ళని కొట్టి చంపుతూవుండేవాళ్ళు. ఆ గాండ్రుపిల్లి గాళ్ళు, మందామందా, ఇంతింత పెద్ద బాణాకర్రలుచ్చుకుని, వూరిమీద పడే వాళ్ళు. వాళ్ళ యిష్టమొచ్చినట్లు, ఎవళ్ళు కనిపిస్తే వాళ్ళని, రక్తాలు కారిపోయేట్టు తలకాయలు బద్దలుకొట్టి చంపేస్తూవుండేవాళ్ళు. చీకటిపడడం భయం. దెయ్యాల్లాగా, నల్లటి మట్టలాగులూ వాళ్ళూ, కత్తులు బుచ్చుకొని ఊళ్లో తిరుగుతూండేవాళ్ళు. వాళ్ళంటే అందరికీ భయంగా వుండేది. చీకటి బడితే యెవళ్ళూ బయటికొచ్చేవాళ్ళు గాదు. ఆ జంగురుబిల్లి ముండాకొడుకులంతా నట్టి రాక్షసివెధవలే. ఇంతింత దెయ్యపుకళ్ళూ వాళ్ళూనూ. వాళ్ళనిచూస్తే హడలుపుట్టుకొస్తుంది.

ఆ జమీందారు, ఆ వూళ్ళోవున్న వాళ్ళ పొలాలన్నీ కాజెయ్యాలని, ఒక యెత్తేశాడు. అందుకూ, యీ రౌడీగాళ్ళందర్నీ జేర్చింది. బాణాకర్రలిచ్చి ఈ రౌడీల్ని బంపించి, రైతుల్ని తరిమేసి భూవులన్నీ కాజేశాడు. ఆభూవులన్నీ తనవేనని, దబాయించి, తనే దున్నించుకుంటున్నాడు.

చేలుంటేగాని వూళ్ళోవాళ్ళకి తిండి దొరకదు. చేలు దున్ని వొడ్లు పండించుకుంటేగాని బియ్యం రావు. చేలన్నీ జమీందారు కాజేశాడాయిరి. ఇహ ఆ వూళ్ళో వాళ్ళందరికీ అన్నమెట్టా?—

అందుకని, ఆ వూళ్లోవాళ్లంతా కలిసి, వెంకటప్పయ్యగారి దగ్గిరకెళ్లారు. వెంకటప్పయ్యగారు బాగా చదువుకున్నవాడు; తెలివిగలవాడు; పెద్దమనిషి, చాలా మంచివాడుకూడాను. వూళ్ళో ఎవళ్ళకి, యేకష్టమొచ్చినా, ఆయన వాళ్ళకి సాయపడేవాడు. ఊళ్లోవున్న రైతులంతా వొచ్చి, ఆయనతో జమీందారు సంగతీ, రౌడీల సంగతీ గోలబెట్టారు. ఆయనేవిఁ జెప్పాడంటే–

“మీరందరూ కలిసి కట్టుగావుంటే జమీందారు మిమ్మల్నేమీ చెయ్యలేడు. ఎప్పటికిమల్లే, భయపడకుండా, యెవళ్ళ భూవుల్లోకి వాళ్ళు వెళ్ళి, దున్నుకోండి. జమీందారుగాని ఆయన రౌడీలుగాని మీలో యెవరిమీదికొచ్చినా అంతాకలిసి తరిమెయ్యండి” అని చెప్పాడు.

వాళ్ళంతా అలాగే చేశారు.

జమీందారు ఇక వాళ్ళనేమీ చెయ్యలేక పోయాడు. పొలాలజోలికి రాకుండా మానేసి, కొంతకాలం, మెదలకుండా వూరుకున్నాడు. అంతా కలిసి కట్టుగావున్నారు గనక వాళ్ళని యేమీ చెయ్యలేకపోయాడు.

కాని, వాడు మహాచెడ్డ జంగురు బిల్లిలాంటివాడుగా! పాపం ఆ వెంకటప్పయ్యగాదిమీద కసిబట్టాడు. తాచుపాములా, పగబట్టాడు.

ఓనాడు, బాగా చీకటిబడ్డ తరవాత వెంకటప్పయ్యగారు పొలాన్నించి ఇంటికొస్తున్నారు, ఒక్కడే. ఇంతలోకే, ఆ జమీందారు ఆ రౌడీగాళ్ళని వెంటబెట్టుకొచ్చి, ఆయన్ని

బిల్లులు ★

యెత్తుకుపోయాడు – దోవలో వాణ్ణి దోవలో. ఎవళ్ళకీ తెలియకుండా, రహస్యంగా, కోటలో ఒక చీకటికొట్లో బెట్టి, బైటతలుపు గొణ్ణెంబెట్టి, ఇంత లావు బ్యాంకీ తాళం వేయించాడు. ఊపిరాడక ఆయన లోపల. బలేయిదవుతున్నాడు. ఆ చీకటికొట్లో పెద్ద పెద్ద పందికొక్కులున్నయ్. అవ్వి 'బొక్కురు బొక్కురు' అని అరుచుకుంటూ ఆయన కాళ్ళు కరవొస్తున్నయ్.

ఇదంతా, ఇంటికాడవాళ్ళకి తెలవదుగా! వెంకటప్పయ్యగారి పాపాయీ, వాళ్ళ రాముడూ, వాళ్ళ నాన్నొస్తాడని, బోలెడంతసేపు మేలుకూర్చున్నారు, ఎంతో పొద్దుబోయేదాకా. ఎంతసేపటికీ రాలేదు. పాపం, చివరికి నిద్దరముంచుకొచ్చి, కళ్ళు మూసుకుపోయి, వాళ్ళ అమ్మపక్కలో బడుకుని, నిద్దరబోయాడు.

ప్రొద్దున్నే, నిద్దర్లేచేటప్పటికి, వాళ్ళమ్మ నడవాలో కూర్చుని యేడుస్తోంది.

"ఎందుకే అమ్మా యేడుస్తున్నావూ?" అని, రామూ తల్లి నడిగాడు.

'నాన్నని పట్టుకుపోయారునాయనా' అని అమ్మ జాలిగా యేడిచింది.

"బూచాళ్ళా?" అన్నాడురామూ.

"జమీందారు నాయనా!" అంది.

రాముడికి వొళ్ళు మండుకుపోయింది. "అమ్మ ముండాకొడకా! నీ పనిట్టా వుందా! చెబుతానుండు" అని బయల్దేరుతున్నాడు, పెద్ద మొగాడల్లే, యేం జేద్దామనో!

"ఎక్కడికిరా నాయనా అట్టా బయల్దేరావూ? అని యేడుస్తూ అడిగింది, వాళ్ళమ్మ.

"జమీందా రింటికి, నాన్నకోసం, నేనువెళ్ళి వాళ్ళతో పోట్లాడి, నాన్నని వొదిలించుకొస్తా" అన్నాడు.

వాళ్ళమ్మకి భయమేసింది, "వొద్దు నాయనా వొద్దు, వాళ్ళు రాక్షసులు, నిన్ను కొట్టి చంపుతారు. నీకు తెలియదు మా తండ్రీ! నీకు చిన్నతనం" అని వొలవొలా యేడ్చింది.

"ఏడిశారు!.. ఇదుగో గొడ్డలి"– అని మూలున్న కొమ్మలుగొట్టే చిన్న గొడ్డలి ఒకటి బుజానబెట్టుకు బయలుదేరాడు.

"చస్తేచచ్చా.. నాన్నని తీసుకు రావాల్సిందే!" అన్నాడు.

చిన్నపిల్లడు ఆ మాటనేటప్పటికి వాళ్ళమ్మకూడా రోషం పుట్టుకొచ్చింది. ఏడుపు మానేసి, "సరే' పోదాంపద" అని కోపంగా తనూ బయల్దేరింది.

ఇద్దరూ బయటికొచ్చారు. వీధిలో రామూ మేనమావ కోటయ్య కనిపించాడు – ములకాలకర్ర చంకలో బెట్టుకుని– 'ఎక్కడికిరారావూ!' అన్నాడు.

"మా నాన్నని జమీందారు ఎత్తుకెళ్ళాడు. మా నాన్నకోసం ....." అన్నాడు రామూ.

"సరే నేనూ వస్తాను, మీ రంగడు బాబాయినికోడ కేకేసుకు పోదాం పదండి" అన్నాడు.

రంగడు బాబాయి కోడా "సరే వస్తా"నని బయల్దేరాడు.

కొంతదూరం పోయేప్పటికి, చంద్రయ్యతాత కనిపించి తనూ వస్తానని అన్నాడు.

ఇట్టా – వూరంతా పోగుబడ్డారు. పెద్ద దండూ దండూ బయల్దేరారు. రామూ గొడ్డలి బుజాన బెట్టుకుని ముందు నడుస్తున్నాడు.

వీళ్ళు దండూ దండూ రావటం ఆ రౌడీగాళ్ళు చూసి, హడిలిపోయి, ఎక్కడివాళ్ళక్కడ ఉడాయించేశారు. రామూ వాళ్ళూ రావటం, ఆ జంగురు బిల్లి జమీందారు కిటికీలోనుంచి చూశాడు. కోటాకోటా, తలోరాయీ పీకేసేస్తారని భయమేసింది. అంతమంది వున్నారన్నమాట!

చీకటికొట్టు తలుపుతీసి, వెంకటప్పయ్యగారిని వొదిలిపెట్టి, బయటికి పంపించాడు. తను కోటలో దూరి తలుపులు మూసేసుకొని దాక్కున్నాడు.


వెంకటప్పయ్యగారు నవ్వుకుంటూ వచ్చి రాముణ్ని యెత్తుకుని ముద్దు బెట్టుకున్నాడు. ఎంతో సంతోషించాడు. "నాతండ్రే! ... యెంతపని జేశావురా!"అని యెంతో యిదిగా మెచ్చుకున్నాడు.

ఇంటికెళ్ళినాక, రంగడు బాబాయిని బస్తీకి పంపించి, రాముడికి మూడు చక్రాల సైకిలు తెప్పించిపెట్టాడు.

రాముడికి బలేధైర్యం వుందని వూళ్ళో పిల్లలంతా ఎంతో మెచ్చుకుని జోతబట్టేవాళ్ళు.

నిజంగా, రాముడు అలా, ధైర్యం చెయ్యకపోతే నాన్న యేంగావాల్సిందీ ఆ పందికొక్కుల చీకటికొట్లో!

★



మానవుడు మర

సోవియటు శాస్త్ర

మానవుడికి మరణం అనేది ఎల్లప్పుడూ తప్పనిసరి అయిందికాదు. వృద్ధాప్యం, దీర్ఘ వ్యాధులు మొదలైన వాటివల్లవచ్చే మరణాలు తప్పిస్తే, యెన్నో అకాలమరణాలను మనం జయించవచ్చు. అంటే అవి సంభవించకుండా చేసుకోవడం ఒకటేకాదు, అలా చనిపోయిన వారిని బ్రతికించుకోవచ్చు కూడా. అది సోవియట్ శాస్త్రజ్ఞుల నమ్మకం. నమ్మకమే కాదు. అందులోవారు విజయం సాధించారు. ఇంకా అనేక రకాల పరిశోధనలుచేస్తున్నారు. మానవ జాతి అభ్యుదయంకోసం ఈ సోవియట్ శాస్త్రజ్ఞులు సాగించేపరిశోధనలు, సాధించిన విజయాలు తెలుసుకోడం మనకెంతో అవసరం.

చచ్చిన మనిషిని బ్రతికించాడు

ఈ క్రిందనున్న ఫొటోకేసి ఒక్కసారి చూడండి. అతనిపేరు వాలెంటిన్ చెరిపనోవ్. రెడార్మీ సైనికుడు. 1944 మార్చి 3 వ తేదీని యుద్ధరంగంలో తీవ్రమైన గాయాలవల్ల చని



చెరపనోవ్

పోయాడు. తొడమీద తగిలిన పెద్ద గాయం నుండి రక్తస్రావం ఆపలేకపోయారు. రక్తం విపరీతంగా కారిపోవడంవల్ల, దెబ్బతో కలిగిన "షాక్"వల్ల చెరిపనోవ్ చచ్చిపోయాడు.

కాని ఆ యుద్ధరంగంలోనే పనిచేస్తున్న డాక్టరు నెగోవిస్కీ, "ఈ వీరసైనికుని మరణాన్ని నేను అంగీకరించను" అన్నాడు. ఇతని విషయంలో మృత్యువుతో పోరాడదలచుకున్నాడు. శవాన్ని పరీక్షించాడు. ఏముంది? గుండె ఆగిపోయింది. నాడి ఎక్కడా దొరకలేదు. అతడు చచ్చిపోయాడనడంలో ఏమీ సందేహంలేదు. అయినా నెగోవిస్కీ అధైర్యపడలేదు. మరణస్వభావాన్ని తెలుసుకున్నప్పుడు అతనికి ధైర్యం మరీ ఎక్కువైంది. తానింతకాలమంచీ చేస్తున్న పరిశోధనలోని సిద్ధాంతం సరియైనదైతే చెరిపనోవ్ బతికి తీరాలి.

చెరిపనోవ్ బ్రతికాడుకూడ. ఇప్పుడు మీరు చూచే ఫొటో అతడు తిరిగి బ్రతికిన తరువాత తీసినదే. అతడిప్పుడు మాస్కోలో ఒక ఫ్యాక్టరీలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. తన పునర్జన్మకి తిరిగి జన్మదినోత్సవాలు చేసుకుంటున్నాడు. మూడో జన్మదినోత్సవం మొన్న మార్చినెలలోనే జరిగింది. ప్రతి సంవత్సరం డాక్టరు నెగోవిస్కీకి "గ్రీటింగ్సు" పంపుతూ వుంటాడు. డాక్టరుకూడా తన డైరీలో వాటిని "నోట్" చేసుకుంటూ వుంటాడు.

అయితే డాక్టరు నెగోవిస్కీ ఏంచేసి ఇతన్ని బతికించాడు? అతని సిద్ధాంతం ఏమిటి?

సమాధానం కావాలంటే ప్రక్క వ్యాసాన్ని దీనితరువాత వచ్చే వ్యాసాలను చదవండి.



డాక్టర్ నెగోవిస్కీ

ఇది మానవుని చిరకాల వాంఛ

ఈపాడు మృత్యువును జయించ లేమా? అనేది అనాదినుంచీ మానవుణ్ణి బాధిస్తున్న సమస్యే, దాన్ని జయించాలనేవాంఛ ముఖ్యంగా అకాల మరణం వాత బడ కూడదనే కోరిక చిరకాలంనుంచీవుంది. ఇంచుమించు ప్రతిదేశ పురాణాల్లోను ఎక్కడో ఓచోట మన సావిత్రి సత్యవంతుల లాగ ఒక వీరుడో, వీర వనితో మృత్యువుతో పోరాడి గెల్చారనో, లేక ఎవరో ఒక మహాత్ముడు తన మంత్ర శక్తితో చనిపోయిన వారిని బ్రతికించాడనో కథలు మనకి కనబడుతూ వుంటాయి. ఈ కథలన్నీ మరణాన్ని జయించాలనే మానవుని చిరకాలవాంఛ యొక్క ప్రతిబింబాలే గాని మరోటి కాదు.

మానవ శరీరం ఎలా నిర్మింపబడిందో, అది ఎలా పనిచేస్తుందో, మరణం ఎలా సంభవిస్తుందో - ఇవి ఏవీ తెలియని ఆదికాలంలో మానవుడు మరణంకూడ ఒక జబ్బులాంటిదే అనీ, దానిని కుదర్చవచ్చుననీ భావించేవాడు. అలాంటి ప్రయత్నాలు కూడా జరిగాయి. చనిపోయిన వారిని బ్రతికించడానికి చురకలు వేసేవారు. కొరడాలతోను, ఇనప కడ్డీలతోను బాదేవారు. కొన్నిచోట్ల బలవంతాన పళ్ళు పీకేవారు. అంటే అగస్మాత్తుగా ఒక బాధ కలిగించే పని చేస్తే నిద్రనుంచి ఉలిక్కిపడి లేచినట్లుగానే చనిపోయిన మనిషికూడా లేచి కూర్చుంటాడనీ, చావుఅనే జబ్బుకి అదే మందు అనీ వారు అనుకునేవారు.

చనిపోయిన వారి శరీరంలోకి ఇతర జంతువుల రక్తం ఎక్కిస్తే బ్రతికించవచ్చునన్న ఆలోచనకూడ పూర్వం కొందరికి కలిగింది.

ణాన్ని జయించాడు

జ్ఞుల నూతన పరిశోధనలు

— "రావు"

గ్రీసు, రోము మొదలైన చోట్ల అలాంటి ప్రయత్నాలుకూడా జరిగినట్లు కనబడుతుంది

వీటిలో పడి చనిపోయినవారిని బ్రతికించడానికి, ఊపిరి తిత్తులలోకి గాలి కొడితే ఆ నీళ్ళన్నీ పోయి అవి తిరిగి గాలి పోసుకుంటాయని అలా చేయడంకూడా జరిగేది. ఈ ఆలోచన 1530 సంవత్సరంలో పెరాసిలస్ అనే ఒక డాక్టరుకి తట్టింది కొలిమి తిత్తుల్లాంటివి ఉపయోగించి అతడీ పరిశోధన చేయసాగాడు. 18 వ శతాబ్దంలోనూ, 19 వ శతాబ్దంలో కొంత కాలంకూడా ఈగాలి కొట్టేపద్ధతి ఉపయోగింపబడినట్లు తెలుస్తుంది. 1850 వ సంవత్సరంలో ఇది నిషేధింపబడింది, దీనివల్ల కొన్ని కేసులలో తిరిగి బ్రతకడం జరిగినా మోటుపద్ధతి అవడం వల్ల ఊపిరి తిత్తులలోని టిస్యూలు దెబ్బతినడం సంభవించేది.

తరువాత 20 వ శతాబ్దంలో ఇంకా సున్నితమైన విధానాలు కనిపెట్టబడ్డాయి కాని మొత్తం మీద ఇప్పుడు మనకి కనబడే "ఐరన్ లంగ్స్" అనేవిగాని, ఊపిరి తిత్తులను తిరిగి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సాగించేటట్లుచేసే ఆధునిక సాధనాలు గాని, పెరాసిలస్ కనిపెట్టిన సూత్రం మీద ఆధారపడినవే అని చెప్పాలి

17, 18 శతాబ్దాల్లో రష్యన్ శాస్త్రవేత్తలు కూడా మరణసమస్యపై పరిశోధనలు సాగించారు. 1692 లో ప్రాడా యూనివర్సిటీనుండి పోస్నికోవ్ అనే శరీరశాస్త్రజ్ఞుడు నేపుల్సు వెళ్ళి చనిపోయిన కుక్కలను బ్రతికించడం ఎలాగ అని పరిశోధనలు చేశాడు. అలాగే 1736 లో పీటర్సు బర్గ్ సైన్సు అకాడమీకి అధ్యక్షుడుగావున్న బెర్నౌలీ అనే గణిత శాస్త్రవేత్త నీటిలో మునిగి చనిపోయిన పక్షుల్ని విద్యుచ్ఛక్తితో బ్రతికించవచ్చునేమో అని పరిశోధన చేశాడు.

19 వ శతాబ్దంలో మాస్కో యూనివర్సిటీ ప్రొఫెసరు, అలెగ్జీఫిలో మాఫిట్‌స్కీ అనే ఆయన కుక్కలమీద ఇంకొకరకం పరిశోధన మొదలు పెట్టాడు. కుక్క శరీరంలోని రక్తాన్ని తోడివేయడం దానికి స్పృహతప్పి పోయే స్థితి వచ్చేటంత వరకూ ఎంతరక్తాన్ని తీయగలమో అంతా లాగడం. ఆతరువాత ఇతర జంతువుల రక్తాన్ని ఆకుక్క శరీరంలోకి ఎక్కించి దానిని తిరిగి బ్రతికేటట్లు చేయడం. ఇదీ ఆయన చేసిన పరిశోధన.

ఈవిధంగా మొదటినుంచీ మానవుడు మరణాన్ని జయించడం ఎలాగ అనే విషయమై తంటాలు పడుతునే వస్తున్నాడు. 1628 లో డా. హార్వే అనే ఆయన శరీరంలో రక్తం ప్రవహిస్తూంటుందనే విషయాన్ని తెలుసుకున్న తరువాతనూ, 17 18 శతాబ్దాలలో కనిపెట్టబడిన ఇతర శాస్త్రీయ విషయాలు తెలిసిన తరువాతనూ, ఈ సమస్యా పరిష్కారానికి ఒక శాస్త్రీయ పద్ధతులలో పరిశోధనలు జరగనారంభించాయనే చెప్పాలి.

ముఖ్యమైన అవయవాలతో విడివిడిగా పరిశోధనలు

శాస్త్రజ్ఞులు ఒక ముఖ్యమైన రహస్యాన్ని తెలుసుకున్నారు. ఒక జంతువుగాని, మనిషిగాని చనిపోవడం సంభవించి నప్పుడు శరీర నిర్మాణంలో వున్న అవయవాలన్నీ కూడా వెంటనే స్తంభించిపోవడం అనేది జరుగదు. ప్రాణం పోయిన కొంతసేపటి వరకూ కొన్ని అవయవాలు తమ తమ ముఖ్య కర్తవ్యాలను నెరవేరుస్తూనే వుంటాయి. ముఖ్యంగా ఆకస్మిక మరణాలలో ఇది జరుగుతూ వుంటుంది. గుండెకాయ ఆగిపోయి, వూపిరితిత్తులు పని మాని వేయడం - అంటే ప్రాణం పోవడం- సంభవించిన కొంతసేపటి వరకూ శరీరంలోని కణాలు టిస్యూలు జీవించే వుంటాయి. కొంత సేపటికి క్రమక్రమంగా అవి కూడా చచ్చిపోతాయి. దీనికి కారణం వాటివాటి నిర్మాణంలోను, శరీరంలో ఒక్కొక్కటి ఒక రకమైన పని చేయవలసి వుంది. కనుక ఆపని చేయడంలోను గల వ్యత్యాసాలే. ఆప్రాణికి సంభవించిన మరణ స్వభావాన్నిబట్టి కూడా ఇది చాలవరకు ఆధారపడి వుంటుంది.

ఇది తెలుసుకున్నప్పుడు శాస్త్రవేత్తలకి ఒక ఆశాకిరణం కనిపించింది. ఇలా ప్రాణం పోయిన తరువాతకూడా కొంతసేపు బ్రతకగలిగే అవయవాలేమిటో తెలుసుకుని వాటిని శరీరంలోనుంచి వెంటనే వేరుచేసి చచ్చిపోకుండా కాపాడ గలిగితే, ఇంకో శరీరంలో అదే అవయవం చెడిపోయినప్పుడు దానిస్థానే దీనిని పెట్టి మనుష్యుల్ని బ్రతికించవచ్చును కదా ? ఈ ఆశ అనేకమంది శాస్త్ర పరిశోధకుల్ని ఆకర్షించింది మానవ శరీరంలోను ఇతర జంతువుల శరీరాలలోను గల ముఖ్యమైన అవయవాలమీద విడివిడిగా పరిశోధనలు సాగించారు. ఈ విషయంలో రష్యన్ డాక్టర్లు, శాస్త్రజ్ఞులు మొదటినుంచీకూడా ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేస్తున్నారు

అవయవాలను బ్రతికించారు

19 వ శతాబ్దం ఆఖరు దినాల్లో నికోలాయ్ పావ్‌లో విచ్ క్రావుకోవ్ అనే రష్యన్ శాస్త్రవేత్త జంతువుల శరీరాలనుంచి, మానవ శరీరం నుంచి కొన్ని అవయవాలను వేరుచేసి అవి చచ్చిపోకుండా బ్రతికించడం ఏలాగ అనే పరిశోధనకు పూనుకున్నాడు కుందేలు చెవి. మనిషి చేతివేలు, కొన్ని జంతువుల ఎండోక్రిన్ గ్రంధులు మొదలైన వాటిని వేరుచేసి వాటిలోని టిస్యూలు ఎలా పనిచేస్తాయో పరిశీలించసాగాడు. వాటిని బ్రతికించడానికి సాధనాలు ఆలోచించడం మొదలు పెట్టాడు. కొన్ని పద్ధతులు కనిపెట్టి విజయంపొందాడుకూడ. నిజానికి మరణ సమస్యలో నికొలాయ్ క్రావ్‌కోవ్ పరిష్కార మార్గానికి చాల దగ్గరకు వచ్చిన మొదటి రష్యన్ శాస్త్రవేత్త అని చెప్పవచ్చు.

తెగగొట్టిన తలలో మెదడుచేత పనిచేయించారు

నికోలాయ్ క్రావ్‌కోవ్ తరవాత పేర్కొనవలసిన సోవియట్ శాస్త్రజ్ఞుడు అలెగ్జికుల్యాబ్కో. ఆయన 1902 లో కజాన్, టోయస్కు యూనివర్సిటీలలో శరీరశాస్త్రంలో ప్రొఫెసర్ గా వుండేవాడు. తెగగొట్టబడిన జంతువులతలలో మెదడుచేత పనిచేయించడంలో, బ్రౌన్‌సిక్వార్డ్ అనే శాస్త్రజ్ఞుడు సాధించిన విజయం కుల్యాబ్కోను ఆకర్షించింది. సిక్వార్డ్ జంతువుల విషయంలో సాధించినది మనిషి విషయంలో ఎందుకు సాధించలేము అని అతని పట్టుదల. 1844 లో లాబోర్డి అనే శాస్త్రవేత్త ఇటువంటి ప్రయత్నమే ఒకటి చేశాడు. ఉరితీయబడిన ఒక మనిషిని తెచ్చి తలకాయ తెగగొట్టి దాని రక్తనాళాలను ఒక బ్రతికివున్న కుక్క రక్త

మిగతా 29వ పేజీలో

(8 వ పేజీ తరువాయి)

మహాసభకు సమ్మె పోరాటాల్లో ఆరితేరిన విద్యార్థి నాయకులను ప్రతినిధులుగ పంపింది. సభకు అధ్యక్షుడుగనున్న కాంగ్రెసు సోషలిస్టు నాయకుడు మసానీ ప్రజాతంత్ర పద్ధతులపై స్వతంత్రంగా అతివాద ధోరణితో బలపడుతున్న విద్యార్థి ఉద్యమాన్ని చూచి గాబరా పడ్డాడు. ఒక వైపున సోషలిష్టునని ప్రకటించుకొంటూ మరొకవైపు సోషలిస్టురాజ్యమైన సోవియట్‌పై దుష్ప్రచారాని కొడిగట్టాడు మహాసభలో సోవియట్ లోని విద్యా, వైజ్ఞానిక పురోభివృద్ధిని అభినందిస్తూ తెచ్చిన తీర్మానంపై వ్యతిరేకత రెచ్చగొట్టాడు. పని చేయకుండా కుర్చీలు అలంకరించాలనే పదవీవ్యామోహ మురాను కూడగట్టాడు కాంగ్రెసు సోషలిస్టు భావాలు గల విద్యార్థులకు అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్‌ను తమ జేబు సంస్థగా ఉంచుకోవాలని నూరిపోశాడు నూటికి డెబ్బదిమంది ప్రతినిధుల అభిప్రాయంతో నిమిత్తంలేకూడా సంఘాధి కారాలను తమ పార్టీ అనుచరులైన విద్యార్థులకు అప్పచెప్ప మన్నాడు. ఏ ఒక్క రాజకీయపార్టీకి తోకగా విద్యార్థి ఫెడరేషన్ ఉండరాదనీ ప్రజాస్వామ్యాన్ననుసరించి రాజకీయ భేదాలతో నిమిత్తం లేకుండా పనిచేయాలనీ ఎంతచెప్పినా వినిపించుకోలేదు. అన్ని రాజీ మార్గాలను వ్యతిరేకించాడు. మహాసభను మధ్యలోనే ముగించి తనమురాను వెంటబెట్టుకొని వెడలిపోయాడు. పోటీగా అఖిలభారత జాతీయ విద్యార్థి ఫెడరేషన్ అంటూ మరొక సంస్థను స్థాపించ ప్రోత్సహించాడు. ఆంధ్ర విద్యార్థులుమాత్రం ఏకగ్రీవంగా కాంగ్రెసు సోషలిస్టునాయకుల, వారి అనుచరుల విచ్ఛిన్నకరపంథాను ఎదిరించి విద్యార్థి ఫెడరేషన్ ఐక్యతకు పోరాడారు. అఖిలభారత విద్యార్థి ఉద్యమంలో కాంగ్రెస్ సోషలిస్టులు దూర్చిన కత్తిని, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ గుండెకు తాకకుండా కాపాడారు. ఆనాటి అవిచ్ఛిన్న ఐక్యత 1942 ఆగస్టువరకు అట్లే విలువుకొంటూ, విద్యార్థి ఉద్యమాన్ని సుస్థిరంచేసిన ఆంధ్ర విద్యార్థులు ప్రత్యేక ప్రశంసకు పాత్రులనుటలో ఏమాత్రము అతిశయోక్తిలేదు.

1937-38 లో సాగించిన అసంఖ్యాక విద్యార్థి పోరాటాలు, సాధించిన విజయాలు విద్యాలయాధికారులను కొంతవరకు కళ్ళుతెరచేటట్లు చేశాయి. హైస్కూలులో బెత్తాలువాడటం, విచ్చలవిడిగా డిస్మిస్సల్లు, చాలవరకు తగ్గిపోయాయి. శాసనరూపంలో డిస్మిస్సను విధానం రద్దుకాకపోయినా ఆచరణలో రద్దయిందా అన్నట్లు చేయగలిగిగారు. వాక్సభా స్వాతంత్ర్యాలు విద్యాలయాల్లో ఎక్కువ అమలు చేసుకోగల్గారు తలిదండ్రుల, ప్రజల, ఉపాధ్యాయుల నుండి హెచ్చు సానుభూతిని తెచ్చుకోగల్గారు. సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేక పోరాటం, రాజకీయఖైదీల విడుదల ఉద్యమాలు, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి ఆందోళన, పెద్దఎత్తున సాగించగల్గారు. నిరంకుశ విద్యాధికారులు సహితం చెక్కుచెదరని విద్యార్థి ఐక్యతముందు తమ ఆటలుసాగవని, తెలుసుకో గల్గారు.

1942 ఆగస్టు ఘటనలు-ఆంధ్రవిద్యార్థి ఉద్యమ చీలికలు - ప్రస్తుత దశ

విద్యార్థి ఫెడరేషన్ ప్రారంభమైన నాటి నుండి, ఫాసిజానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చింది. స్పెయిను, చైనా దేశాల్లో ఫాసిస్టులు జరుపుతున్న దారుణ హత్యాకాండలను ఖండిస్తూవచ్చింది, మ్యూనిక్ ఒడంబడికలను, జెకోస్లోవేకియా దురాక్రమణలనువ్యతిరేకిస్తూ పచ్చింది; మన భారత జాతీయోద్యమం తీసికొన్న ఫాసిస్టువ్యతిరేకవైఖరినే అగ్రగామిగా విద్యార్థి ఫెడరేషన్ ముందుకు గొంపోతూ వచ్చింది జర్మను - ఇటాలియన్ జపాను ఫాసిస్టుసైన్యాలు విజృంభించి ప్రపంచ ప్రజాతంత్ర దేశాలన్నింటినీ ఒకటి తర్వాత ఒకటి కబళిస్తూ కారుమబ్బులవలె కమ్ముకురాసాగాయి. విద్యార్థి ఫెడరేషన్ తొలినుండీ తీసికొంటున్న వైఖరి ననుసరించి, జాతీయోద్యమముయొక్క ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయాలనుబట్టి ఫాసిస్టు దండయాత్రకు ఎదురునిల్చి యుద్ధంచేయ పిలుపునిచ్చింది. ఆ పిలుపు ననుసరించి పురోగమించుతున్న సమయంలో చర్చిల్ ప్రభుత్వం కాంగ్రెసు నాయకులపై దాడిచేసి మన ఫాసిస్టు వ్యతిరేక జాతీయోద్యమంలో ఒక గండికొట్టింది. ఈ అఘాతమే విద్యార్థి ఉద్యమంలోకి చొచ్చుకొచ్చింది. అయినప్పటికీ విద్యార్థి ఫెడరేషన్ యుద్ధాన్ని బలపర్చే తన రాజకీయ తీర్మానాన్ని ఒక రాజకీయ పార్టీ తీర్మానంవలె ప్రతి సభ్యుడు తప్పక ఆచరించితీరాలనే వాదన చేయలేదు. ఈ తీర్మానంతో అంగీకరించని ప్రతి విద్యార్థికీ సంపూర్ణ స్వయంనిర్ణయ స్వేచ్ఛను గుర్తించి విద్యార్థి సంఘ ఐక్యతను కాపాడుటకు విద్యార్థి ఫెడరేషన్ శాయశక్తులా పాటుబడ్డది. కాని అవకాశం దొరికినపుడల్లా ప్రజా వుద్యమాలను చీల్చి తమ పార్టీకి తోకగా ప్రజాసంఘాలను నిర్మించపూనుటకు బాగా అలవాటుపడ్డ కాంగ్రెసు సోషలిస్టునాయకులే జాతియ విద్యార్థి సంఘమనే పోటీసంఘాన్ని పెట్టారు. 1938లో మసానీ పెట్టిన చీలికలను ఎదిరించి ఐక్యతను కాపాడుకోగలిగిన ఆంధ్ర విద్యార్థి ఉద్యమం 1942 ఆగస్టులో రెండు ముక్కలయిపోయింది.

ఆంధ్రవిద్యార్థి ఉద్యమంలో ఈ విచ్ఛిత్తి ఎప్పుడైతే ఏర్పడ్డదో, తిరిగి నిరంకుశ విద్యాధికారులు, అభివృద్ధి నిరోధకులు తలఎత్తుటకు మరొక అవకాశం చిక్కింది 1937 మొదలు 42 వరకు ఒక అర్థ దశాబ్దికాలం పోరాడి సాధించిన విజయాలన్నిటికీ ముప్పువాటిల్లే స్థితివచ్చింది. రాజకీయాల్లో శిక్షలుపడ్డ విద్యార్థులను విద్యాలయాల్లో చేర్చుకోరాదనే జి. ఓ. లు, తమచిత్తం వచ్చినట్లు డిస్మిస్సను వూచకోతలు ప్రారంభమయ్యాయి. విద్యార్థి ఉద్యమ నాయకులకు విద్యాలయాల్లో చదువు కవకాశం లేకుండా ట్రాన్సుఫర్ సర్టిఫికెట్లు ఇచ్చి వెళ్ళగొట్టటం పరిపాటయింది. విద్యాలయాల్లో వాక్సభా స్వాతంత్ర్యాలకు సంకెళ్ళు బిగించ ప్రారంభమయింది. చాలినన్నిసీట్లు లేక, విద్యాబోధనకు అవసర పరికరాలు సప్లయిచేయక, ఒక్కొక్కక్లాసులో శ్రద్ధతో విద్యాబోధచేయ సంభవంగానంత విద్యార్థి సంఖ్యను మందవేయడం, సంవత్సరంలో ఆరుమాసాలుగడచినా పాఠ్యపుస్తకాలు లభించక, పాఠాలు చెప్పకపోవడం - మున్నగునవి పరిపాటి అయిపోయాయి రకరకాల ఫీజులు హెచ్చించడం, పదోనెలజీతం పెంచడం, ఒక కలంపోటుతో జరిగి పోతున్నాయి, ఐక్యవిద్యార్థి ఉద్యమమే ఉంటే ఈ ఆటలు కట్టించడం ఎంత సులభం!

విద్యార్థి ఫెడరేషన్ ఈ ప్రమాదాన్ని మొదటినుండి చాటుతూనేఉంది. వేరువేరు రాజకీయాభిప్రాయాలున్న విద్యార్థులంతా ఒకే సంఘంలో పనిచేయు సదవకాశాలను రుజువుచేస్తూ ప్రచారంచేస్తూనేవచ్చింది కనీసం సమిష్టి సమస్యలపైనయినా విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి కాంగ్రెసులుకలసి పనిచేదామని నెత్తినినోరు పెట్టుకొని ఆందోళన చేస్తోంది విద్యార్థి జనసామాన్యం ఇందుకంగీకరించి ముందుకు వస్తున్నారు. విద్యార్థి కాంగ్రెసు నాయకత్వం మాత్రం అతి సంకుచితదృష్టితో ఐక్యసంఘటనలకు అడ్డుపుల్లలువేస్తూ ఉద్యమ ప్రవాహాన్ని ఉజ్వలంగా సాగనీయకుండా చేస్తూనేవుంది. అయినను చరిత్ర నేర్పిన అమూల్యపాఠాలు విద్యార్థి సామాన్యంపై అత్యంత ప్రభావం కలుగచేస్తున్నాయి, ఐక్య పోరాటానికి, ఉద్యమానికి, ఆశాజ్యోతులు కనిపిస్తున్నాయి,

ఆ చైతన్యము 1947లో ఆంధ్ర విద్యార్థుల చరిత్ర ప్రసిద్ధమైన సమ్మె పోరాటాల్లో ప్రతిబింబించింది. దాని ఫలితంగానే అభివృద్ధి విరోధకులయిన విద్యాధికారుల, నిరంకుశ ప్రభుత్వోద్యోగుల దాడి నెదుర్కొని కొంతవరకైనా ప్రతిఘటించగల్గారు.

భవిష్యత్ కర్తవ్యం

నేడు భారతదేశమొక నూతన స్వాతంత్ర్యాధ్యాయంలో ప్రవేశించుతోంది. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు మూటముల్లె కట్టుకొని పోతామని ప్రకటనలు, ప్లానులు బహిరంగంగా చేస్తున్నారు. తప్పనిసరి అయినంత వరకు మాత్రం మన జాతీయోద్యమానికి రాజకీయాధికారమిచ్చి, మతవైషమ్యాలను సంస్థాన నిరంకుశ పునాదులను, దేశ ఆర్థిక బల హీనతను పురస్కరించుకొని పరోక్షపు పెత్తనానికి, కొత్త రకపు పరిపాలనకు కుట్రలు పన్నుతున్నారు. అడుగడుగునా ఆ కుట్రలను ప్రతిఘటించి ఓడిస్తేతప్ప మన స్వాతంత్ర గమ్యస్థానాన్ని చేరుకోలేము విద్యార్థి వుద్యమంలో వచ్చిన భేదాభిప్రాయాలన్నింటిని ప్రక్కకునెట్టి ఏకంగా నిలబడి వడిదుడుకులు లేని ప్రజాతంత్రానికి పోరాడటమే విద్యార్థి ఉద్యమం ముందున్న మహత్తర స్వాతంత్ర ఆశయం.

శతాబ్దాల బ్రిటిష్‌పాలన ప్రవేశపెట్టిన బానిస విద్యావిధానం యొక్క ఉక్కుచట్రం ఇంకా యధావిధి సాగుతూనేఉంది. నేడు సమగ్రమైన జాతీయ ప్రజాతంత్ర విద్యావిధానం ప్రవేశపెట్టాలంటే, దేశం యొక్క ఆర్థిక, రాజకీయ, సాంఘిక పునాదులనే పూర్తిగా సంస్కరించనిదే సాధ్యంగాదు. జాతీయ సంపదను హెచ్చు చేసే భారీ పరిశ్రమలను ప్రవేశపెట్టాలి. నూటికి ఎనభైమందిగా ఉన్న భారత రైతాంగం, కూలీల, పేదప్రజల ఆర్థిక జీవితాన్ని దుర్భరం చేస్తున్న జమీందారీ, భూస్వామ్య విధానాలను రద్దు చేయాలి. లేనిదే జాతీయ విద్య, ప్రజా విద్య అనేది ఊహా ప్రపంచంలోని, నినాదాలుగ మాత్రమే ఉండిపోతాయి. ఉపాధ్యాయుల జీవిత భృతులను పెంచాలన్నా, విరివిగా విద్యాలయాలు స్థాపించాలన్నా, నిర్బంధ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టాలన్నా డబ్బులేదనే సాకులు చెప్పడం యధావిధిగా సాగుతూనే ఉంటుంది. ప్రస్తుత మన కాంగ్రెసు ప్రభుత్వాలు సహితం సామ్రాజ్యవాదుల బానిస విద్యా పంధానుండి పూర్తిగ విడబడి నూతన పంధా త్రొక్కక, ఊగిసలాటతో పాత ఉక్కు చట్రంలోనే ఇరుసులా ఇరుక్కుని జాతీయ పునర్నిర్మాణానికి పూర్తి ప్రయత్నాలు చేయ నిరాకరిస్తున్నారు ఐక్య విద్యార్థి ఉద్యమం శేల్కొని జాగృతితో పోరాడి ఆ ఊగిసలాటను అరికట్టకపోతే, మన జాతీయ విద్యాశయాలు ఈడేరవనుటలో రవ్వంతయు సందేహములేదు.

ఆంధ్ర విద్యార్థుల ప్రత్యేక బాధ్యతలు

సామ్రాజ్యవాదుల కృత్రిమ పాలనక్రింద ఆంధ్రజాతి ఛిన్నాభిన్న మయిపోయింది, తెలుగుసంస్కృతి విచ్ఛిన్నమయింది. 90 లక్షల తెలుగు ప్రజలు నైజాం నిరంకుశ అనాగరిక ప్రభుత్వం క్రింద ప్రుగ్గిపోతున్నారు. మనజాతికున్న ఉన్నత విద్యాసౌకర్యాలుఅసలే పూజ్యం. కళలు, సారస్వతం, సంస్కృతి ఎదుగుబొదుగు లేక స్తంభించిపోయి, వెనుకముఖం చూడసాగాయి. కాకమ్మ కధలతో అల్లిన చరిత్ర, భూగోళం వగైరాలను తిరిగి జాతీయ పద్ధతులపై రాయించాలి మాతృ భాషలోనే విద్య గరపుటకు తక్షణమే పూనుకోవాలి నేటిపరీక్షా పద్ధతులు పూర్తిగా మార్చివేసి అభ్యుదయ పంధా ననుసరించి పరీక్షా విధాన మమలు పర్చాలి గుమస్తాలను ఉత్పత్తిచేసేనేటి విద్యా విధాన స్వరూపమే మార్చివేయాలి. పనలేని డిగ్రీల వ్యామోహం వదల్చి జాతీయ పునర్నిర్మాణానికి ఉపయుక్తమగు విద్యా శిక్షణలు గరపాలి. హైస్కూళ్ళలోను, కాలేజీలలోను 18 ఏండ్లవయస్సుకు పైబడ్డవారందరికీ మిల్టరీశిక్షణగరపి దేశస్వాతంత్ర రక్షణకు ప్రజాసైనికులను తయారుచేయాలి. ఉచిత ప్రాథమికవిద్యను అమలుపర్చాలి ధనికుల బిడ్డలకు మినహా అందుబాటులోలేని ఉన్నత విద్యను, టెక్నికల్‌విద్యను ప్రజాసామాన్యానికి అందుబాటులోనికి తేవాలి ఒక ప్లానుప్రకారం విద్యా విధానాన్ని అమలు పర్చునట్లు ప్రభుత్వంపై వత్తిడి తేవాలి ఈ గురుతర బాధ్యతలు దిగ్విజయంగా నెరవేర్చాలంటే మొట్టమొదటిదిగా విద్యార్థి ఉద్యమం తన చీలికలు పారద్రోలి ఐక్య మవ్వాలి. అట్టి ఐక్య విద్యార్థి పోరాటమే, ఉపాధ్యాయుల, విద్యా వేత్తల, ప్రజా తంత్రశక్తులను తమవైపు త్రిప్పుకోగల్గుతుంది. ఉత్కృష్ట జాతీయ ప్రజా విద్యా విధానాన్ని అమలుపర్చ గల్గుతుంది. జాతియొక్క స్వర్ణభవిష్యత్‌కు పునాదులు వేస్తుంది, లేదా అభివృద్ధివిరోధక శక్తుల కుట్రల కాహుతై దాస్య, దరిద్ర, అజ్ఞాన, అంధకారాల్లో దీర్ఘకాలం బుటకలువేస్తూ ప్రపంచ ప్రజలముందు సిగ్గుతో తల వంచుకోవలసి వస్తుంది. ఆంధ్రవిద్యార్థి ఫెడరేషన్, ఐక్యత పేరిట, స్వాతంత్రం పేరిట, జాతీయ విద్య పేరిట-ఉజ్వల భవిష్యత్ పేరిట ఆంధ్ర విద్యార్థు లందరినీ ముందుకు రమ్మని వేయినోళ్ళ విజ్ఞప్తిచేస్తోంది. అదేనేటి నిర్మాణయుత నినాదం.

(27 వ పేజీ తరువాయి)

నాళాలకు అతుకుబెట్టి చూచాడు. కాని లాభం లేకపోయింది. ఆ పరిశోధనలన్నిటినీ కుల్యాటో్క అతి జాగ్రత్తగా పరిశీలించాడు. ఆ విధంగా మెదడుచేత తిరిగి పనిచేయడం అంత సులభంకాదని గ్రహించాడు. ఎందుచేతనంటే, శరీరంలోని నరాలకన్నింటికీ మెదడు కేంద్రం. అది అతి సున్నితమైన పదార్థం. ముఖ్యంగా ప్రాణవాయువు దానికి ఏక్షణాన సప్లయి కాకపోతే ఆ క్షణంనుంచి అది పని చేయదు దానికి ఎప్పటికప్పుడు ప్రాణవాయువును సప్లయిచేసేది శరీరంలోని రక్తం. దేహంలోరక్తప్రవాహంకొన్ని నిమిషాలపాటు ఆగిపోయిందంటే, అన్ని నరాలకు ముఖ్య కేంద్రమైన మెదడు పని చేయడంకూడా ఆగిపోతుంది. ఒకసారి ఆగిపోయిన మెదడుచేత తిరిగి పనిచేయించడం చాలా కష్టం.

గుండెకాయ ప్రధానం

శరీరంలో రక్తప్రవాహం సరిగా జరగాలంటే గుండెకాయ ప్రధానమైనదని శరీర శాస్త్రం తెలిసినవారందరికీ విదితమే. అదీగాక గుండెకాయ కండరాలచే నిర్మింపబడిన అవయవం మెదడు, నరాలు మొదలైన వాటికంటె కండరాలలోని టిష్యూలు ఎక్కువ బలమైనవిగాను, ఎక్కువకాలం జీవించేవిగాను వుంటాయి. ఎక్కువ తాకిడిని కూడా భరించగలవు. గుండెకాయ నిర్మాణంలో ఇంకో ముఖ్య రహస్యంకూడా వుంది. దాని కండరాలు, నరాలు ఒక ప్రత్యేక లక్షణాలు కలిగివుంటాయి, ఒకసారి ఆగిపోయినా వాటిని వెంటనే రెచ్చగొడితే అవి తిరిగి పని చేసే స్వభావం, శక్తి కలిగివుంటాయి ఉదాహరణకు కప్ప గుండెకాయను వేరుగా తీసి దారంతో వేలాడగట్టి వుంచితే వారంరోజుల వరకుకూడా అది కొట్టుకుంటూ పనిచేస్తూనే వుంటుంది. చల్లని నెత్తురుగల కప్పలాంటి నీటి జంతువులలోనే గాకుండా భూమిమీద తిరిగే వేడినెత్తురుగల జంతువుల గుండెకాయలనుకూడా అలా పనిచేయించవచ్చునని లాంగిడోర్ఫ్ అనే శాస్త్రజ్ఞుడు రుజువుచేశాడు.

అందుచే కుల్యాటో్క మెదడుమీద పరిశోధనకంటె గుండెకాయమీద పరిశోధనముఖ్యమనే నిశ్చయానికి వచ్చాడు ఇతర జంతువుల గుండెకాయలతో కంటె నేరుగా మనిషి గుండెకాయతోనే తన పరిశోధనలు సాగించాలనుకున్నాడు

శరీరంనుంచి వేరుచేసిన గుండెకాయచే పని చేయించారు

1902 ఆగస్టు 3 వ తేదీ మానవ చరిత్రలో

సువర్ణాక్షరాలతో లిఖించవలసిన దినం. ఎందు కంటే ఆనాడు అలెగ్జీకుల్యాబ్కో తన పరిశోధనలో విజయం పొందాడు. నిమోనియా జ్వరంతో చనిపోయిన మూడునెలల పిల్లవాడి గుండెకాయను తీసి చెడిపోకుండా మంచులో పెట్టి ఒక 20 గంటల సేపు కాపాడాడు. ఆతరువాత రక్తానికి బదులుగా గుండెకాయ కండరాలకు ఆహారాన్ని సప్లయి చేసేఅలాంటి ద్రవపదార్థాన్ని దానిలోకి ఎక్కించాడు. ఆగుండె కాయ తిరిగి యథాప్రకారంగానే పనిచేయడం ఆరంభించింది. ఆ కొట్టుకోడం, రక్తనాళాల్లోకి రక్తాన్ని పంపుచేయడం అన్నీమామూలుగానే చేస్తోంది. ఈ విజయోత్సాహంతో ఇంకా చాల గుండెకాయలతో ఇదేవిధంగా పరిశోధనలు సాగించి తనసిద్ధాంతాన్ని ఋజువుచేసుకున్నాడు. కుల్యాబ్కో విజయం ప్రపంచమంతా మారు మోగిపోయింది. మరణం సంభవించినప్పుడు శరీరంలోని అన్ని అవయవాలూ చచ్చిపోవడానికీ, ముందు కొన్ని అవయవాలే చచ్చిపోడానికీ గల వ్యత్యాసాన్ని, కొన్ని పరిస్థితులలో చనిపోయిన అవయవాలచే తిరిగిపనిచేయించడం సంభవమవుతుందని, తన సిద్ధాంతాన్ని అతడు కొన్ని ప్రత్యక్షప్రదర్శనాలద్వారా చూపించాడు.

మరో కొత్త మార్గం

కుల్యాబ్కో పరిశోధనలు చాల మందిని ఉత్సాహ పరిచాయి. ఇంకా కొత్త మార్గంలో వాటిని సాగించడానికి పురిగొల్పాయి. అటువంటి వారిలో డా॥ ఓసినోవిస్కీ ఒకడు. ఈయన కేవలం లేబరేటరీలో పరిశోధనలు చేసే శాస్త్రజ్ఞుడు కాదు మాస్కోలో ఒక పిల్లల ఆస్పత్రిలో డాక్టరు.

ఓసినోవిస్కీ తన ఆస్పత్రిలో అంటువ్యాధులతో అకాల మరణం పొందే పసిపాపల మంచంమీద కూర్చొని, మృత్యువుతో పెనగులాడే వారి ముఖాలను పరిశీలిస్తూ వుండేవాడు. అలా చూస్తూ కూర్చున్నప్పుడల్లా అతని నొక ప్రశ్న పీడించుతూ వుండేది. ఈ పసికందుల ప్రాణాలను కాపాడలేమా? ఆ పిల్లల గుండెకాయలో కొంచమైనా బలం మిగిలి వుండదా? అది పూర్తిగా సడలిపోయి ఆగిపోక ముందే దానికి కొత్త బలాన్నిచ్చి నిలపలేమా? అని ఆలోచిస్తూ వుండేవాడు. చనిపోయిన వారు గుండెకాయను తీసి అది తిరిగి పనిచేస్తుందా లేదా అని చూడడం కాదు ప్రధానం. అది ఆ పిల్లవాడి శరీరంలో వుండగానే దానికి కొత్త ప్రాణంపోయాలి. అది ఎలా సాధ్యమౌతుందా అని లెక్కలు వేస్తూ వుండేవాడు. అందు కోసం ఏ జబ్బులో గుండెకాయ ఎలాంటి అవస్థకు లోనవుతుంది? ఎలాంటి జబ్బులతో చనిపోయి నప్పుడు గుండెకాయ తిరిగి పనిచేయించ డానికి వీలు లేకుండా చచ్చిపోతుంది? ఎలాంటి కేసులలో దానిలో ఇంకా తిరిగి పనిచేసే శక్తి మిగిలి వుంటుంది. ఇవన్నీ పరిశోధించ సాగాడు.

దీనికి కుల్యాబ్కో కనిపెట్టిన సూత్రాన్ని ఇంకా సంపూర్ణమైనదిగా చేయడంకాదు, దానిని సంక్షింప్తం చేయాలి. తేలిక చేయాలి. ఓసిలోవిస్కీ, ఆపని చేశాడుకూడ. పరిశోధనకోసం బైటికి తీసిన చనిపోయిన పిల్లవాడి గుండెకాయను, మంచులో కొంతసేపు పెట్టకుండా మామూలుగా బైటనే వేలాడగట్టి దానిలోకి రక్తానికి బదులు ఎక్కించే ద్రవాల్ని ఎక్కించి పనిచేయించాడు.

విజయం సాధించాం


దీనిమీద 'ఓసిలొవిస్కీ' 1936 లో 71 ప్రయోగాలు చేశాడు, వానిలో సగానికిపైగా విజయవంతమయాయి. ఆ ద్రవపదార్థం ఎంత సేపు సప్లయిచేస్తే అంత సేపూ ఆగుండెకాయలు పనిచేశాయి. ఇవన్నీ చూచిన తరువాత ఓసిలొవిస్కీ.కి ఆత్మవిశ్వాసం, ధైర్యం ఎక్కువయాయి. ఏ జబ్బుతో చనిపోయినాసరే, ఆ మనిషి గుండెకాయని తిరిగి పనిచేయించవచ్చు అని అతని సిద్ధాంతం.

"నాకు రోజురోజుకు నమ్మకం ఎక్కువవుతోంది. కొద్దికాలంలోనే మనం చాల మరణాలను తప్పించవచ్చు" అతడు ప్రకటించాడు.

అయితే ఒకటి అతనిలాగే మరణాలను అరికట్టాలనే పట్టుదలవున్న డాక్టర్లుగాని. శాస్త్రవేత్తలుగాని ఒక పనిమాత్రం చేయాలి. ప్రతి కేసులోను, తమ పరిశోధనను విడిచిపెట్టకూడదు. అంతేకాదు. అన్ని ప్రయత్నాలుచేసి మరీ మరణించాడని నిర్ణయించాలి. లేకుంటే బ్రతకవలసిన మనిషిని ఒకడిని సమాజంలో లేకుండా చేసిన దోషం తప్పదు.

"సోవియట్ వీక్లీ"నుండి

[మరికొన్ని పరిశోధనల వివరాలు వచ్చే సంచికలో]



అర్థాకలితో కళాశాలకు హాజరు

సంపాదక మహాశయా!

మా వ్యవసాయ కళాశాల హాస్టలుకు క్రితం సంవత్సరము 12 ఔన్సుల రేషను యిచ్చినపుడే చాలమంది బరువు తగ్గిపోయారు. కాని యీ సంవత్సరం 10 ఔన్సుల రేషను. అంటే అర్థాకలితో కాలేజీకి పోవలసివస్తోంది. కాని జులై 13 నుంచే 8 ఔన్సులు రేషను రాబోతుంటే మా స్థితి యెలా ఉంటుందో తెలిసికోవచ్చు. ఆహారధాన్యాల కొరతవల్ల పోయిన సంవత్సరము మేము సర్దుకొనిపోయాము. కాని దొంగమార్కెటు ఎక్కువయింది. ఈ సంవత్సరం 'నానాటికి తీసికట్టు నాగంభట్టు' అన్నట్లు రేషన్'మిష్టరు మాష్టర్‌మన్'అన్నట్లు 'ఒకపూట తిండి' క్రిందకొచ్చింది. ఈవిధంగా 'పొలం పని' (ఫీల్డ్‌వర్క్)చేసి అర్థాకలితో బ్రతుకుట చాలకష్టం - పొట్ట పుచ్చుకొని 'అన్నమో' అంటూ క్లాసుల్లోను ఫీల్డు వర్కు చేసేటప్పుడు మా అవస్థ యేమిచెప్పగలం. కళాశాల అధికారులెంత గోలచేసినప్పటికీ - మాకు రేషను మామూలుగనే యున్నది. కావున మా వ్యవసాయ కళాశాల విద్యార్థులను 'కాయకష్టం' చేసేవారిగా పరిగణించి ప్రభుత్వము సరియైన రేషను ప్రసాదించి - మేము సరిగా చదువుకొనేటట్లు చేస్తారని, ఆశిస్తున్నాను. మరియుముఖ్యంగా వ్యవసాయ మంత్రిగారికి, ఆహార మంత్రిగారికి, యీ విషయమై విన్నవించుకొంటున్నాను.

ఇట్లు,

బాపట్ల, వ్యవసాయ కళాశాల } అర్థాకలితో కాలేజీకిపోవు విద్యార్థి

వందలకొలది ప్రైవేటు విద్యార్థులకు సీట్లు లేవు

భారత ప్రజలలో నవచైతన్యం హెచ్చింది. ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష మెండగుకొలదీ విద్యాభిలాషకూడా హెచ్చయినది. కాని విద్యార్థులువిద్యనభ్యసించుటకు చాలఅంతరాయములు

(మిగతా 32 వ పేజీలో)

మీ సంస్థ నా జీవితంలో గొప్పమార్పు తెచ్చినది

ఆర్యా !

ఇందుతో రు 20 లు చెక్కు పంపుచున్నాను దీనిని "నవయుగ"కు నా విరాళముగా అంగీక రించవలయునని కోరుచున్నాను. ఇందుకు కారణం క్రిందచెప్పుచున్నాను.

1942 మార్చి స్కూలుఫైనలు పరీక్షలో తప్పినప్పటినుండి చదువు మానుకొంటిని అప్పటినుండి చలనచిత్తుడనై సంచరించితిని. సోమరితనముతో ఉత్కృష్టమైన కాలమును వ్యర్థపరచితిని. మనశ్శాంతి లేకుండినది.

1946 లో గుంటూరునందు జరిగిన అఖిల భారతవిద్యార్థి ఫెడరేషన్ మహాసభకు — నా స్నేహితుని బలవంతాన, వినోదయాత్రకు వచ్చినట్లు — వచ్చితిని. మహాసభకు వచ్చిన విద్యార్థుల ఐక్యత, క్రమశిక్షణ చూచి ఆశ్చర్య చకితుడనైతిని వారిత్యాగము, పని చూచితిని. నా చదువు సాగించుటకు అచ్చటనే శపథము చేసికొంటిని ఆ శపథము నా "ప్రేక్షకటికెట్టు" పై వ్రాసితిని. మీ ఐక్యతానినాదము నన్నాక ర్షించినది 1947 ఏప్రిల్ పరీక్షకు కూర్చొని ఉత్తీర్ణుడనైతిని. ఈ విజయము మీ సంఘము వల్లనే సంభవించినదని నమ్ముచున్నాను. మీ సంస్థ నా జీవితములో గొప్పమార్పు తెచ్చి, వెలుగుజాడలో నడిపించినది.

మీ సభ్యులతోకూడి విద్యార్థులసేవ చేయుదు నని వాగ్దానము చేయుచున్నాను ఈ నెల అంత్యములో మా కళాశాలలో చేరుచున్నాను.

ప్రతి "ది స్టూడెంటు", "నవయుగ" పత్రి కలను చదువుచున్నాను. మీ పత్రిక లేవిధంగా, విద్యార్థులను సక్రమపంథాలో నడుపుచున్నదీ, సమస్యలను పరిష్కరిస్తున్నదీ, నిరంకుశాధి కారుల నెదుర్కొనుచున్నదీ, ప్రపంచవిద్యార్థి యువకులతో సంబంధమేర్పరుచుకొనుచున్నదీ, ఐక్యతకు కృషిచేయుచున్నదీ తెలుసుకొను చున్నాను

నా వినయపూర్వక కృతజ్ఞతను తెలుపుటకు ఈ స్వల్పవిరాళమును పంపుచున్నాను.

అంధకారములో తడవులాడుచున్న చాలమంది యువకులు, మీ పత్రికలలోని ఉత్సాహపూరితమైన వ్యాసములవల్ల వెలు గును చూడగల్గుదురు గాక! అందుకు నా యీ స్వల్ప విరాళము.

యం. యస్. ప్రకాశలింగం

★ పాఠక లోకం

ఒక సోదరుడు యిట్లు వ్రాయుచున్నాడు ,—

"నవయుగ"లో ప్రతిమానవుని (స్త్రీలకు కూడా) శారీరకాభివృద్ధికీ, మనసికాభివృద్ధికీ కూడా తోడ్పడేటటువంటి, అందరికీ అందు బాటులోవుండే, "యోగవ్యాయామశాస్త్రము" (ఆసనములు)ను గురించి ప్రోత్సాహమిస్తూ, (పటములతోసహా) తగు సూచనలిస్తూ ఆసన ములను తగిన ప్రచారములోకి తీసుకురావాలని కోరుతున్నాను

యువకుల కార్యకలాపాలలో వీటికి ముఖ్య స్థానమిచ్చేలా చూస్తారని తలుస్తాను.

(2) ఇంకా టీ, కాఫీ, జూదం, త్రాగుడు, వ్యభిచారము, పొగత్రాగుట .. మొదలైన దుర్వ్యసనాలవల్ల కలిగే, దుష్ఫలితాలను వివ రిస్తూ, వాటికి లోనుగాకుండా మానవలోకాన్ని హెచ్చరిస్తూ, అందుకు వ్యాసాలు మొదలైనవి సేకరించి ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ వుండాలి.

(3) ఎప్పటికప్పుడు ప్రతి చిత్రాన్నీ సమీ క్షిస్తూ వాటిలోని మంచి - చెడుగులను ఎత్తి చూపుతూ సవరించు కోడానికి తగిన సూచన లిస్తూ వుండాలి.

అభివృద్ధి నిరోధకమైన (దుర్వ్యసనాలను అలవరిచే) చిత్రాలను నిషేధింప చెయ్యాలి

(4) ఆదర్శమైన ప్రపంచ ప్రముఖుల చరి త్రలను (రవీంద్రుడు, గాంధీజీ, టాల్‌స్టాయ్ సరోజినీ మొదలైనవన్నీ) కూడా ప్రచురిస్తూ వుండాలి.

(5) అన్ని రంగాలలోనూ వివిధ దేశాలకు మనకూ గల తేడాలను వివరిస్తూ అభ్యుదయ కరమైన సూచనలిస్తూ ఆచరింప చెయ్యాలి

[శరీరాభివృద్ధికి తోడ్పడు సూచనలు జులై సంచికలో ప్రకటించాం ముందు సంచికలో ఆసనాలపై వ్యాసాన్ని ప్రకటిస్తాం.

మీ యితర సూచనలను శక్తికొలది అమలు పర్చ కృషి సల్పుచున్నాం. కాని స్థలాభావంచే అనేక విషయాలపై వ్యాసాలను ప్రకటింప లేక పోతున్నాం. నెమ్మది నెమ్మదిగా అన్ని శీర్షిక లను ప్రచురిస్తూ వస్తాం,

— సంపాదకుడు]

భీమవరంనుంచి శ్రీ పి యస్, శర్మ యిట్లు వ్రాయుచున్నారు :

"నవయుగ గత 4 సంచికలు ఆంధ్ర విద్యార్థి యువజనలోకాన్ని ఉర్రూతలూగించాయి అనడం అతిశయోక్తి కానేరదని నా నమ్మకం. ప్రతి సంచికలోను ప్రతి రాష్ట్రముయొక్క విద్యార్థి ఉద్యమ చరిత్రలను సేకరించి ప్రకటించుటయు అన్ని రాష్ట్రముల విద్యార్థి ఉద్యమ చరిత్రలను సమీక్షచేసిన తర్వాత అఖిలభారత విద్యార్థి ఉద్యమమును సమీక్ష చేస్తూ ఒక వ్యాసం రావాలి ప్రతి 'నవయుగ' సంచికలోను సినిమా విమర్శమీద ప్రత్యేక విమర్శ పాఠకులకు అందివ్వాలి ఆ విమర్శ పూర్తిగా హిందీ చిత్రాలమీదనేగాక తెలుగు చిత్రాలపైగూడ ఉండాలి. నవయుగలాంటి పత్రికలను మాసపత్రికకంటె పక్షపత్రికవలె నడుపుట బాగుంటుంది. విద్యార్థులు యువకులు అటువంటి వాగ్దానము సంపాదకులనుండి వస్తుం దేమోనని ఆశపడుచున్నారు.

[ప్రతి రాష్ట్ర విద్యార్థి ఉద్యమ చరిత్ర సేక రించి ప్రచురించుట సాధ్యంకాని విషయం. ప్రతి రాష్ట్ర విద్యార్థి ఉద్యమం నేడు ఎట్లు ముందుకు పోతున్నది వివరించు వ్యాసములు, వార్తలు ప్రకటిస్తాం అఖిలభారత విద్యార్థి ఉద్యమ చరిత్ర క్లుప్తంలో అనువైన సమయం వచ్చినప్పుడు తప్పక ప్రచురిస్తాం.

సమీక్షలను ముందు సంచికలలో తప్పక వచ్చునట్లు కృషిసల్పుతాం.

ఇక పక్షపత్రిక విషయం. పక్షపత్రికగా ప్రచురించుటకు పాఠకులు నేడిచ్చే సహకారం చాలదు. నేటి ఆర్థికబాధలు పోవాలి. 'నవ యుగ' ప్రచారం యింకా హెచ్చాలి అను వైన సంపాదకవర్గం అభివృద్ధిపొందాలి పాఠ కులు ఎంత సహాయపడితే అంత త్వరగా పక్ష పత్రికగా 'నవయుగ'ను ప్రచురించ వీలవు తుంది —సంపాదకుడు]

చందా వివరాలు

సంవత్సర చందా	3-0-0
అర్థ సంవత్సర చందా	1-8-0
మూడు మాసాలకు	0-12-0
విడి ప్రతిక	0-4-0

(30 వ పేజీ తరువాయి)

కల్గుచున్నవి ఈ సంవత్సరము సీట్లు దొరకక 450 మంది యింటర్ విద్యార్థులు యింటి ముఖం పట్టారు III వ ఫారం క్రింది తరగతులకు జరిగే ప్రైవేటు పరీక్షలకు హాజరగుటకు 700 మంది విద్యార్థులు కాకినాడ వచ్చిరి కాని ప్రస్తుతం ఉన్న సీట్లు 150 మాత్రమే ఈ విధంగా కాకినాడవంటి ఒక పెద్ద కేంద్రంలోనే విద్యార్థులు బాధపడుతుంటే మిగతా వాటి సంగతి చెప్పవలెనా ? చదువుకొన నభిలషించే వారందరికీ సదుపాయములు కల్పించి విద్యాభివృద్ధికి తోడ్పడవలసినదిగా మంత్రివర్గమునకు విజ్ఞప్తి చేయుచున్నాను అందుకుగాను ప్రస్తుతమున్న విద్యాలయాలు యేమాత్రం సరిపోవు. నూతన విద్యాలయాల నిర్మాణానికై మంత్రివర్గం పూనుకోవాలి ఈ లోపుగా పాఠశాలల్లో "షిఫ్టు" పద్ధతిపై విద్యార్థులు చదువుకొనే పద్ధతి యేర్పాటుచేయాలి మన ప్రజామంత్రివర్గం తక్షణమే ఈ విషయాలపై తగుశ్రద్ధ తీసికొంటుందని ఆశిస్తున్నాను.

పొ. సుబ్బారావు

బాపట్ల వ్యవసాయ కళాశాల రాయలసీమ జిల్లాలకు మార్పా ?

(మా విలేఖరి)

బాపట్ల వ్యవసాయ కళాశాల - యిక్కడి నుంచి రాయలసీమ జిల్లాలకు మార్చాలని ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశ్యమైనట్లు యిక్కడ అధికారులనుండి తెలియవచ్చింది.

మరియొకచోటికి మార్చటమెందుకు ? ఈ సంవత్సరం. ఈ కాలేజీకి దాదాపు 600 అప్లికేషన్లు వచ్చాయి కాని లాభం ? 72 మందికే సీట్లు. అందుచే కాలేజీని యిక్కడనే ఉంచి రాయలసీమలో మరొక వ్యవసాయ కళాశాలను యేర్పాటుచేసి సీట్ల కొరత తీర్చవచ్చుగదా ! ఆంధ్ర విద్యార్థులు, ప్రజలు యిందుకు ఆందోళనజేస్తారని ఆశించుతాను.

తిరువూరులో లేబరేటరీని హెడ్మాష్టరు రూములోనికి మార్చాలి !

పత్రిక ఎడిటరుగారికి !

తిరువూరు బోర్డుహైస్కూలులో 5వ ఫారం విద్యార్థులు 18 మంది అప్షనల్ ఫిజిక్సు సీట్లకు అభిరుచి తెలిపారు కాని 8 మందికి మాత్రం సీట్లు యిచ్చుటకు వీలున్నదని హెడ్ మాష్టరు తెలిపాడు. గత సంవత్సరం తప్పిన విద్యార్థులకు కూడ సీట్లు యివ్వ నిరాకరించాడు. లేబరేటరీ చాలదు గనుక చేర్చుకోడానికి వీలులేదంటున్నాడు. హెడ్ మాష్టరు ఆఫీసు చాలా పెద్దది. చాలా విశాలంగా వుంటుంది. తన ఆఫీసును లేబరేటరీలోకి మార్చి ఎక్కువ మందికి సీట్లు యివ్వవలసినదిగా విద్యార్థులు గత 3 సంవత్సరాల నుంచీ ఆందోళన చేస్తున్నారు సైన్సు టీచరు కూడా 4 సార్లు అడిగినప్పటికీ నిరాకరించాడు. ఎందుకంటె గాలి, వెలుతురు తక్కువ అనేసాకు చూపుతున్నాడు. అది యిచ్చినట్లయితే 12 మందికి ఎక్కువగా సీట్లు యిచ్చుటకు అవకాశ ముంది. కనుక వెంటనే తన అఫీసును మార్చి ఎక్కువమందికి సీట్లు యిచ్చుటకు మంత్రివర్గం తోడ్పడాలని కోరుచున్నాను. తన సుఖానికి విద్యార్థుల కోరికను వ్యతిరేకించడం వెంటనే ఉపసంహరించుకొని తన అఫీసును మార్చువరకు విద్యార్థులంతా ఏక ముఖంగా కలసి ఆందోళన చేయాలని కోరుచున్నాను

తిరువూరు
4-7-47 } కొల్లా నరసింహారావు

Printed and Edited by A. K. R. B Koteswara Rao at Prajasakti Press, Mogalrajapuram, Bezwada